# రక్షణ వాణి

రక్షణ మహా సంకల్పన యం. దేవదాసు అయ్యగారు అనేక రూపములలో వ్రాసిరి. బూరలో చెప్పుటకు "రక్షణవాణి" అను పుస్తక రూపములో ఈ కథలు కొన్ని వ్రాయబడియున్నవి.

### పుణ్యకథలు ఆలకించుడి

పుణ్యకథలు ఆలకించండి – దేశీయులారా – పుణ్యకథలు ఆలకించండి = పుణ్యకథలు విన్నయెడల – పోవును మీ పాపరాశి– నాణ్యమైన దేవవాక్కు నరులను రక్షించువాక్కు॥

1. ఆలకించు చెవులనిచ్చెను–దేవాది దేవుడు ఆలకించు శక్తినిచ్చెను– ఆలకించు తెలివిగలిగి అన్నియు పరీక్షచేయు=వాలు తెలిసి –దైవసత్వము బైలుపడును పూర్తిగాను ॥

2. ఆలకించుచున్న వారిని – పగవాడుచూచి ఆలకింపకుండ జేయును మేలు మాటలాలకించి=మిగతమాట లాలకింప జాలకండి నట్టి తెల్వి – జన్మమందె దేవుడిచ్చె ॥

రక్షణ సంకల్పన ఒక వలవంటిది. ఇది సువార్తవల. గాలము కాదు గాలమునకు ఒక్క చేప మాత్రము పడును. **గాలము చేపకు హాని చేయును. వల చేపకు హాని చేయదు. చేపలు వలను తప్పించుకొనలేవు. వలమీద పడిన చేపలు వలలోనే ఉండును. సువార్త వల జాలరుల వలకంటె పెద్దది. అది అన్ని దేశములలో అన్ని కాలములలో ఒక్కొక్కరిమీద వేయబడుచున్నది.** రక్షణ సంకల్పన వల వేయబడిన దాని వర్తమానము దాటి వెళ్ళిపోలేరు. ఇది భూలోకమంతటిమీద పరచిన ఇంకా పరచబడుచున్న వల. ఇది పాతాళమంత లోతుగా దిగే వల, అన్ని కాలాల వల. అన్నిస్థలాల వల. అందరి వల. ఈ రక్షణ సంకల్పన వార్త విన్న ఆత్మ మానవాత్మ ఒక మిష చెప్పి తీర్పు తప్పించుకొనగలదా? విన్న తర్వాత నమ్మగలిగితే రక్షణ తప్పించుకోగలదా? అందరు రక్షణ తెలిసికొనుటకే ఈ వల అల్లబడియున్నది.

**రక్షణ బల్ల :–** శరీరాత్మల రక్షణ బల్ల. ఈ బల్లమీద దేవుడు అమర్చి పెట్టి మానవులందరికి చూపించు వస్తు సముదాయము ఏదనగా: పరలోకము, దేవదూతల సమూహము, ఆకాశలోకము, భూలోకము, బైబిలు, బైబిలులో బోధించు మతసంఘము, లేక భక్తుల సంఘము, కుమార స్వరూపము, పరిశుద్ధాత్మ కుమ్మరింపు. సన్నిధిని ప్రశ్నించి దేవునిని అడిగి తెలిసికొనవలసిన సన్నిధి పరిచయము, రాబోవు కాలమందు కలుగబోవు సౌఖ్యములు మొదలగునవి.

'సమస్తము సిద్ధముగా నున్నది రండి' అనునది దేవుని పిలుపైయున్నది.

ఎగిరి తప్పించుకొనవలెనని ప్రయత్నించు చేపలు వలలోనే పడును. వలకు చినుగు ఉంటే తప్పించుకొనిపోవును. అలాగే రక్షణ వలను తప్పించుకొనిపోలేరు. బోధకుల బోధలో లోటులున్న, సరిగా లేకపోయిన తప్పించుకొని పోవుదురు.

ఉపోద్ఘాతము: (బూర ప్రసంగ ధోరణి) భయపడరాదు. మేము చెప్పునది సంతోషకరమైన వార్త, ఈ మరధ్వని విని భయపడకండి. ఎక్కడి వారక్కడే ఉండి వినండి. అందరికి వినబడునది. అరుగుల మీదనున్నా, వాకిట్లో ఉన్నా, వీధిలో ఉన్నా, పొలాలువెళ్లు దారిలోనున్నా, నూతివద్ద ఉన్నా, బడిలో ఉన్నా, సందులో ఉన్నా, ఇంటిలో తలుపులు వేసికొని కిటికీలు తీసికొన్నా వినబడును. వినండి వినండి వినండి. పనిచేసుకొంటున్నా వినబడును. దీక్షమాత్రము దీనిమీద ఉన్న చాలును. ఏవిధముచేతనైన వినబడుతుంది. సప్పిడిచేయకుండ వినిన వినబడును. ఒకరికి చెవులు మూసికొన్న వినబడిందట. **మా మరమీద దేవుని దీవెన ఉన్నది.**

పాట : భయపడరాదు – జనాంగమ – భయపడరాదు
మిమ్ము భయపెట్టరాలేదు= దయతో దీనినివిని–దలంచుకొనండి
॥భయ॥

బ్రతుకుదెరువైనట్టి – పాటలు మాటలు – మతికివినోదమైన
–కథను ఆలించండి ॥భయ॥

అదరిపోరాదు మరియు – బెదరిపోరాదు = పదిలముగావిని
– మదిని ధ్యానించుడి ॥భయ॥

దేవునికి ప్రార్థన చేయుచున్నాము, వినండి ఓ దేవా! సర్వ లోకములను మా కొరకు సృజించిన దేవా నీకు స్తోత్రము. మమ్ములను నీకొరకు కలుగజేసికొన్న దేవా! తండ్రీ! నీకనేక వందనములు. పాపులమైన మా మేలు ఆలోచించి మహారక్షణ సంకల్పనను మాకొక నూతన సృష్టి దానముగ అమర్చినందుకు నీకు అనంతస్తుతులు సమర్పిస్తున్నాము. ఈ గొప్ప విషయము సర్వలోకమునకు ప్రకటించవలసినదని నీవు మాకు సెలవియ్యడములో నీవు మాయెడల గౌరవము కనబరచుచున్నందున నీకు కృతజ్ఞులమైయున్నాము. ఎన్నడును పాపము చేయని దేవదూతలు చేయవలసిన ఈ రక్షణబోధ, సేవ, మాకు అప్పగించినందులకు మాకెంతో ఆశ్చర్యముగానున్నది. గనుక నీకెన్నో నమస్కారములు. ఈ సేవ మేము నీ ముఖముచూచి సర్వజనుల రక్షణ ఆలోచించుకొని మహా వినయముతోను, సేవ వర్ధిల్లునను గొప్ప నిరీక్షణతోను సాగించుటకు కృప దయచేయుమని ప్రభు యేసుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

దేశీయులారా – మీ దేశస్థులమైన మేము చెప్పుచున్న మాటలు వినండి. మేమనుభవించిన సంగతులు మీ ఉపయోగార్థమై చెప్పవచ్చినాము వినండి. సహమానవులారా–మన మానవుల నిమిత్తము దేవుడు సంకల్పించిన కథ వినిపింతుము వినండి. ఇది పుణ్యకథ. దేవుని వాక్యములు వినవలసిన బాలులారా వినండి. మేము మీకీవేళ పరిశుద్ధమైన ఒక కథ చెప్పెదము. ఈ కథ వినువారు మహాధన్యులౌదురు. మహా మహా ధన్యులౌదురు.

వినదగు నెవ్వరుచెప్పిన
వినినంతనే వేగ పడక – వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడేపో నీతిపరుడు – మహిలోసుమతీ ॥

ఎవ్వరుచెప్పిన మొదట వినవలెను తరువాత పరీక్షింపవలెను. ఆ తరువాత మంచిదని తోచిన చేయవలెను. వినినిదే వద్దువద్దు అని అనకూడదు. వద్దు అనునది, కావలసినది వినకముందు ఎట్లు తెలియును. ఈ కథ అదివరలో మీరువిన్న నేను చెప్పుట వినలేదుగదా? గనుక వినండి ఈ కథ లోకములు పుట్టకమునుపే మొదలు పెట్టినది. ఇప్పుడింకా జరుగుచునేయున్నది. ఇప్పుడున్న లోకము అంతమయ్యేవరకు జరుగుచునే యుండును. అంత పెద్దకథ ఇది. కథ పూర్తిగా వినేవారి పాపములన్ని పరిహారమైపోవును. మోక్షభాగ్యములన్ని కలుగును. ఇది ఉపోద్ఘాత కథ.

## నాస్తికుని మార్పు కథ

నాస్తికునికి క్రైస్తవ బోధకునికిని జరిగిన సంభాషణ. **నాస్తికుడు:** మీరెప్పుడు దేవుడు దేవుడంటారు, దేవుని చూడనిదానికెందుకనాలి. మీరెప్పుడైనా దేవుని చూచినారా? ***బోధకుడు :*** దేవుడు ఉన్నాడని మేము చెప్పుచుండగా నమ్మని మీరు దేవుని చూచాము అని అంటే మాత్రము నమ్ముతారా ఏమి? ***నాస్తి :*** రుజువుపరిస్తే నమ్మకేమి, చూచాము అని అంటే ఎందుకు నమ్మను? ***బోధ :*** ఇప్పుడే మీకు బోధపరుస్తాను, నేను చెప్పినట్లు చేయండి (ఇద్దరు సరే సరే అనుకున్నారు) **నాస్తి :** ఏమి చేయమంటారు? ***బోధ :*** నేను మోకరిస్తాను, మీరుకూడ మోకరించండి, ***నాస్తి:*** ఎవరి ఎదుట మోకరించడము? ***బోధ:*** దేవుని ఎదుట. ***నాస్తి:*** సరి సరిలే, దేవుడనేవాడులేడు అంటూ ఉండగా నన్ను దేవుని ఎదుట మోకరించుమంటారా? మహా బాగా ఉన్నది. ***బోధ :*** మీకు రుజువు కావలెనుగదా, మోకరించకపోతే రుజువు ఎలాగు దొరుకుతుంది (ఏలాగైతేనేమి చెప్పగా చెప్పగా అతడు మోకరించెను) ***బోధ:*** ఇప్పుడు కండ్లుమూసికొనండి. ***నాస్తి:*** ఇది మరీ బాగున్నది. దేవుడున్నాడని నమ్మకములేనిదే కళ్ళు ఎలాగు మూసుకొంటాను, మీ క్రైస్తవులు చేసినట్లు? ***బోధ :*** అయ్యా నేను చెప్పినట్టు చేయండి మీకేమి నష్టములేదుగా, (తుదకు కళ్ళుమూసుకోవడము వరకు వచ్చిది కథ) ఆ తర్వాత ఏమి జరిగిందంటారా? ***బోధ :*** అయ్యా నేను చెప్పే మాటలు మీరుకూడ

చెప్పండి. **నాస్తి :** ఏమి మాటలేమిటవి? **బోధ :** దేవా! పాపినైన నన్ను కరుణించుము (అని నేర్పబోయెను) **నాస్తి :** మా బాగా చెప్పినారు. నేను అనను. దేవుడున్నాడని నాకు తోచడములేనిదే దేవా అని ఏలాగంటానయ్యా, **బోధ :** అయ్యా మీరీమాటలనండి, అంటే మీదేమి పోయింది, హానిలేదుగా దేవుడుంటే తప్పక బయలుపడును, లేకపోతే లేనేలేదు. ఉంటే మీకే స్వయముగా తెలుస్తుంది. లేకపోతే తగాదాలేదు అప్పుడు అనడము మానివేయవచ్చును. **నాస్తి :** సరే అంటానులెండి, ఆ మాట తిరిగి చెప్పండి (అప్పుడేమి జరిగిందో వినండి) దేవా పాపినైన నన్ను కనికరించుము అని బోధకుడు అనుచుండగా ఒకదరినుంచి నాస్తికుడు అనుచుండెను, ఆ మాటలే అనగా అనగా ఆ మాటలు నాస్తికుని మనస్సులో నాటుకొనిపోవుచుండెను. ఆ మాటలమీద అతనికి ఇష్టము కలుగుచున్నది. తర్వాత ఏమి జరిగినది? బోధకుడు అనడము అవసరము లేకుండా ఆ నాస్తికుడు స్వయముగా అనడము మొదలుపెట్టెను. తనకు తానే కొంతసేపు అనిన తర్వాత అతనిలో వణుకు పుట్టినది, ఎందుకనగా అప్పటికే దేవుడున్నాడను నమ్మకము అతనిలో పుట్టెను. ఉన్న దేవునిని లేదు లేదు అన్నానుగదా! ఇన్నాళ్ళనుండి అనే విచారముకూడ అతని మనసులో కలిగెను. అప్పుడా నాస్తికుడు దేవా! పాపినైన నన్ను కనికరించుము అని పెద్దకేకవేసెను, ఏడ్చెను, కంట నీరు పెట్టెను, నేలమీద పడినాడు. చూచినారా! ప్రయత్నము చేయగా నిజము తెలిసినది. ప్రార్థనచేయగా నిజము బైలుపడినది. ఇష్టములేని ప్రార్థన చేసిన చివరకు ఇష్టము కలిగినది. శాస్త్రము చదివిన బోధపడని సంగతి ఒకరోజున కొన్ని నిమిషములు ప్రార్థనచేయగా బోధపడినది.

కాబట్టి ప్రియులారా మీరును అలాగే చేయండి మాబోధ నిజమోకాదో పరీక్షించడానికి ప్రార్థన చేయండి. ఇదివరకే దైవభక్తి విషయములు మీకు నచ్చియున్న ఆ అంశమును గురించి ప్రార్థించనక్కరలేదు, గాని దేవుడే మన నిమిత్తము నరుడై యేసుక్రీస్తు అనుపేరు పెట్టుకొనెను. ఆయననే పూజించిన మోక్షమని క్రైస్తవులు చెప్పు బోధ మీకు నచ్చకపోతే ప్రార్థన

చేయండి. నిజము మీకు తెలియును. దేవుడైన ఆ క్రీస్తే మరల రెండవ సారి మేఘముమీద వస్తారు. నమ్మిన వారిని మేఘముమీద ఎక్కించుకొని మోక్షలోకమునకు తీసికొని వెళ్ళుదురు. కాబట్టి ఆఖరుమాట– దేవుడనే ఒకాయన ఉన్నాడనియు, ఆ దేవుడు మనలను రక్షించుటకు మనిషై జన్మించినాడనియు, యేసుక్రీస్తు అను పేరు పెట్టుకొన్నాడనియు ఆయనను నమ్ముకొన్న మోక్షమనియు ఆయనే ఇప్పుడు బహు త్వరలో వచ్చుచున్నాడనియు మీకు అర్ధము కాకపోయిన ప్రార్థించండి, అర్ధమగును, చేస్తారా! నాస్తికుడు చేసినాడుగదా! మీరు చేయలేరా, చేయండి అట్లుచేయగల శక్తి దేవుడు మీకు అనుగ్రహించును గాక!

### దేవదూషణ కూడదు

1) దేశీయులారా! మహా ముఖ్యమైన విషయమొకటి జ్ఞాపకము చేయుచున్నాము అదేమనగా దేవునియొక్క లక్షణములను గురించి అనగా ఆయన స్వభావమును గురించి మనకు దురభిప్రాయముండకూడదు. ఒక తల్లికి ఒకే కుమారుడు, అతనికి యుక్తవయస్సు వచ్చునప్పటికి ఏదో ఒక జబ్బువలన మరణించెను. అప్పుడా తల్లి నాకు కుమారుడు ఉండుట చూచి దేవుడు ఓర్వలేక చంపివేసినాడు అని ఏడ్చెను. దేవుడు ఓర్చలేనివాడా? ఆయనకు ఓర్చలేని గుణముండునా? తల్లి అలాగు అనుకొనవచ్చునా? అట్లు అనుకొనుటయే దేవదూషణ కుమారుని ఇచ్చిన దేవునికి అసూయ, కిట్టని తనము ఉండునా? మనమెప్పుడును దేవుని గురించి చెడు అభిప్రాయము కలిగియుండకూడదు. ఇది గొప్ప పాపమని చాలమందికి తెలియదు. ఆ కొడుకు పొరపాటులో పడి జబ్బువలన చనిపోయెను. దేవుడు చంపినాడని ఎందుకు నింద మోపవలెను. తన కుమారునిపై నేరము వేయాలిగాని ఒకరు నేరముచేసిన మరొకరిమీద మోపుట నేరముకాదా? నేరము లేని దేవునిమీద మోపుట మరీనేరము కాదా? అట్లుచేయుట తప్పు అని మనిషికి తెలియుటలేదు.

2) మరియొక సంగతి, మనుష్యులు ఒకరినొకరు కొట్టుకొని చంపుకొనుచున్నారు, కొట్టుకొనువారి దేవుడు ఆపుచేయకూడదా? మనిషిని

దేవుడే పుట్టించెనుకదా? మనిషి దేవునికి కుమారుడుగదా? ఆలాగు చంపుచున్నప్పుడు దేవుడు ఎందుకు ఊరుకొంటున్నాడు, దేవునికి మనిషి అన్న లెక్కలేదు అని కొందరు దేవుని దూషించుచున్నారు. దేవుడు ఊరుకొనక ఏమిచేయవలెను. కొట్టవచ్చిన మనిషిని చంపవలనా? దేవుడు న్యాయస్థుడు, ఆ చంపిన మనిషిని శిక్షించును, అధికారులచేత శిక్ష వేయించును. ఆ నరహంతకుని సంగతి ఒకవేళ అధికారులకు తెలియని యెడల దేవుడతనిని ఏదో విధముగ శిక్షించును. అతడు జబ్బువలన ఘోరముగా చనిపోవచ్చును. అతడు దగ్గరనున్న వారికి నేను ఫలాని మనిషిని చంపినాను, అందుకే ఈ శిక్ష అని చెప్పి విలపించుచూ చనిపోవును, గనుక దేవుడు ఊరుకొన్నాడు అని మనము తలంచకూడదు. ఆ నరహంతకునికి ఈ లోకములో శిక్ష లేకపోయిన నరకలోకములోనైనను శిక్ష వచ్చును. ఆ నరహంతకునికి ఆ మనిషిని చంపిన తర్వాత అతని మనసులో గొప్ప నరకముండును. ఎక్కడనులేని మనో వేదనతో బ్రతికినంత కాలము పీడింపబడును. ఇది శిక్షకాదా? ఆ మనిషిని చంపినప్పుడు దేవుడు ఎందుకూరుకొన్నాడని ప్రశ్నించిన, దేవుడు అన్యాయస్థుడని దేవుని దూషించినట్టే. దేవుడు న్యాయ స్వభావముగలవాడు, ఆయన అన్యాయ మెప్పుడును చేయడు. మనము ఆయనను గ్రహించలేక అన్యాయస్థుడని చెడు కార్యములు జరుగుచున్నపుడు ఊరుకొనుచున్నాడని అందుము. దేవుడు దయగలవాడు గనుక మనిషి తన దుర్గుణము తనంతట తాను తెలిసికొనుటకు ఎక్కువ సమయమిచ్చును.

3) ఇంకొక సంగతి– కొందరు దేవునిని మరొక విధముగా దూషించుచున్నారు. మనిషిని పుట్టించుట, తర్వాత అనేక కష్టముల పాలుచేయుట తుదకు చంపివేయుట. ఇదంతా ఒక తంతులాగ ఉన్నది. ఎందుకు పుట్టించుట, మనిషి పాపము చేయుచుండగా ఎందుకు ఊరుకుండుట అనుచున్నారు. ఇదికూడ దేవదూషణయే. ఎందుకనగా ఎందుకు పుట్టించవలెనో, ఎందుకు ఊరుకొనవలెనో ఎందుకు చావనివ్వవలెనో మనకేమి తెలియును? ఆయన జ్ఞానముకన్న మన జ్ఞానము మహా ఎక్కువా ఏమిటి?

జ్ఞానము గలవానికి ఒక క్రమమున్నదని మనకు తెలియును, జ్ఞానముగల మనిషి ఒక క్రమము ననుసరించి పనులుచేయునని మనకు తెలియును. జ్ఞానముగలవాడు ఏదిబడితే అది చేయడు, ఎప్పుడుబడితే అప్పుడు చేయడు, ఎక్కడబడితే అక్కడ చేయడు. అతడు చేయు ప్రతి పనికి క్రమముండును. దేవునికి క్రమముండదా? ఆయనకే ఎక్కువ క్రమము. గనుక ఆయన చేయుచున్నపని చూచి మనము ఆక్షేపించకూడదు. అయినా కష్టాలపాలుచేయుట, జబ్బులు పంపుట, చంపుట అవి దేవుని పనులా? అవి దేవుడు చేయుచున్నాడా? అయ్యో! అలాగనుట ఎంతపాపము, మీ బిడ్డలమీదికి మీరు జబ్బు పంపుదురా? మీ బిడ్డలను మీరు చంపుదురా? మనమందరము దేవుని బిడ్డలముగదా, ఆయన మన తండ్రిగదా, ఆయన మనలను చంపునా? అలాగు అనకూడదు. ఆదిలో దేవుడు మనిషిని కలుగజేసినప్పుడు కష్టాలు కలుగజేసినాడనుకొనుచున్నారా? జబ్బును కలుగజేసినాడా? లేదు లేదు చావు కలుగజేసినాడా? లేదు. ఇవన్నీ సైతానువల్ల వచ్చినవే. సైతానుమీద నేరము మోపండి, దేవునిమీద నేరము మోపవద్దు, సైతాను మాటవిని మనిషి చిక్కులోపడుచున్నాడు, మనిషిని అనండి, దేవునిని అనవద్దు 4) ఇంకా కొందరు ఇంకొక ప్రశ్నవేయుచున్నారు- ఆ సైతానుకు దేవుడు ఆ దుర్బుద్ధి పుట్టకుండ చేయలేకపోయినాడా? అని దేవునిని దూషించుచున్నారు. మనిషి పాపము చేయునప్పుడు దేవుడు వచ్చి ఆపుచేసిన మనిషి పాపము మానివేయును. పాపము మానివేయడము దేవుడు ఆపుచేసినాడు గనుక పాపము మానివేయును లేక పోయినా మానునా? దేవుడు ఏమికోరుచున్నాడు. దేవుడు ఆపుచేయకుండ మనిషి తనంతట తాను పాపము మానివేయవలెనని దేవుడు కోరుచున్నాడు. మనిషి తన స్వంత ఇష్ట ప్రకారము దేవునిని పూజించవలెను. ఇదే దేవునికోరిక. పాపము మానుము, నామాట వినుము, నన్ను పూజించుము అని దేవుడన్న మనిషి చేయునా? ఒకవేళ చేసినను అది బలవంతపు సేవగాని ఇష్టానుసారమైన సేవకాదుగదా! బలవంతముగా దేవుడు ఇది ఆపుచేయలేదు అది ఆపుచేయలేదు అని మనము దేవునిమీద నేరములెంచకూడదు. 5) మరికొందరు ఈలాగనుచున్నారు.

త్రవ్వనేల పూడ్చనేల, దేవుడు మనిషిని ఎందుకు కలుగజేయవలెను, ఆ మనిషిని రక్షించుటకు తానెందుకు మనిషిగా జన్మింపవలెను. సిలువ మ్రానుమీద ఎందుకు చావవలెను. ఎందుకు వచ్చిన తిప్పలు ఇవన్ని, అసలు మనిషిని పుట్టించకుండ ఉండలేకపోయినాడా అని కొందరు ఆయన పనిని ఆక్షేపిస్తున్నారు. దేవుడు జీవమైయున్నాడు. జీవముగలవాడు ఏ పని చేయకుండ, ఆలోచించకుండ, కదలకుండ, మెదలకుండ ఉండగలడా? ఆ పని ఈ పని చేయకుండ నుండగలడా? దేవుడు జీవము గలవాడు గనుక మనకు తోడుగా నుండుటకు దేవదూతలను చేసెను. మనము నివసించుటకు భూమిని చేసెను. మనకు దీపములుగానుండు సూర్యచంద్ర నక్షత్రములను చేసెను. తుదకు మనుష్యులను చేసెను. ఎందుకు చేసినాడు, జీవము గలవాడు గనుక తాను చేసిన మనిషి చెడిపోయినాడు. గనుక అప్పుడేమి చేయవలెను. బాగుచేయుటకు తానే మనిషిగా వచ్చెను. రక్షించుటకు రావద్దు అంటారా? దేవుడు జీవము గలవాడు గనుక రెండు పనులు చేసెను. సమస్తమును మనలను కలుగజేయుట మొదటిపని, మరియు మనమును సమస్తమును చెడిపోయినందున బాగుచేయుటకు ఆయనే వచ్చినాడు. ఇది రెండవపని. నేటివరకు ఈ రెండు పనులు చేయుచునేయున్నాడు. ఇంకను చేయుచుండును. అందుచేత ఆయనను పూజించవలెనుగాని, దూషింపకూడదు.దేవునిలో తప్పులు పట్టుటకు ఆయన జ్ఞానమెక్కడ మన జ్ఞానమెక్కడ. ఆయన పరిశుద్ధుడు గనుక ఆయనలోను తప్పులుండవు. ఆయన పనులలోను తప్పులుండవు. దేవుడు పరిశుద్ధుడు, దేవుడు పరిశుద్ధుడు, దేవుడు పరిశుద్ధుడు. కాబట్టి ఆయనను ఏమియు అనకూడదు. అంటే మనకే నష్టము. ఏమి నష్టమంటారా? ఆయన చెంత చేరలేము. చేరకపోయిన ఇటువంటి మాటలనిపించు సైతాను చెంతచేరి ఉ ందుము. ఇది నష్టముకాదా? అతనితోపాటు నరకమునకు పోవుట నష్టము కాదా? 6) ఇంకా కొందరేమనుచున్నారు. దేవుడు పాపము చేయించుచున్నాడు అంటున్నారు. అయ్యో ఈలాగనుట ఎంతపాపము. దేవుడు పాపము చేయించు వాడైన పాపాత్ములందరికన్న దయ్యాలన్నిటికన్న దేవుడే గొప్ప పాపి. ఆలాగనుట వలన మనము దేవునిని గొప్ప పాపాత్మునిగా చేయుచున్నాము ఎంత గొప్ప

దోషము. ఒకటి జ్ఞాపకముంచుకొనండి. దేవుడు మంచివాడు ఆయన ఆలోచనలు మంచివి. ఆయన పనులు మంచివి. ఈ మాటలు నమ్మిన మనముకూడ మంచివారము కాగలము. తుదకు ఆయనలో చేరగలము, సుఖింతుము. నిత్యము జీవింతుము దేవుని దూషించినందున ఎప్పుడో నరకములో మాత్రమే కాక ఈ లోకములో కూడ బాధలు అనుభవింతుము. అలాగే దేవుని మెచ్చుకొన్నందువలన ఎప్పుడో మోక్షములో మాత్రము కాదు ఈ లోకములోకూడ సంతోషము అనుభవింతుము. దేవునిని, ఆయన పనిని చూచి ఆనందించు మనసు కలుగునుగాక. 7) మరికొందరు ఇంకొక ప్రశ్న వేయుచున్నారు. దేవుడు ఒకరిని భాగ్యవంతులనుగా చేయుచున్నాడు, ఒకరిని బీదవానిగా చేయుచున్నాడు, ఎందుచేత? ఎందుకో మనము అంత బాగుగా చెప్పలేము గాని దేవుడు న్యాయస్థుడు అనుమాట మనము జ్ఞాపకముంచుకొనిన యెడల ఆయన పక్షపాతి అనియు అన్యాయము చేయువాడనియు అనుటకు మనకు నోరురాదు. ఈ ప్రశ్నకు కొంతవరకు జవాబు చెప్పవలెను. జవాబు కనుక్కొనవలెను. దేవుడు అన్యాయస్థుడైన, పక్షపాతియైన ఆయన దేవుడేలాగు అగును. అటువంటి వాడని మనము తీరా అనివేసిన యెడల తుదకు మనమే తీర్పునాడు సిగ్గుపడవలసి వచ్చును గనుకనే తెలియకపోయిన ఊరుకొనవలెను గాని మన ఇష్టము వచ్చినట్లు అనుకొనరాదు మరి ఏమిటి ఈ ప్రశ్నకు సమాధానము కష్టపడి పనిచేసుకొనేవారు ధనికులగుదురు. పని అంటే బద్ధకించువారు బీదలగుదురు. కష్టపడి సొమ్ము సంపాదించినను కొందరు సొమ్ము దుబారాగా వాడుకొన్నందువల్ల పేదవారగుదురు. దానికి దేవునిని ఏమనగలము. మనకు కావలసినవన్నీ దేవుడు భూలోకములో అమర్చి ఉంచెను. మనము బీదవారము కావలసిన పనిలేదు. మన తండ్రి భాగ్యవంతుడు మన తండ్రి కలుగజేసినదంతా భాగ్యమే. మనము బీదవారమగుటకు ఆయన ఏమియు చేయడములేదు. మనము భాగ్యవంతులము కావలెననియు ఆయన కోరుచున్నాడు. దేవుడు నా కాపరి నాకు లేమి కలుగదు అని ఒక కవీశ్వరుడు చెప్పినమాట బైబిలులోనున్నది. సమస్తమును మీవి

అనికూడ ఉన్నది. మనకు కావలసినవి సమృద్ధిగా దొరకకపోయిన మన లోపమే కాని దేవుని లోపము కాదు. లోకము పాపము చేసినందువలన పేదరికము, వ్యాధి, మరణము ఇవి లభించుచున్నవి. లోకములోనికి పాపమే రాకపోతే నరులు పాపము చేసియుండకపోతే ఈ బాధలే మనకు లేకపోవును. మనము బాధలు తెచ్చుకొనడమేమిటి? దేవునిమీద పెట్టడమేమిటి? మనము దేవునిమీద మోపు నేరములు చాలగలవు. మోపినకొలది మన నేరముల మోపు ఎక్కువగుచున్నది. గనుక దేవుడు స్వయముగా చేయు పనులను చూచి మనము సంతోషించవలసినదే గాని మనకు అర్ధమగుటలేదని చెప్పి ఆయన పనులలో తప్పులుపట్టకూడదు. కీడు జరుగుచున్నప్పుడు ఆయన ఊరుకొనుచున్నందుకు మనము తప్పులు మోపకుండ ఊరుకొనవలసినదే. ఆయనపై తప్పులు మోపుట మనకు న్యాయముకాదు. శుభముకాదు. మనలో ఉన్న మంచితనమును వృద్ధిచేయుటకు దేవుడొకానొకప్పుడు కష్టములు రానిచ్చును. గనుక ఆనందించవలెను. అట్లు ఆనందించు శక్తి మీకు కలుగునుగాక. 8) పాపము మానివేయవలెనని ఉన్న దేవుని ప్రార్థించండి. అప్పుడు మానివేయుటకు శక్తి కలుగును. పాపము మానివేయగలరు. దేవుని పూజించవలెనని ఉంటే దేవుని ప్రార్థించండి. అప్పుడు పూజించు శక్తి కలుగును. పూజించగలరు. ఏమి కోరిన ఇవ్వగలిగిన దేవుడు, మన ప్రార్ధనలను వినుట ఆయనకెంతో ఇష్టము. గాలి, నీరు, భూమి, చెట్లు, ఎండ, వెన్నెల ఇవ్వన్ని మనము అడగకముందె, పుట్టకముందె కలుగజేసినాడుగదా! మనలను కష్టాల పాలు చేయునా? మనకు ఉపకారము చేసిన దేవునిని అపకారిగా భావించవచ్చునా? ఈ ఉపకారములు మాత్రమేనా? ఇంకా ఎన్నో ఉపకారములు చేసెను. ఆయన మనలను పాపములనుండి, కష్టములనుండి రక్షించి మోక్షములో చేరుటకు ఈ లోకములో జన్మించెను. ఆయనే త్వరలో వచ్చి నమ్మిన వారిని బ్రతికి ఉండగానే మోక్షమునకు తీసికొని వెళ్లును. ఇంతకంటే గొప్ప ఉపకారము ఏమున్నది. దేవుడు చేయునవి తెలియకపోయిన మాట్లాడక ఊరుకొనవలెనుగాని దేవుడు చేయునవి బాగుగా లేవని అనవద్దు అందువలన మనకు హాని. దేవునియెడల మీకు మంచి అభిప్రాయము కలుగునుగాక!

# అనాది

శ్రీమంతుడైన దేవుడు అనాదిలో ఒంటరిగానే ఉండెను. అప్పటికి కాలమనునది లేదు. ఎండకాలము, వర్షాకాలము, శీతాకాలము అను కాలములు లేవు అలాగే వర్షఋతువు, శరద్రఋతువు, హేమంత ఋతువు, శిశిర ఋతువు, వసంత ఋతువు, గ్రీష్మఋతువు అను ఋతువులు లేవు అలాగే కృత యుగము, త్రేతయుగము, ద్వాపర యుగము, కలియుగము అనునవి కలిగియుండలేదు. మరియు లోకములు గాని, నరులుగాని లేరు. మరియు దేవదూతలు లేక ముందు మనలను పాపములో పడవేయు సాతానుడు వాని అనుచరులు లేకముందు అనాది కాలము, నరులమైన మనకు జీవనాధారమైన గాలి, ఆకాశము, సూర్య చంద్ర, నక్షత్రములు లేకముందు ఎగురుచు ఉన్న పలువిధములైన పక్షులు, భూమిమీద సంచరించు పాపిని మృగములు జలములలో సంచరించు జలచరములు లేకముందు, చూపునకు రమ్యమైనదియు, ఆహారమునకు మంచిదియునైన ప్రతి వృక్షమును తినకూడదని దేవుని మూలముగా చెప్పబడిన కీడు, మేలు తెలియజేయు వృక్షములు లేక మునుపు మన ఊహలోనికి రాగలిగినది ఏదియు లేకముందు, దేవుడు ఒంటరిగానే ప్రకాశించుచుండెను.

సర్వలోకమును కలుగజేయవలెనన్న ఆలోచన దేవునికి అనాదిలోనే ఉన్నది. ఆ అనాదిలోనే నిన్ను, నన్ను కలుగజేయవలెనన్న తలంపు ఆ దేవునికి ఉన్నది ఆ దేవునికి ఎంతగొప్ప జ్ఞానము, ఎంత గొప్ప ప్రేమ, నరుని కలుగజేయక మునుపు నరులకు ఉపయోగార్థమైన భూలోకమును అందలి సృష్టినంతటిని కలుగజేయవలెనని దేవుడు యోచించియున్నాడు, నరునిమీద దేవునికి ఉన్న ప్రేమ ఇప్పటికికాదు గాని అనాది నుండి వచ్చిన ప్రేమయై యున్నది.

జగత్తు పునాది వేయబడకమునుపే ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పర్చుకొనెను. ఎఫెసీ. 1:6.

సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు అనాది నుండి రహస్యముగా ఉంచబడి ఇప్పుడు ప్రత్యక్షపరచబడిన మర్మము నిత్య దేవుని ఆజ్ఞ ప్రకారము ప్రవక్తల లేఖనము ద్వారా వారికి తెలుపబడియున్నది. రోమా. 16:25.

అనాది కాలము మొదలుకొని మొదటి నుండి భూమి ఉత్పత్తి అయిన కాలమునకు పూర్వము నేను నియమింపబడితిని. సామె. 8:23.

దేవునికి ఆది లేదు ఎప్పటినుండి ఉన్నాడనునది ఆలోచించుటవలన మన మనస్సునకు అనర్థము, ఈ మాట విన్నవారందరు మనస్సులో ఆయనకు నమస్కరింతురుగాక!

# అనాది లక్షణముల మహాసభ

**దేవుని లక్షణములు : 1) ఆదిలేనివాడు:** ఆయనను ఎవ్వరును కలుగజేయలేదు. ఆయన అంతట ఆయనే ఉన్నాడు. సృష్టింపబడకుండ ఉన్నవాడు గనుక ఆయన ముందే ఉండి మన కథలన్నియు చూస్తు మనకు కావలసిన ఏర్పాటులన్నియు చేయుచున్నాడు. గనుక వందనములు. **2) అంతములేనివాడు** : అనంతదేవుడు అనగా ఎల్లప్పుడు ఉండగల దేవుడు ఆయన అంతములేనివాడు గనుక అంతములేని తన దగ్గర అంతము లేనంతకాలము మనలను తనదగ్గర ఉంచుకొనును, గాని నాశనముచేయడు. స్థలముకాని స్థలములో, కాలముకాని కాలములో ఆయనవద్ద నిత్యము మనము ఉందుము. ఆయన నన్ను అనంతము తన సన్నిధిలో ఉండనిచ్చును, గనుక స్తోత్రము. **3) ప్రేమ:** దేవుడు ముగ్గురుగా (త్రిత్వము) నుండకపోయిన దేవుని ప్రేమించుట ఉండదు. జీవరాసులు ఒకదానినొకటి ప్రేమించుట దేవుని ప్రేమనుబట్టియే. మనుష్యులుకూడ ఒకరినొకరు ప్రేమించుకొనుట కూడ ఆయన ప్రేమయే. భూలోకములో తల్లిదండ్రులు బిడ్డలను ప్రేమించుటకన్న దేవుడు మానవులను ఎంతో ఎక్కువగా ప్రేమించుచున్నాడు. ఆయన ఎల్లప్పుడు ప్రేమగానే యుండును. నన్ను కలుగజేసినవాడు నన్ను ప్రేమించకపోతే ఇంకేమి చేయును. దేవుని ప్రేమనుబట్టి మానవులకు కావలసిన సదుపాయములన్ని

ఆలోచించి చేసినాడు. ప్రేమనుబట్టి మనలను సహించుచున్నాడు. ప్రేమనుబట్టియే శిక్షించుచున్నాడు. పాపములు జ్ఞాపకము చేసికొనను అన్నాడు గనుక నుతులు. **4) పరిశుద్ధత :** దేవుడు ఎప్పుడును పొరపాటు చేయనేరడు. సమస్త సృష్టిని మానవుని పరిశుద్ధముగానే కలుగజేసెను. పాప ప్రవేశమునుబట్టి అపరిశుద్ధత మానవునికి కలిగినను దేవుని పరిశుద్ధతనుబట్టి మరల పరిశుద్ధత మానవునికి దయచేయుచున్నాడు. లోకములో పాపమున్నను పరిశుద్ధతకూడ ఉన్నది. వర్షజలములలో, కాయలలో, పండ్లలో పరిశుద్ధత కనబడుచున్నది. అపరిశుద్ధుడగుచున్న మానవుని ఒకదరినుండి శుద్ధిచేయుచుండుట ఆయన పరిశుద్ధతయొక్క స్వభావము గనుక ఆయనకు స్తోత్రములు. **5) సర్వశక్తి:** ఏదిబడితే అది చేయగలడు ఆయన చేయలేని పనిలేదు, అయితే పాపము అశక్తియై ఉన్నది గనుక దేవునికి అశక్తిలేదు. దేవుడు సర్వశక్తిమంతుడు. గనుక మానవులకు, జీవరాసులకు శక్తి ఇచ్చెను. గనుక నడువగలరు, పనిచేయగలరు, మానవుని విషయములో కష్టమైనపనియైనను, అసాధ్యమైన పనియైనను చేయగలడు. నాకేమి తెచ్చిపెట్టుమని కోరినను అది ఇచ్చును. నేను తేలేను అని అనడు. ఏది చేయుమన్న చేయలేను అనడు, తండ్రీ పడిపోయినను లేవనెత్తుము అనిన లేవనెత్తలేననడు. ఎవరైనను నాకు శక్తిలేదు ప్రభువా అన్నయెడల నాశక్తి ఉన్నదిగదా! లేదని ఎందుకంటావు అనుచున్నావు గనుక నీకు స్తుతులు. **6) సర్వజ్ఞాని :** మన కష్టములు, కోరికలు మనము చెప్పకముందే ఆయనకు తెలియును. మన ప్రార్థనలు నెరవేర్చుటకు ఎన్నో చిక్కులు అడ్డముగానున్నను ఆ చిక్కులన్ని విడదీసి ప్రార్థన నెరవేర్చగల జ్ఞానోపాయము ఆయనకు గలదు. ఆయన జ్ఞానియైయున్నాడు. గనుక దూతలకు, మనుష్యులకు, జీవరాసులకు జ్ఞానము ఇచ్చినాడు. ఆ జ్ఞానమువలననే, మానవులు సృష్టిలోని అనేక మర్మములను తెలిసికొనుచున్నారు. నేనెంత మెత్తుకొన్నను ఒకొకప్పుడు నా ఇష్టము నెరవేర్చడు, కారణము నాకు తెలియదు. ఆ కారణము దేవుని సర్వజ్ఞానమునకు తెలియును. నేననుకొన్నది నెరవేరిన అది నాకు హానియని ఆయన జ్ఞానమునకు తెలియును. ఎందుకు నెరవేర్చలేదు అని నేను అడిగిన నీవు గ్రహించలేవు అని చెప్పును.

బైబిలులో ఒక సంగతి అర్థము కానప్పుడు అనేక ప్రశ్నలు వేసికొని మన మనస్సు చెదరకొట్టుకొందుము. అప్పుడు మనము మన జ్ఞానముమీద ఆనుకొన్నట్లు ప్రభువును అడిగిన ఆయన తప్పక వివరించును. ఉదా: ప్రభువా నిన్నెరగనివారు అనేకులు చనిపోయిరి. వారి గతి ఏమిటి అని అడుగగా- హేడెస్సులో వారికి బైబిలు క్లాసు పెట్టినాను బోధించుచున్నాను అని ప్రభువు చెప్పినప్పుడు అయ్యగారికి కలిగిన సంతోషము చెప్పలేము Now it is clear Father అని సంతోషించి స్తుతించిరి. బైబిలులో ఆధారమగు వాక్యముగలవు గాని మీకు స్పష్టముగా తెలియదు. మీరు వచ్చిన అక్కడికి తీసుకొని వెళ్ళుదునని ప్రభువు చెప్పిరి. కొందరిని ఆయన తీసుకొని వెళ్ళుచున్నారు. గనుక ఆయనకు సంస్తుతులు. **7) జీవము :** ఆయన జీవమైయున్నాడు. గనుక ఏమియు పనిచేయకుండా ఉండలేడు. ఎప్పుడును పనిచేయుచుండును. మానవునిలోని జీవము బలహీనతనుబట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చినప్పుడు మరల మానవునిలో జీవము ధారపోయును. మరియు నా ప్రార్థనయు, నేనును జీవము కలిగియుందును. మరణము వచ్చిన ఇది మరణమెందుకయినది ఇది జీవమే అనును. అవిశ్వాసులు అలాగు అనరు. మరణమునుచూచి మరణమే అందురు. విశ్వాసులైన ఇది క్రొత్త జీవము అందురు. **8) సర్వవ్యాపకత్వము :** మన మెక్కడనున్నను ఆయన అక్కడ ఉన్నాడు గనుక భయపడనక్కరలేదు. పరలోకములోను, భూలోకములోను, అన్ని స్థలములలోను ఉండగలడు. మనిషి ఎక్కడ ఉన్నను దేవుడు అక్కడ ఉండగలడు. మానవునికి జతగా ఉండగలడు. సహాయము చేయగలడు. ఆయన సర్వవ్యాప్తి గనుక ఆయన ప్రభావము, ప్రేమ, జీవము, కాపుదల అన్నిచోట్ల కనబడుచున్నవి. నేనెక్కడ ఉందునో, నా నీడ అక్కడ ఉండును. అలాగే నా నీడవలె ఆయన నా దగ్గర నుండును. గనుక ఆయనకు నా ప్రణుతులు. **9) న్యాయము :** ప్రతివారికి తగిన స్థితి ఏర్పర్చును. ఒకరు పొరపాటులోనున్నప్పుడు న్యాయమైన రీతిగా గద్దించి, శిక్షించును, కొందరు దేవుడు తండ్రి అయితే మాకు కనబడకూడదా అని అడుగుచున్నారు. మనిషికి కనబడకుండుటే దేవునియొక్క న్యాయము. అది మనకు అర్థముకాదు. ఆయన ఏ కాలములో ఏ భక్తునికి అన్యాయము

చేయలేదు. నిత్యమంగళ స్తోత్రములు. **10) స్వతంత్రుడు** : దేవుడు స్వేచ్ఛపరుడు. ఎవరును ఆయనకు ఎప్పుడును సలహానీయనక్కరలేదు. తన ఇష్టప్రకారము అన్నియు చేయగలడు. మనకు స్వతంత్రముగా పనిచేయగల శక్తి అనుగ్రహించెను. అన్ని లక్షణములు దేవుడు మనకు ఇచ్చి స్వతంత్ర లక్షణము ఇవ్వకపోయిన యెడల తక్కిన లక్షణములిచ్చిన ప్రయోజనములేదు. ఆదాము పాపములో పడినప్పుడు దేవుడు స్వతంత్రుడు గాన ఊరుకొన్నాడు. ప్రేమనుబట్టి వెళ్ళినాడు. జ్ఞానమునుబట్టి తెలిసికొన్నాడు. శక్తినిబట్టి బయటకు తీసుకొని రావలెననుకొన్నాడు. న్యాయమునుబట్టి తీసుకొని వచ్చినాడు, దేవుని లక్షణములలో ఎగుడుదిగుళ్ళు లేవు, ఒకటే బంతి, ఒకటే దొంతి, గనుక మనకు శాంతి దేవుడు శుభలక్షణములతో అన్నిలోకములను పరిపాలించుచున్నారు.

# దేవదూతల లోకము

**దేవదూతలు :** పరిశుద్ధులు, ఆత్మలు గనుక కంటికి కనబడరు. గొప్ప శక్తిగలవారు, దేవుని స్తుతించుట వారి గొప్ప ఉద్దేశ్యము. దైవాజ్ఞ ఏదైనను చేయగలరు, మనకు హానికలుగకుండ కాపాడువారు, మనము భక్తిమార్గమున నిలుచుటకు ఎంత సహాయమైనను చేయగలరు. ఎంత గొప్ప మిత్రులు. హెబ్రీ. 1:13,14. వీరు ఎవరును చేయలేని గొప్ప స్తుతి చేయుదురు. ఒక మనిషికైనా కష్టము రానీయరు, మనకు ఏ కష్టము వచ్చినను వారు సహించలేరు. వారికి గల శోధన ఏమనగా మనుషులు తన సహాయమునకు దేవదూతలను రానివ్వరు, మనిషిగాని రానిస్తే ఎంత సహాయమైనా చేతురు. మనిషికి సహాయము చేయుటకు వీరికెప్పుడును సెలవుగలదు గాని మనిషిలో పాపనైజము, సాతాను బుద్ధి ఉన్నందున వారిని రానివ్వడు. మనిషి పాపములో పడునప్పుడు దేవదూత వచ్చి పడకుండ సహాయపడును. మనిషిని పడకుండా చేయుటకు ఎందరి దూతలనైనను దేవుడు పంపును. మనిషిని రక్షించుటకు దేవుడు ఇంత ప్రయాసపడును. మనిషి దేవదూతలకు కృతజ్ఞత చూపవలెను. మన కుడిప్రక్కను ఒక దూత, ఎడమప్రక్కను ఒక దూత ఉందురు.

కుడిప్రక్కనున్నదూత మనము చేయుమంచిని వ్రాయును, ఎడమ వైపునున్న దూత మనము చేయు చెడుగును వ్రాయును. వ్రాయవలసినది రికార్డు గనుక వ్రాయుదురు. తప్పుచేసిన మనిషి మార్పు పొందగానే కొట్టివేయనా అని దేవుని నడిగి కొట్టివేయును. మనిషి మారుమనస్సు పొందునేమో అని వ్రాయకుండ కనిపెట్టి, మనిషి క్షమించు ప్రభువా! అని అనగానే వెంటనే దూత వ్రాయుట మానివేయును. మన తప్పులు వ్రాయుట వారికిష్టములేదు. ఎవరికి గొప్ప కష్టములు, శ్రమలు ఉన్నవో వారికి గొప్ప దేవదూతలున్నారు.

తలుపులకు తాళము వేయుట మరిచితే దేవదూతలు కావలిగా ఉందురు, అంతేకాదు దేవదూతలు మన పిండివంటలమీద సహా ఈగలు పడకుండ కాపాడును. పాపములో పడునప్పుడు పడకుండా దేవదూత వేరే తలంపు పుట్టించి వద్దు, వద్దు అని చెప్పును. మనము చింతపడునప్పుడు, భయపడునప్పుడు, సందేహము ఇదో అదో అనునప్పుడు సైతానుకు సందు. సైతానుకంటే గొప్ప సైతాను చింత. ఎంత గొప్ప చింత అంటే 3 సం॥లు మన ఇంటిముందు పెరిగిన చింతచెట్టు కంటే బలమైన చింత, పెండ్లికుమార్తెకు ఈ మూడు ఉంటే నవ్వురాదు, పెండ్లికుమార్తెకు రెండు గుర్తులు. 1. ఎల్లప్పుడు నవ్వు ముఖముగానే యుండును. 2. అయ్యో! నేను పడిపోయినాను, నాది తప్పు అని అనకూడదు. ఎవరు ఈ ప్రకారము అనకుండ ఉంటారో వారే పెండ్లికుమార్తె నీవు తప్పుచేసినప్పుడు తప్పుచేస్తిని అయ్యో అన్నప్పుడు పిశాచికి సందు. పెండ్లికుమార్తె అలాగు అనదు. ఇతురులు అంటారు. తప్పుచేసిన వెంటనే, చేసినాను క్షమించుమని వెంటనే లేచినాను. తప్పుచేయుట, క్షమాపణ పొందుట ఒక్కసారే. తప్పుచేయుట, ఒప్పుకొనుట క్షమాపణ పొందుట, ఈ మూడును జరిగినప్పుడు పిశాచికి తెలియకుండవలెను. క్షమాపణ దొరికినదని వెంటనే నమ్మవలెను, గాని రేపు ఉపవాసముండి ప్రభువు దగ్గర ఒప్పుకొంటాను అని రేపటి వరకుండుట అవిశ్వాసమునకు హేతువు. అదే పెండ్లికుమార్తె వరుసకు దూరమగుట. ఇంతగొప్ప గడుసుతనము ఉంటేనేగాని పెండ్లికుమార్తె వరుసలో చేరరు. నా తండ్రి ఉన్నాడు అన్నియు ఆయనే చూచుకొనును అనవలెను.

దేవుడు కోటానుకోట్ల దేవదూతలను కలుగజేసెను, వారు దేవునివలె నిరాకారులు. పరిశుద్ధులు, దేవునియొక్క లక్షణములుగలవారు. దేవుడు వీరిని

మొదట కలుగజేసెను. వీరు ఎప్పుడును దేవునిని పూజచేయుచుందురు. దేవుడు ఏ పని చెప్పినను చేయుచుందురు. వీరికి దేహములేదు, ఆత్మరూపులు, మహాశక్తిమంతులు, వీరు ఒక్క నిమిషములో ఎన్నివేల మైళ్ళదూరమైనను ఎగిరివెళ్ళగలరు. వీరు మనలను కాపాడువారు. మనమీద వీరికి ఎంతో ప్రేమ. మనము నమ్మిన యెడల దైవాజ్ఞచొప్పున మనకెంత సహాయమైనను చేయుదురు. మనము దేవుని సహాయము కొరకు ప్రార్థించునప్పుడు మనకు సహాయము చేయుటకు వీరికి ఎంతో వీలుకలుగును. మనము నిద్రపోవు చున్నప్పుడు మనచెంతనే ఉందురు. దయ్యములను రానివ్వరు. దేవుడు కలుగజేసిన సృష్టిని కాపాడుట వీరిపని. సృష్టికి నష్టము కలిగించు ప్రతిదానిని వీరు తొలగింపగలరు. దైవచిత్తమునకు చిత్తము అనేవారు అనగా సంపూర్ణముగా లోబడువారు ఎంతదూరమైనను క్షణములో వెళ్ళగలరు. మన కంటికి కనబడరు. మన దగ్గరనే ఉందురు. మనలను మిక్కుటముగా ప్రేమించువారు. దేవదూతలు మన ఉపయోగ నిమిత్తము చేయలేని ఒక పని ఉన్నదా? మీకిష్టమైనవారు మీకును కనబడుదురు. వీరు మన స్నేహితులు. మన సహకారులు, మనమీదికి వచ్చు అపాయములను తప్పించి వేయుదురు. దూతలయొక్క పనినిబట్టి వారు కొన్ని రకములుగా నున్నారని తెలియనగును. మిఖాయేలు మన పక్షముగా యుద్ధము చేయువాడని తెలియుచున్నది. మోషే శరీర విషయములో అపవాదితో తర్కించెను. యూదా. 9. మరియు ఘటసర్పముతో యద్ధము చేయుదురు. ప్రకటన. 12:7; దాని. 10:13; 12:1 గాబ్రియేలు దూత వర్తమానములు వినిపించునని తెలియనగును. దాని. 8:16; 9:21 జకర్యాకు వర్తమానము లూకా. 1:19 మరియకు వర్తమానము లూకా. 1:26 దూతలు స్తుతి చేయుట యెషయా 6వ అధ్యాయములో గలదు. భూమికి పునాది వేసినప్పుడు దూతలు పాడిరి యోబు 38:7 ప్రభువు దూత చెరసాల నుండి శిష్యులను విడిపించెను. కార్య. 12:10 యుగ సమాప్తియందు నీతిమంతులను, దుష్టులను వేరుచేయువారు దూతలు. మత్త. 13:49; మనుష్య కుమారుడు దూతలతో వచ్చును. మత్తయి. 16:27 మనము దూతలవలె నుందుము. మత్త. 22:30; ప్రభువుయొక్క జన్మచరిత్రలో

పునరుత్థాన చరిత్రలో దూతలు పనిచేసిరి మత్తయి 28:2,5. లూకా. 2:9 పాపి మారుమనసు పొందిన దూతలకు సంతోషము లూకా. 15:10 లాజరు, అబ్రాహాము రొమ్మున నుండుటకు దూతలచే కొనిపోబడెను లూకా. 16:22; పాతనిబంధన, క్రొత్తనిబంధనలోను కూడా దేవదూతలపని విస్తారముగ చూడగలము. ప్రకటన గ్రంథములో దూతలయొక్క పని ఇంకా ఎక్కువగలదు.

**సైతాను:** అనాదిలో ఒంటరిగా నున్న దేవుడు నరులను కలుగ చేయవలెననియు తన పోలిక చొప్పున కలుగజేయవలెననియు ఉద్దేశించెను. నరుల సహాయార్ధము దూతలైన వారిని దేవుడు సృజించెను కోటానుకోట్లదూతలైన వారిలో కొందరిని ప్రధాన దూతలుగా నియమించెను. అట్టివారిలో లూసిఫర్, మిఖాయేలు గాబ్రియేలు అను వారున్నారు. గాని వారిలో ఒకడైన లూసిఫర్ తేజోనక్షత్రమనియు, వేకువ చుక్కనియు పేర్లు గలిగినవాడై తేజరిల్లెను. ఈ ప్రధానదూత దేవుని కన్న తన సింహాసనమును హెచ్చించుకొనవలెననియు సర్వ సృష్టిని కలుగజేసిన మహోన్నతుడైన దేవునితో సమానముగా తనను తాను హెచ్చించుకొనవలెననియు మనస్సు గలవాడై గర్వించెను. పరిశుద్ధ లోకములో పరిశుద్ధ దూతలతో ఉన్నటువంటి ఈ ప్రధాన దూతకు ఈ దుర్బుద్ధి ఎలాగు కలిగెనో మన హృదయమునకు గోచరము కాదు మన జ్ఞానమునకు అందదు. ఆలోచించుట వలన మనకు మతి చెడును.

తన ప్రధానత్వము నిలుపుకొనక సహకారులైన దూతలకు ఈ సంగతి తెలుపగా వానితో ఏకీభవించినవారు దయ్యములుగా మారిపోయినందున దేవుడున్న దేవలోకమును విడిచిపెట్టవలసి వచ్చెను. సృష్టికర్తయైన దేవునిని విడిచి పాపకారుడు, శోధకుడు పాప ఫలితమునకు గురియై శాపమును బొంది పైలోకమునుండి పడద్రోయబడి పాపనైజము కలిగియుండుట ఎంత విచారము!

పడద్రోయబడిన సాతాను అను పేరుగల ఈ దుష్టుడు ఆది సర్పము, ఘటసర్పము, అబద్దోను, అపొల్లోను, డ్రాగోను, అపవాది అను నామములు గలిగినవాడై ఈ లోకములో తనకున్న సమయము కొంచెమేనని ఎరిగినవాడై

గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని లోకమంతటా తిరుగులాడు చున్నాడు. సృష్టికర్తకు విరోధమైన పాపము, సృష్టికి విరోధమైన పాపము, మనుష్యునికి విరోధమైన పాపము, సంఘమునకు విరోధమైన పాపము, తన ప్రేరేపణనుబట్టి నరులైన వారి యెడల చేయించుచున్నాడు. అతని కాలము పరిమితము.

యేసుక్రీస్తు ప్రభువు తన అధికారముతో భూమిమీద పరిపాలన చేయు వెయ్యి ఏండ్లకాలమందు సాతానుడు మట్టులేని గోతిలో పడవేయబడును. ఆ గోతిలో వెయ్యేండ్లు సాతానుడు దిగిపోవుచునే ఉండును. వెయ్యేండ్లు అయిన పిమ్మట అతనిని విడిపించును. అతడు గోగు, మాగోగు అను సైన్యములను ఏర్పరచుకొని దేవునితో యుద్ధము చేయగా సాతానుకు అంతమువచ్చును.

దేవుడు తన చేతితో తన స్వరూపమునందు మనిషిగా కలుగజేసిన నరుడు నరకములో పడిపోవుట ఎంత విచారము. నరకము అగ్ని నరుల కొరకైనది కాదుగాని సాతానునకును, వాని దూతలకును, అంతెక్రీస్తునకును, అబద్ధ ప్రవక్తకు మాత్రమే మెళుకువ కలిగి దైవసాన్నిధ్యములో మన జీవితము గడిపి పరలోక రాజ్యములో చేరగల ఆనంద భాగ్యము దేవుని కృపవలన పొందుదురు గాక!

# మోక్షలోకము

ప్రియ చదువరులారా! రక్షణ మహాసంకల్పన కథలు అనుపేరున ఏడు రకముల చరిత్రను మీరు చదివియున్నారు. ఏడవ చరిత్ర సాతానును గురించినది. ఇంతవరకు రక్షణ మహాసంకల్పనలోని (Plan of Salvation) దేవుని గూర్చియు, ఆయన లక్షణములను గురించియు, దేవదూతలను గురించియు, అనాదిని గురించియు, దేవదూషణ నిషేధమును గురించియు మొ॥ విషయములు చదివియున్నారు. భూలోకచరిత్రలో జరిగిన రక్షణను గురించి ఆదినుండి ఇకముందుకు జరుగనైయున్న రక్షణకార్యక్రమ సమాప్తివరకు నున్న కథలు వివరించక ముందులోకముల చరిత్రకూడ చదువరులు తెలిసికొనవలసి యున్నది.

**1. మోక్షలోకములు : 1) దేవలోకము–** ఇది అన్ని లోకములకుపైన మన ఊహకు అందనిచోట నున్నది. అది దేవుని సింహాసన స్థలము (యెష. 66:1) మరియు యెషయా దర్శనములో అత్యున్నతమైన సింహాసమునందు ప్రభువు ఆసీనుడై యుండుట చూచెను. దేవుని మహిమతో నిండియుండును. ఈ మహిమను పరిశుద్ధులైన దూతలు చూడలేక తమ ముఖములను రెక్కలతో కప్పుకొందురు యాకోబు 1:7లో కూడ దేవుని గురించి కలదు. 2) స్తోత్రసమాజము– ప్రకటన (4:6–11) ఇక్కడ నలుగురు పెద్దలు దేవుని సింహాసనము ఎదుట లోక విమోచన కొరకు దేవుని స్తుతింతురు. ఈసమాజమును గురించి ప్రకటన గ్రంథముయొక్క వివరములో తెలిసికొనవచ్చును. 3) దేవదూతల లోకము– దేవుడు వీరిని మొదట కలుగజేసెను. వీరిసంఖ్య కోటానుకోట్లు. వీరు దేవుని ఆజ్ఞనుబట్టి మనకెట్టి సహాయమైనను చేయగలరు. 4) నూతన యెరూషలేము– ఇక్కడ పెండ్లికుమార్తె సంఘము ఉండును. అనగా ప్రభువుయొక్క రెండవ రాకడలో ఎత్తబడు వారుండు స్థలము. అనగా ఆరోహణ సంఘము భూమిమీదనున్న యెరూషలేముయొక్క పేరు దీనికి ఇయ్యబడెను. ఇది మహామహోన్నతుని నివాసము. ప్రక. 21:2; 9–21. 5) రక్షితుల మోక్షము– రక్షింపబడినవారుండు స్థలము. రాకడ తర్వాత ఏడేండ్ల శ్రమలలో రక్షింపబడినవారు కూడ ఇక్కడ నుందురు. 1కొరింథి. 3:15; ప్రక. 7:4,9; 12:14; 14:1 6) పరదైసు– మారుమనసుపొంది మృతులైనవారియొక్క ఆత్మలు ఉండు స్థలము. లూకా. 23:43; ప్రకటన 2:7. 7) అబ్రాహాము రొమ్ము (లూకా. 16:23) నీతిమంతుడైన లాజరు చనిపోయిన తర్వాత అబ్రాహాము రొమ్మున ఆనుకొనియుండెనని ప్రభువు చెప్పెను.

షరా:– పైన వివరింపబడినవన్నియు మోక్షములోని భాగములు, భూమిమీద భక్తిగా జీవించినవారు చనిపోయిన తర్వాత ఇక్కడకు వత్తురు. భక్తిలో ఎక్కువ తక్కువలుగలవు గనుక ఇక్కడవారు తమతమ తరగతిలోనే ఉందురు. వారు అంతస్థుల ప్రకారము నిత్యము నివసింతురు. 1కొరింథి. 15:22,23; ప్రక. 12,13 అధ్యా॥లు, యోహాను 14:2. ఇది మృతులైన

భక్తుల నిత్యనివాసము, ఇక్కడ నిత్యమైన వెలుగు, సంతోషము, సుఖజీవనము. స్వేచ్ఛ, పరిశుద్ధత, దివ్యజ్ఞానము- ఇట్టివి యుండును. మరియు మనకు పరిశుద్ధుల సహవాసము, దేవదూతల సహవాసము, దేవుని సహవాసము కలిగియుందుము. ఏవిధమైన కొదువ ఉండదు. అక్కడ మనకు దీపకాంతిగాని, సూర్యచంద్ర నక్షత్రముల కాంతిగాని ఉండదు. 'నేను లోకమునకు వెలుగై యున్నాను' అని చెప్పిన యేసుక్రీస్తు ప్రభువే మనకు దీపమైయుండును. ప్రక. 21:23. అక్కడ ఆకలి దప్పులుండవు. నిద్ర ఉండదు, ఆయాసముండదు. మనకు ఈ శరీరముకాక, క్రొత్త శరీరమునకు అడ్డులుండవు. చదువరులారా! ఇట్టి లోకమునకు సిద్ధపడుటకు మీకు ఇష్టములేదా?

**2. వాయుమండల లోకము:-** సాతాను, లోకము, దేవుని విరోధించిన సైతానుగా మారినందున తన జట్టులతోబాటు ఇక్కడకు వచ్చివేయవలసి వచ్చెను. సాతానును, అతని దూతలును ఇక్కడ నుందురు. ఎఫెసీ. 6:12,13; ప్రక. 12:10.

**3. భూలోకము:-** మనమున్నలోకము మానవుని రక్షణకొరకై "రక్షణ మహాసంకల్పన" దేవుడేర్పరచెను. మానవుని రక్షణకొరకు దేవుడు ఏమిచేసినది వరుసగా తర్వాత చదువగలరు.

**4. పాతాళలోకము:-** 1) హేడెస్సు, భూలోకములో మారుమనస్సు లేకుండ చనిపోయినవారు ఇక్కడ కడవరి తీర్పువరకు ఉందురు. కడవరి తీర్పు కాకముందు ఎవరును నరకములోనికి వెళ్ళరు. మారుటకై ప్రతివారికిని ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు ఏదోయొక విధముగా దేవుడు సమయమిచ్చును. నశించినదానిని రక్షింపవచ్చిన క్రీస్తు వీరికి గడువియ్యక విడిచిపెట్టునా? 1సమూ. 2:6; 1పేతురు 4:6; కీర్తన 139:8; ఫిలిప్పీ. 2:11. 2) చెర : ఇక్కడ సైతాను వెయ్యేండ్లు ఉండును. ప్రక. 21:1-3. 3) నరకము : ఇది కడవరి తీర్పు కాలమున కనబడును. తీర్పు జరుగునప్పుడు క్రీస్తు కాక మరి ఎవ్వరును వెళ్ళరు. పాపకారకుడగు సైతానును అతని దూతలును, అనుచరులును నరకములో నుందురు. ప్రక. 20:11-15; మత్తయి. 7:22,23.

# వాయుమండల లోకము

**1) భూలోక సృష్టి:-** దేవుడు ఆకాశమును, భూమిని, వాటిలోని సమస్తమును మనకొరకే నరజన్మమునకు పూర్వమే సృజించెను. దేవుడు ఆకాశములో దీపములను పెట్టెను. అవే సూర్య, చంద్ర, నక్షత్రములు, భూమి అను మన ఇంటికి పైకప్పు ఆకాశము, భూమి మన ఇల్లు, జ్యోతులు మన దీపములు, నీరు- బహిరంగ మష్టును శుద్ధిచేయు వస్తువు మరియు మానవులమైన మనకు సమస్త జీవులకు దాహ శాంతినిచ్చును. పక్షులు, చేపలు, జంతువులు- ఇవి మన వినోద జీవులు. గాలి మన ప్రాణాధారము. మందులకు కావలసిన వనమూలికాదులను కూడ దేవుడు చేసెను. ధనమునకు కావలసిన లోహములను చేసెను. దేవుడు భూమిలోనుండి చెట్లు మొలిపించెను. వాటిపండ్లు మనకు ఆహారమాయెను. జంతువులు మనకు పనిచేసి పెట్టుటకు కలుగజేసెను. దేవుడు ఇవన్ని కలుగజేసినప్పుడు మహాశుభ్రముగా నుండెను. ఎక్కడా కళంకములేదు. దేవుడు మానవుని కొరకు కలుగజేసినవన్ని తెలిసి కొనుటకు లోకాంతము పట్టును. 'ఈథర్' అనునది దేవుడు గాలిలో ఆదిలోనే పెట్టెనుగాని అది ఉన్నట్టు మొన్ననే శాస్త్రజ్ఞులు కనిపెట్టిరి. దేవుడు ఆదిలో సృజించిన వాటిని లోకాంతము వరకు తెలిసికొనుచునే ఉందుము. లోకము లన్నిటిని చేసిన తర్వాత దేవుడు చివరకు మనిషిని చేసెను. మనిషికి దేవుడు తన గుణములు దయచేసినాడు. ఆయనలో నుండే ప్రేమ, జ్ఞానము, పరిశు ద్ధత, స్వతంత్రత ఈ మొదలైన లక్షణములన్నియు మనిషికి దయచేసెను. అందుచేతనే దేవుడు మనిషిని తన పోలిక చొప్పున చేసెనని బైబిలు గ్రంథములో నున్నది. దేవుడు మనిషి ఒక్కరైయున్నారు. మనిషి దేవునిని చూచేవాడు, దేవుడు మాట్లాడిన మనిషి వినేవాడు. మనిషి ఎంతో ఆనందముగా నున్నాడు. నరుడు దేవుని గుణములు గలవాడు గనుకనే దేవరూపము గలవాడని అందురు. మనుష్యుడు భూమిమీద కొంతకాలమును, పరలోకములో కొంతకాలమును ఉండుటకు దేవుడు చేసెను. ఏమి లేనప్పుడు అన్ని తండ్రి ఇస్తాడు దేవుడు ఆదాము అను ఒక పురుషుని, హవ్వ అను ఒక స్త్రీని కలుజేసెను. వారు పరిశుద్ధులు. భూమ్యాకాశములకు వారే పాలకులు. వీరు

మహా పవిత్రులుగా దేవుని సన్నిధినే నివసించువారు. పాపానంతరము జన్మించిన మనము వారి పవిత్రతను గ్రహింపలేము. వారిద్దరిని శృంగారమైన వనములో దేవుడు పెట్టెను. (ఆది. 1,2 అధ్యాయములు).

**2) పరిశుద్ధలోకము:–** పరిశుద్ధుడైన దేవుడును, పరిశుద్ధుడైన ఆదామును, పరిశుద్ధురాలైన అవ్వను, పరిశుద్ధమైన జంతువులమధ్యను పరిశుద్ధమైన పక్షుల మధ్యను, పరిశుద్ధమైన భూమిమీద సహవాసముగా జీవించుచుండిరి. (సజీవుల తీర్పు అయిన తర్వాత ఇట్టి స్థితి మరల లోకమునకు వచ్చును) ఈ పరిశుద్ధ లోకములో దేవుడును, మనుష్యులును కలిసియుండువారు. దేవుడు వారితో మాట్లాడుచుండువాడు, జీవరాసులును, నరులును స్నేహభావము కలిగియుండిరి. సృష్టి యావత్తు మహా పరిశుద్ధముగా నుండెను. ఆది. 1:27 నరుడు దేవుని లక్షణములు కలిగియుండెను. అందుచేతనే దేవుడు నరుని తన పోలికగా చేసెనని చెప్పుదురు. ఈ లోకములో అంతము అన్నియు పరిశుద్ధములే, జంతువులకును, మనుష్యులకును ఎవరిలో ఉండవలసిన పరిశుద్ధత వారిలో ఉండెను. ఒకదానికొకటి హానిచేయవలెనని ఉద్దేశము లేదు. పరిశుద్ధత అనగా పవిత్రత. చెడుగు లేకుండ నుండుట. పరిశుద్ధత అనగా అపవిత్రతకు సందులేదు. పరిశుద్ధత అంటే పరిశుద్ధత, అసలులో అట్టి పరిశుద్ధతయే నుండెను.

**3) పాపప్రవేశము:–** సైతాను మాయ బోధనుబట్టి ఆ మొదటి దంపతులు పాపాత్ములైరి. పాపము దూత (సైతాను)లో పుట్టెను. అతనిలోనుండి అవ్వకు, అవ్వలోనుండి ఆదాముకు, ఆ ఇద్దరిలోనుండి అందరికి వచ్చెను, గనుక అందరి రక్షణ కొరకు రక్షకుడు రావలసి వచ్చెను, గాని సైతాను కొరకుకాదు. అంత్య దినమందు మారనివారితో దేవుడిట్లనును– సైతానుకును అతని దూతలకును ఏర్పరచబడిన నరకములోనికి వెళ్ళుడి అని చెప్పును. నరకము సైతానుకును దాని దూతలకును గాని నరునికికాదు. నరుడు "నేలకుపోయేది నెత్తిన రాసుకున్నాడు" సైతాను స్త్రీకి కొన్ని మాయమాటలు చెప్పి దేవుడు నరులను తినవద్దన్న పండ్లు తినిపించెను. స్త్రీ సైతానుయొక్క దగాలో పడిపోయెను. స్త్రీ వెళ్ళి పురుషునికిచ్చెను. ఇద్దరు పాపాత్ములైనారు దేవుని వాక్యప్రకారము చేయక,

దయ్యముయొక్క వాక్యప్రకారము చేసి పాపాత్ములైరి. ఇప్పుడుకూడ లోకములో ఈ విధముగానే జరుగుచున్నది. దేవుని మాటలు మనుష్యులు వినరు. దయ్యము మాటలు వింటారు ఫలానపని చేయవద్దని దేవుడు ఆ మొదటి నరునికి చెప్పి ఉంచినాడు. అది సైతాను తెలిసికొన్నాడు. చేయవచ్చునని సైతాను చెప్పినాడు. నరులు సైతాను మాటే విన్నారు. మా తండ్రి చేయవద్దన్నాడు, అని స్త్రీ అంటే సైతాను ఏమిచేస్తాడు కాని ఆ స్త్రీ అనలేదు. దైవాజ్ఞ మీరినందున వారు దేవునికి దూరమైరి. సృష్టి అంతటికి శాపము కలిగెను. కాబట్టి జీవరాసులు నరునిమీద ఎదురు తిరిగెను. భూమి ముండ్లు మొలిపించినది. విషము, వ్యాధి, కరవు, భూకంపము అన్ని చిక్కులు, కీడులు లోకములో ప్రవేశించెను. సాతాను హవ్వతో ఫలాన, ఫలాన అని చెప్పినప్పుడు అవ్వ ఈ విధముగా చెప్పియున్న పాపము లేకపోవును. నీవు చెప్పినది సరియైతే అనవచ్చునుగాని, దేవుడు తినవద్దని చెప్పినాడు గనుక నేను తిననని చెప్పిన పాపము లేకపోవును. మనిషి పాపములో పడగలడు. దేవదూతలుకూడ పడగలరు. గాని దూతలు పాపములో పడనందున దేవుడు వారికి పాపము చేయలేని వరమిచ్చెను. పరలోక ప్రార్ధనలో పరలోకమందున్న దేవదూతలు పాపము చేయనందున నీ చిత్తము ఎట్లు అక్కడ నెరవేరుచున్నదో అట్లే భూమిమీద నుండు మేమును పాపము చేయకుండ ఉండి నీ చిత్తము నెరవేర్చునట్లు చేయుమని ప్రార్థించుచున్నాము. సృష్టికి అధికారియైయుండిన మనుష్యుడు చెడిపోయినందున సృష్టి అంతయు చెడిపోయి, చెడుగు అన్నిటిలో అంతటిలో ప్రవేశించెను. సృష్టియావత్తు క్షయాదీనదాస్యములోపడి ప్రసవ వేదనపడుచు, మూలుగుచు విడుదల కోరుచున్నది. పెండ్లికుమార్తె ఎత్తబడిన తర్వాత ఈ దాస్యము కొంతవరకు తగ్గును.

# భూలోకము

ప్రియ చదువరులారా! భూలోక సృష్టియొక్క చరిత్రయును, అది పరిశుద్ధముగా నుండిన చరిత్రయును, మరియు సాతానుడు అపరిశుద్ధ లోకములో పాపము నెట్లు ప్రవేశపెట్టినాడను సంగతియు చదివియున్నారు. పడిపోయిన మనుష్యులకు దేవుడు రక్షణ వాగ్ధానము వినిపించిన చరిత్రయును, పాపవృద్ధి చరిత్రయును, సైతానుచేసిన సృష్టిని గూర్చియు తెలిసికొనవచ్చును.

***1) రక్షణ వాగ్దానము*** : పాపములో మనిషి పడిన తర్వాత దేవుడు సాతానును ఎదుట నిలువబెట్టి వారు ఎట్లు పాపములోపడినది విని వారు పాపము చేసినందువలన వచ్చు నష్టమును తెలియజెప్పెను. పురుషుడు చెమట ఊడ్చి పనిచేసినగాని భోజనము దొరుకదని చెప్పెను. మరియు స్త్రీ పిల్లలను కనునప్పుడు చాల ప్రయాసము కలుగునని వినిపించెను. మరియు భూమికి శాపము కలిగినది గనుక ముళ్ళు, ముండ్లు మొలచునని చెప్పెను. ఇన్ని భయంకర విషయములు వారిద్దరికి వినిపించెను. వారి పాపము క్షమించెను. మరియు దేవుడు ఒక దీపముకూడ పెట్టెను. అదే దేవుడు ఆదాము హవ్వలకు ఇచ్చిన వాగ్దానము. **లోకమును రక్షించుటకు ఒక రక్షకుని పంపించెదనని మాట ఇచ్చెను (ఆది. 3:15) ఇదియే మొదటి సువార్త.** ఈ మాట వారి చెవులకు ఎంత ఆనందకరముగా వినబడినదో వివరింపలేము ఇదియే వారు చేసిన మొదటి క్రిస్మసు. అయితే రక్షకుని పంపెదననుమాట వినడముతోనే సైతాను గుండెల్లో రాయిపడింది. ఎందుకనగా ఆ రక్షకుడు సైతాను పని పడతాడు. సైతాను చెడగొట్టిన వీరిద్దరిని, వీరి సంతతి వారిని అనగా లోకమంతటిని రక్షించునని సైతాను భయపడెను. రక్షకుడు వచ్చుననుమాట ఆ మొదటి తల్లిదండ్రులిద్దరు తమ బిడ్డలకు చెప్పిరి. ఆ బిడ్డలు వారి బిడ్డలకు చెప్పినారు, ఆ బిడ్డలు వారి బిడ్డలు ఈ ప్రకారముగా రక్షకుడు వచ్చువరకు చెప్పుకొంటూనేయున్నారు. క్రొత్తగా వినేవారికి రక్షకుడు అప్పుడు వచ్చినట్లుగానే అనిపించేది. ఇంకొక సంగతి చూడండి, ఆ స్త్రీ పురుషులిద్దరు పాపములోపడ్డ తర్వాత దేవా! మమ్మును క్షమించి రక్షించుమని బ్రతిమాలుకొనుటకు వారు దేవుని దర్శనమునకు వెళ్ళలేదు. భయపడి చెట్టుచాటున దాగుకొనిరి. దేవుడు స్వయముగా వారి దగ్గరకు వెళ్ళినాడు. ఇందులో దేవుని ప్రేమయొక్క మహత్తు కనబడుచున్నది. అవును మరి మనము దేవుని దగ్గరకు వెళ్లగలమా! ఆయన మన దగ్గరకు రావాలిగాని దేవుణ్ణి దర్శించడానికి మనము ఈ ఊరు, ఆ ఊరు, ఈ దేశము, ఆ దేశము వెళ్ళనక్కరలేదు అన్ని ఊళ్ళు, అన్ని దేశాలు ఉన్న లోకానికే దేవుడు వచ్చియున్నాడు. లోకము మన ఇల్లు, మన ఇంటికే దేవుడు వచ్చివేసెను. ***2) పాపవృద్ధి:*** నరులు వృద్ధియైరి. పాపముకూడ

వృద్ధియాయెను. మొదటి నరులు ఒక పాపమే చేసిరి. తర్వాత వచ్చిన ప్రజలు అనేక పాపములు చేసిరి, చేయుచున్నారు. పాపముతోపాటు పాపమువలన వచ్చు కీడును వృద్ధియైనది (ఆది. 6:1-6) మరియు నరులకు దేవుడు కనబడుటలేదు గనుక మానవులు సృష్టికి మ్రొక్కిరి. ఎందుకనగా సృష్టి వలన మేలు కలుగుచున్నది గనుక పాపమువలన దేవునికి మానవునికి ఎడబాపు కలిగెను. మొదట ఒక పాపమే జరిగెను. తర్వాత అనేక పాపములు జరిగెను. పాపము సర్వత్ర వృద్ధియగుచున్న కాలములో దేవుడు భక్తులను, భక్తిహీనులను ఒక మందగా అబ్రహాము కాలము వరకు నడిపించెను. వాగ్ధాన రక్షకుడు రాకముందు ఆయన రాకకై నిరీక్షించినవారు మోక్షమునకు వెళ్ళగలిగిరి.

***3) సైతాను సృష్టి :*** సైతాను తనలో దుర్బుద్ధిని కలిగించుకొని, ఇతర దూతలలో కూడ ఆ దుర్బుద్ధిని కలిగించును. అదే నరులలోకూడ ప్రవేశపెట్టును. ప్రేమలేని తనము, అజ్ఞానము, అశక్తి, అపవిత్రత, అజాగ్రత్త, అనాగరికథ, అన్యాయము, దేవునియెడల దురాభిప్రాయము, ఆయన వాక్యమును మన్నన చేయకపోవుట, స్వతంత్రతలేనిస్థితి, భయము, అపనమ్మిక, సందేహము, దూషణ, దేవుని సృష్టిని పూజించుట, దేవుని పూజ మానుట, నాస్తికత్వము, దైవసంకల్పనను తృణీకరించుట, దేవునిపై నేరములు మోపుట, విసుగుకొనుట, కోపము, అసూయ, అమర్యాద, దురాశ, నిరాశ, హత్య, వ్యభిచారము, కలహము, యుద్ధము, దొంగతనము, అబద్ధము, చాడీలు చెప్పుట, అపకీర్తి కలిగించుట, త్రాగుడు, జూదము, తిండిబోతుతనము, దేవుడిచ్చిన వరములు వాడకపోవుట. అవి స్వంతమేలు నిమిత్తము మాత్రమే వాడుకొనుట, తలంపులోను, చూపులోను, నైజములోను, ఏదోయొక చెడుగు కలిగియుండుట. బైబిలు విగ్రహారాధనను నిషేదించుచున్నది. దేనినైనను ఎక్కువగా జూచుటకూడ న విగ్రహారాధనయే. ఇవన్నియు సైతాను కార్యములే.

ఆది. 3:4,5; నిర్గమ. 20:14,15-16-17; 21:15, 24,28; 32:1; లేవీ 19:12; ద్వితీ. 18:10; కీర్తన 53:1; సామె. 11:13; 25:18; 30:17; ప్రసంగి 5:1; యెహె. 18:4; మత్త. 5:21; 28;34; 13:15; 15:7; 9

23:14; గలతీ. 5:19-21; ఎఫెసీ. 4:25-31; 1తిమో 6:10; 2తిమో. 3:5; యాకోబు 1:14,15; 1యోహా 3:8; 4:20.

పాపము మొదటి తల్లదండ్రులలోనుండి అందరికి వచ్చెను. అందరిని రక్షించుటకు దేవుడే రక్షకుడుగా రావలసివచ్చెను. రక్షకుడు వచ్చుట పాపములోపడిన మనుష్యులమైన మనకొరకు, అయితే నరకము సాతానుకును అతని దూతలకును ఏర్పాటు చేయబడినది. అయితే రక్షకుడైన యేసుప్రభువును తృణికరించిన వారితో కడవరి తీర్పులో ఆయన చెప్పునదేమనగా "శపింపబడినవారలారా, నన్ను విడిచి సాతానుకును, దానిదూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్ని (నరకము)లోనికి పోవుడి" మత్త. 25:41. ప్రియులారా! నరకము మనుష్యుల కొరకు ఏర్పాటు చేయబడలేదు గాని మానవుడు నరకమునే కోరుచున్నాడు ఎంత విచారము!

ప్రియులారా! రక్షణ మహా సంకల్పన వరుసగా వ్రాయుచు, ఇప్పుడు పాపము తెచ్చిన శాపమును గురించి కొంతవరకు చదివియున్నారు. ఆ శాపము కథ ఇంకా ఉన్నది. 3. మనుష్యులు పాపాత్ములైనందున సింహములు, పులులు మనుష్యులపై తిరగబడెను. విషపురుగులు బయలుదేరెను. ఎంత కుమ్మరము వచ్చింది! భూమిమీద ముండ్లు మొలిచినవి, క్రమక్రమముగా జబ్బులు వచ్చినవి. కడకు మరణమే వచ్చినది. ఎంత ముప్పు ఇంకొక ముప్పు ఏమనగా మనుష్యులు కోటానుకోట్లు పెరుగగా పాపాలుకూడ పెరిగినవి ఇది అన్నిటికంటె గొప్ప ముప్పు! 4. ఏమి చేసిన పాపమో మనిషికి తెలియడానికి దేవుడు ప్రతి మనిషిలో మనసాక్షిని పెట్టెను. చూడండి, ఏదైన తప్పుచేసినప్పుడు గుండె కొట్టుకొనును. దాని పేరే మనస్సాక్షి దాని మాట వినిన దేవునిమాట విన్నట్టే. గాని మనిషి దానిమాటకూడ వినడు. దొంగతనము చెయ్యవద్దని మనస్సాక్షి చెబుతూనే ఉంటుంది. వింటాడా వెళ్ళి చేసివేస్తాడు. అందుచేత దేవుడు మరొక ఉపాయము కల్పించెను. ఏమి చేసిన పాపమో తేటగా వ్రాయించెను. అవి బైబిలులో నున్నవి. అవి చదువుకొని మనిషి పాపములు మానవచ్చును. అవేమిటో చూడండి. దేవుడిచ్చిన కొన్ని ఆజ్ఞలు చెబుతాను. తననే గాని ఇంకెవ్వరిని మ్రొక్కకూడదు అని ఒక ఆజ్ఞ. మానవుడు ఎంత గొప్పవాడు!

దేవుడు మనిషిని తన లక్షణములను పెట్టి చేసినాడు. అనగా దేవునిలోనున్న కళంకములేని ప్రేమ మనిషిలో పెట్టినాడు దేవునిలో నున్న శక్తి మనిషిలో పెట్టాడు తనలోని పరిశుద్ధత మనిషిలో పెట్టాడు. తనలోని జ్ఞానమును మనిషిలో పెట్టాడు. ఈ విధముగా తనలోని గుణములన్ని మనిషిలోపెట్టి చేసినాడు. గనుక మనిషి ఎంతగొప్పవాడు అందుకే మనిషి అచ్చా దేవునివలే నున్నాడు అందుకే మనకి దేవునిరూపే అని అంటారు. తండ్రి రూపురేఖలు కుమారునికి వచ్చినట్లే దేవుని రూపురేఖలు మనిషికి వచ్చివేసినవి. మనిషి ఎంత ధన్యుడు! రాతికి దేవుని గుణాలు వచ్చినవా? లేదు. మట్టికి దేవుని గుణాలు వచ్చినవా? కర్రకు దేవుని గుణాలు వచ్చినవా? లేదు మనిషికే వచ్చినవి దేవునికి స్తోత్రము. ఇంకా మనిషి ఎంత గొప్పవాడు. మనిషి కోసమే దేవుడు భూమిని, ఆకాశమును, సూర్యుని, నీళ్ళను, గాలిని, వృక్షములను, జంతువులను ఇవ్వన్ని మనిషికోసమే చేసెను గాని వాటికోసము మనిషిని చేయలేదు. **మనిషే వీటికంటే ఎక్కువ. ఇవి మనిషికన్న ఎక్కువకాదు. అయితే గుణము చెడినది గనుక వాటికన్న మనిషి తక్కువైపోయినాడు.** అందుకే మనిషి సూరన్నా, సూరన్నా అని సూర్యుని మ్రొక్కుచున్నాడు. చంద్రన్నా, చంద్రన్నా అని చంద్రున్ని మ్రొక్కుచున్నాడు. భూదేవీ, భూదేవీ అని భూమిని మ్రొక్కుచున్నాడు, శక్తి పూజచేయువారు దయ్యములను మ్రొక్కుచున్నారు. పాపము తెచ్చిపెట్టినవాడే సైతాను, వానిని మ్రొక్కనా? ఇంకెందుకు మనిషి చెట్టును, పామును, జంతువును, మనిషిని మ్రొక్కుచున్నాడు. దేవునికి మ్రొక్కడము మానివేసినాడు. దేవుడు చేసిన దానికి మ్రొక్కకూడదని మా బైబిలులో నున్నది గనుక చెప్పుచున్నాము. వీటిని పూజిస్తే ఆ పూజ దేవునికి అందదా అని మరి కొందరు మనసు కుదుర్చుకొనే మాటలు చెప్పుచున్నారు. ఒకవేళ నిజముగా దేవునికి బదులుగా ఇంకొకరిని మ్రొక్కడమే న్యాయమైతే ఇవన్నీ నరుని మ్రొక్కాలి గాని నరుడు వీటికి మ్రొక్కునా, చెప్పండి! మ్రొక్కకూడదని దేవుడిచ్చిన ఆజ్ఞలలో ఇది మొదటిది.

మరియొక దేవుని ఆజ్ఞ. జబ్బులు, కరువులు, మరణాలు దేవుడు పంపించుచున్నాడని కొందరు దేవునిమీద పెద్ద నేరమొకటి వేయుచు ఆయన

మంచిపేరు చెడగొట్టుచున్నారు. దేవుడేమన్నాడు నా పేరు వృధాగా ఎత్తితే మనిషికి దోషము ఉండకపోదు అని చెప్పినాడు. తండ్రి కుమారునికి కీడుచేయునా? నీవేనా ఇదంతా చేయుచున్నావు అని కొడుకు తండ్రిని అనవచ్చునా? దేవుడు మన తండ్రి అయినను అసలే అనకూడదు గదా! నా పాపము వలన నాకీ కీడు అని మనిషి తనలో తాను క్రుంగి క్రుంగి క్రుంగి సిగ్గుపడీ ఊరుకోవలసింది. దేవా తండ్రీ నన్ను క్షమించి ఈ కీడు తొలగించు అని ప్రార్థిస్తే ఎట్లుంటుంది? నీ మూలన నాకీ కీడు అని నిందవేస్తే ఎట్లుంటుంది? నిందించిన యెడల కీడు ఇంకా ఎక్కువ అవునుగాని తగ్గదు. దేవుడిచ్చిన మరొక ఆజ్ఞ- వారములో ఒకరోజు దేవుని పూజ రోజుగా ఏర్పరచుకొన వలసిందిగా దైవాజ్ఞ, ఆరు రోజులు మనవి. ఒకరోజు ఆయనది, ఎవరి మట్టుకు వారే రోజు దేవుని పూజ పెట్టుకొనవచ్చునుగాని అందరు కలిసి ఏదో ఒక రోజున ఒకచోట గుడిలో పోగై దైవారాధన చేసికొనవలెనని దేవుని కోరిక. ఎంతమంది చేస్తున్నారు క్రైస్తవులు మాత్రము ఆదివారము పెట్టుకుంటున్నారు. వారైన కొందరు ఆ దినముకూడ ఏదో పనిమీద ఎక్కడికైన వెళ్ళిపోవుదురు. లేదా ఇంటివద్ద ఉండిపోవుదురు. దేవుని పూజ తప్ప మరే పని చేసుకొనడము ధర్మము కాదని తెలుసు. వంట వండుకొనడము తప్పదు. అట్టి పనికి దేవుడేమియు అనడు. గనుక ఒక పూజరోజు ఏర్పరచుకొండి.

దేవుడిచ్చిన ఇంకొక ఆజ్ఞ. చేయవద్దని తల్లిదండ్రులు చెప్పిన పిల్లలు అదే చేయుదురు. చేయండి అని చెప్పిన అది చేయరు. దేవుడేమి చెప్పినాడు. **తల్లిదండ్రులను సన్మానించండి** అని చెప్పెను. పిల్లలు అట్లు చేయుచున్నారా? బాబూ నాయనా అనలేదు, గద్దించినాలేదు, కోపపడ్డాలేదు, కొట్టినాలేదు, ఏమి చెప్పాలి? ఈ కాల మహిమ ఇంట్లోనున్న పెద్దవారిని మత సంఘములోనున్న పెద్దలను, గ్రామములోనున్న పెద్దలను, బడిలోనున్న ఉపాధ్యాయులను, దేశము నేలువారిని మర్యాద చేయడమును వారికి లోబడి ఉండుటయును దేవుని చిత్తమైయున్నది గాని ప్రజలు దేవుని చిత్తమును సరిగా నెరవేర్చుచున్నారా? దేవుడిచ్చిన ఇంకొక ఆజ్ఞ- నరహత్య చేయవద్దు. ఇది దైవాజ్ఞ మానినారా? మొదట కోపపడుట. తరువాత బూతులాడుట, ఆ తర్వాత

కొట్టుకోవడము, తుదకు చంపుకొనడము ఇట్లున్నది. నరచరిత్ర బ్రతకడానికి దేవుడు పుట్టిస్తే చంపడమా? చంపుకొనడమా? బ్రతకలేక ఎందులోనోపడి చావడమా? ఎవరికి నష్టము. మనిషి ఎంతవరకు దిగిపోయినాడు, ఉయ్యాల తొట్టిలోనుండి గోతిలో కంటా దిగిపోయాడు. అక్కడనుండి ఎక్కడికో తెలుసునా నరకములోనికి. నరకములోనుండి పైకి రావడము ఎప్పుడు? ఇక రావడము రావడమే అక్కడే బ్రతికి ఉండడము. నిత్యమూ బాధపడడము. ఎప్పుడూ బ్రతుకే ఎప్పుడూ బాదే దీనికైనా అంతముందా? లేదు లేదు.

ప్రియ చదువరులారా! రక్షణ మహాసంకల్పన వరుసగా వ్రాయుచు ఇప్పుడు పాపమువలన వచ్చిన శాపమును గురించి కొంతవరకు చదివి యున్నాము.

మిగిలిన కథ కూడ చూడండి: దేవుడిచ్చిన ఇంకొక ఆజ్ఞ వినండి **'వ్యభిచరించవద్దు'** ఇది దైవాజ్ఞ. ఎంతమంది పడుచువారు ఈ పాపములో పడిపోయి తేలకుండ ఉన్నారు. ఎందరు వ్యాధులు తెచ్చుకొని చిరకాలము బాధపడుచున్నారు. అయినా మానినారా ఈ పాపము వలన ఎన్ని కుటుంబములు విడిపోవుచున్నవి. దేవుడేమి చెప్పినాడంటే చూస్తేనే, తలస్తేనే, పాపమన్నాడు. ఇవన్నీ నరుడు గుర్తుపెట్టుకొని జాగ్రత్తగా మసలుకొనవలెను. భార్యభర్తలు ఎంతో ప్రేమగా ఉండవలసినదని దేవుని కోరిక. ఉంటున్నారా మరి? ఇదొక రకమైన వ్యభిచారము దేవుడిచ్చిన ఇంకొక ఆజ్ఞ వినండి. దొంగతనము చేయవద్దు. ఇది దైవాజ్ఞ ఒకరోజుకు లోకములో ఎన్నెన్ని దోపుళ్ళు జరుగుచున్నవి. కన్నాలువేసే దొంగతనములుకాక, దారులుకొట్టే దొంగతనాలు కాక ఇతర దొంగతనాలెన్ని! తప్పు పద్దులు వెయ్యడము ఒక దొంగతనమా? ఇంతకమ్మవలసినది అంతకమ్మడము ఒక దొంగతనా? దగాతక్కెళ్ళు, పిచ్చిపడులు, తప్పుడు కొలతలు ఇవి ఒక దొంగతనమా? చెట్లు నిండా పండ్లు, పొలమునిండా పంట దేవుడిస్తు ఉంటే మనిషికిదేమి పని? ఓ సహోదరుడా నీ డబ్బెవరిది? దేవునిది నీ పంటెవరిది? దేవునిది. నీ బట్టలెవరివి? దేవునివే. నీ తోటలో పళ్లెవరివి? దేవునివే. నీకున్నవన్ని దేవుడిచ్చినవే. దేవుని సహాయము లేకుండ స్వయముగ నీవు సంపాదించు

కొన్నది నీదగ్గరేదిలేదు. పాపము మాత్రమే ఉన్నది. అదొక్కటే నీవు సంపాదించు కొన్నది. తక్కినవన్ని దేవునివే. సొమ్ము దేవునిది గనుక అది నీవొక్కనికోసమే ఇచ్చాడని అనుకొనవద్దు. బీదలకోసము కూడ ఇచ్చాడు. రోగుల కోసము కూడ ఇచ్చాడు. ఇదికూడ జ్ఞాపకముంచుకొనవలెను. గనుక ధర్మము చేయవలెను. నీ సొమ్ము దేవుని ఇష్టప్రకారము ఖర్చుపెట్టవలెను నీవు అనుభవించడమును బీదలకు ధర్మము చేయడమును దేవుని ఇష్టమని గ్రహించుకో! అట్లు చేయకపోవడము కూడ ఒకరకమైన దొంగతనము. దేవుని పని వ్యాపకము చేయడానికి సొమ్ము కావలసిన చందాలు పోగుచేస్తారు. కొంతమంది ఇస్తారు. కొంతమంది పట్టుబందికాదుగదా అని ఇవ్వడము మానివేస్తారు. మానివేస్తే దేవునిసొమ్ము అపహరించినట్టే. గనుక సహోదరుడా ఈ పొరపాటులో పడవద్దు దేశోపకారము నిమిత్తము చందాలు ఎత్తినప్పుడు విసుగుకొనవద్దు. మాకు ఒక వేదవాక్యమున్నది. "పుచ్చుకొనుటకంటే ఇచ్చుట ధన్యత" అని నేను బుట్టెడు పళ్ళు పంపాను. బాగా ఉన్నాయా అని ఒకరు ఒకరిని అన్నారు. అయ్యో మూడు తిని తక్కినవి తినడము మరచిపోయాను అని వెళ్ళిచూశాడు. అవి చెడిపోయినవి ఆయన దేవునిసొమ్ము వాడనందువలన పాడుచేశాడుగదా? గనుక దేవుడిచ్చినవి వాడకపోవడము పాపమే.

ఇంకొక ఆజ్ఞ వినండి. **'పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకవద్దు'** ఇది దైవాజ్ఞ. ఎంతమంది ఇతరులపేరు చెడగొట్టవలెనని లేనిపోనివి కల్పిస్తున్నారు. కొంచెము ఉంటే గంపంత చేస్తు ఉన్నారు. ఎరగని వారిని తీసికొని వచ్చి కోర్టులో అబద్ధ సాక్ష్యాలు పలికిస్తు ఉన్నారు. ఎంతమంది సత్యము అసత్యమని రుజువు పరచి సత్యవంతులను సిగ్గుపరుస్తుయున్నారు. ఎంతమంది అబద్దాన్ని నిజమని రుజువుపర్చి అబద్దన్నె నిలువబెట్టుచున్నారు. ఈ అబద్దాలాడటము తుదకు ఎందులోనికి వెళ్తుంది అనుకొంటున్నారు. దేవుడులేడు అని అనుకోవడము లోనికి వెళుతుంది అంటే ఏమన్న మాట? దేవునిని అబద్ధికునిగా చేయడమన్నమాట అనగా ఉన్నా దేవునిని లేడని రుజువుపర్చిన దేవుడవైన వన్నమాట నీకు! దేవుడిచ్చిన ఇంకొక ఆజ్ఞ వినండి **'ఏమీ ఆశించకూడదు,'** ఇది దైవాజ్ఞ దురాశ దుఃఖమునకు హేతువు. పేరాస

పనికిరాదు, నీకున్నదానితో తృప్తిపడి ఉండవలసినదేగాని ఒకరిది ఆశించకూడదు. చాలినంత ఉన్నా ఇంకా కావాలి అని, ఏమీలేదు అని, ఉన్నది చాలదు అని పేద అరుపులు అరువకూడదు. అన్ని ఆజ్ఞలు కలిపి రెండు మాటలలో చెబుతాను, దేవునిని ప్రేమించాలి. మనిషి ప్రేమించాలి, అప్పుడు ఏ పాపము జరుగదు, ఎందుకు ప్రేమించాలంటారా? దేవుడు నీ తండ్రి మనిషి నీ సహోదరుడు దేవునినే పూర్తిగా ప్రేమించావంటే మనిషిని తిట్టవు, కొట్టవు, మనిషీ మనిషి, ఇల్లుగాని, డబ్బుగాని, పంటగాని, పశువుగాని, సామానుగాని ముట్టకొనవుగాని కాపాడుదువు. ఆజ్ఞలు ముగించివేసాను' ఆజ్ఞలన్నిటి ప్రకారము చేయుటకు ఆజ్ఞ ఇచ్చిన దేవుడు మీకు బలమిచ్చునుగాక!

ఒక పాదిరిగారు ఒకరి ఇంటికి తరచుగా వెళ్ళువారు. ఆ ఇంటిలో యజమానునికి క్రీస్తుబోధ అంటే ఇష్టములేదు. పాదిరిగారు అంటే ఇష్టమే, ఆయన ఏమిచెప్పిన వినుట ఇష్టమే, కాని క్రీస్తును గురించి చెప్పటము అనేది ఆయనకు ఇష్టములేదు. ఒక దినమందు ఆ ఇంటి యజమానుడు పాదిరిగారితో– పాదిరిగారు! మా ఇంటికి తరచుగా రండి, బోధచేయండి, కాని యేసుక్రీస్తు వారినిగూర్చి మాత్రము చెప్పకండి అని అన్నారు. అందుకు పాదిరిగారు సరేలెండి ఇక చెప్పనని జవాబు ఇచ్చెను. అలాగే పాదిరిగారు తరచుగా వస్తుండేవారు కొన్ని మంచి సంగతులు చెప్పి వెళ్ళిపోయేవారు. క్రీస్తును గురించి చెప్పవద్దు అన్నారు గనుక ఎప్పుడు చెప్పలేదు. అయితే ఏమి జరిగింది? కొన్నాళ్ళకు ఆ ఇంటి ఆయనకు జబ్బు చేసినది, మంచము పట్టినారు పాదిరిగారు యధాప్రకారముగానే పాపములను గూర్చి చెప్పెను. అదిచేస్తే పాపము, ఇది చేస్తే పాపము అని ఈ ప్రకారముగా చెప్పటము ప్రారంభించెను. పాపాలవల్ల జబ్బులు వస్తున్నాయి. పాపలవల్ల కరువులు వస్తున్నాయి, తుదకు పాపలవల్లనే మరణము, మరణము పిమ్మట నరకము కూడా వచ్చునని చెప్పెను. మా బైబిలులో పది ఆజ్ఞలున్నాయి, ఏది పాపమో అది అద్దమువలె తెలిసిపోవును అని చెప్పి, పది ఆజ్ఞలను వివరించెను. పాపములు చేసినవారు చనిపోయి తుదకు నరకమునకు వెళ్ళిపోయి శాశ్వతకాలము బహు

బాధపడుచూ ఉంటారని నరకమునుగూర్చి బహు భయంకరముగా చెప్పి వెళ్ళిపోయినారు. అప్పటినుండి ఆ రోగియొక్క మనస్సు కలతలోనికి దిగిపోయినది. పగలు, రాత్రులు నిద్రలేదు అసలు జబ్బుకంటే ఈ జబ్బు ఎక్కువైనది మనస్సులో నెమ్మదిలేదు.

ఓపిక ఉంటే ఇంకొక కథ వినండి. ఒకరు జబ్బుపడి ఇంటిలో నున్నారు. ఆ పేటలో నున్న ఒక పాదిరిగారు ఆ రోగిని చూడడానికిని, ఆదరణగల మాటలు చెప్పటానికిని పదేపదే వెళ్ళుచుండెడివాడు. ఒకనాడు ఆ రోగి పాదిరి గారితో ఇట్లు అన్నాడు. అయ్యో! అయ్యో! మీరు మా ఇంటికి రావడము ఇష్టమే. మీ ఆదరణగల మాటలువిన్న ధైర్యముగా ఉంటుంది. మా ఇంటికి మీరు రావద్దు అని అనను. బోధ చేయవద్దని అనను, ఎన్నిచెప్పిన సంతోషముగా విందును. మీరు చెప్పవచ్చును, గాని యేసుక్రీస్తు వారినిగూర్చి మాత్రము చెప్పవద్దు నా కిష్టములేదు అని అన్నారు. ఆ పాదిరిగారు చాలా తెలివిగలవాడు, ఉపాయము గలవాడు, దైవభక్తిగలవాడు. ఆ వ్యాధిగ్రస్తుని చూచిన పాదిరిగారు యేసుక్రీస్తుని వానినిగూర్చి ఏమి చెప్పను లెండి అన్నారు. ఇంటికి వెళ్ళిపోయిన పాదిరిగారు చాలా పట్టుదలగా ప్రార్థన చేసికొన్నాడు ఏమని? చెప్పవద్దు అని అన్నవాడు ఏనాటికైన చెప్పండి, చెప్పండి అని నన్ను బ్రతిమాలునట్లు చేయుము దేవా అని ప్రార్థించినాడు. కొన్ని రోజులు గడిచిన పిమ్మట పాదిరిగారు ఒక ఉపాయము చేసెను. మన బైబిలులో పది ఆజ్ఞలున్నవి. ఈ ఆజ్ఞల వివరము వినేవారికి తప్పు ఏదో ఒప్పు ఏదో తెలియును పాపమేదో పుణ్యమేదో తెలియును. నరకానికి ఎట్టివారు వెళ్ళుదురో మోక్షానికి ఎట్టివారు వెళ్ళుదురో తెలియును. గనుక మీరు ఆ పది ఆజ్ఞల వివరము తెలిసికొనండి అని ఆరోగితో చెప్పెను. మా క్రైస్తవులలో ఎవరుబడితే వారు చెప్పగలరు అని ఆ పాదిరిగారు ఒక ఆజ్ఞ తరువాత ఒక ఆజ్ఞ వివరించుకొంటూ వెళ్ళినారు. అన్ని వివరించి వేసిన పిమ్మట ఆ రోగికి దిగులుపట్టుకొన్నది. మనస్సులో కలత పుట్టినది. ఏమిచేయవలెనో తోచలేదు. తన పాపములన్ని ఒకదాని వెంబడి ఒకటి జ్ఞాపకము వచ్చినది. మనస్సులో నెమ్మదిలేదు తుదకు ఆ రోగి పాదిరిగారి ముఖమువైపు తేరిచూచి పాదిరిగారు నా గతి ఇంతేనా?

నేను నరకమునకు వెళ్ళిపోవలసినదేనా? మీమాటలనుబట్టి చూడగా పాపాత్ములందరిని దేవుడు నరకములో వేయకమానడు ఎన్ని పాపాలు చేసిన నన్ను నరకములో వేయకమానడు. నా మాట (సంగతి) ఏమిటి మరి? అని అడిగినాడు. అందుకు పాదిరిగారు నేనేమి చేయను పాపాలు ఉంటే నరకము తప్పదు, తప్పించుకొనుటకు వీలులేదు అని జవాబు ఇచ్చెను. అప్పుడు ఆ రోగి అబ్బో బహు భయంకరమైన మాట చెప్పారు ఏమిటి ఈ మాటలు బాధకరమైనవి. నరకయాతన ఒక్కరోజే సహింపలేము. శాశ్వతకాలము ఎట్లు సహింపగలము అని అన్నాడు. అందుకు పాదిరిగారు అయ్యా! నేను ఉన్న సంగతే చెప్పాను దాచుకొనక చెప్పాను ఏ బోధకుడైన ఈ మాటలే చెప్పును. ఎందుకంటే ఈ మాటలు వాక్య గ్రంథములో నున్నవి మీరు స్వయముగా చదువుకొనవచ్చును. అప్పుడు ఆ రోగి పాపములకు విరుగుడు లేదా? నరకము తప్పించుకొనుటకు ఉపాయము లేదా? అని, పాదిరిగారిమీద ఆ రోగి ప్రశ్నవేసినాడు. అప్పుడు ఆ పాదిరిగారు ఆ రోగితో అయ్యా మీరు పెద్దవారు మీరు చెప్పినట్లు చేయాలిగదా! పాపములు పోగొట్టుకొనే విరుగుడు ఉన్నది. నరకము తప్పించుకొనే మార్గమున్నది. అప్పుడు ఆ రోగి ఒకవేళ నేను చనిపోతే నాకు నరకమే గతి గనుక పాపమును పోగొట్టు విరుగుడును, నరకమును తప్పించుకొను మార్గమును, చెప్పండి అని బ్రతిమిలాడుకొనెను. అప్పుడు ఆ పాదిరిగారు అయ్యా! ఈ రెండు మీరు చెప్పవద్దు అన్నారు గనుక చెప్పటము మానివేసినాను అని అనెను. అప్పుడు ఆ రోగి మీకు ఎలాగు వినబడినదోగాని చెప్పవద్దు అని నేను అనలేదే అని అనెను. పాదిరిగారికి ఇప్పుడు మంచి అవకాశము దొరికినది అయ్యా మీరు యేసుక్రీస్తు వారి కథ చెప్పవద్దు అన్నారు కదా అందుకే మానివేసితిననెను. అందుకు ఆ రోగి నిజమే క్రీస్తుమాట చెప్పవద్దు అన్నానుగాని నరకమును తప్పించు మార్గము చెప్పవద్దు అని అనలేదే అని అనెను. అప్పుడు ఆ పాదిరిగారు కుర్చీమీద నుండి లేచి బహు సంతోషముతో పాపములకు విరుగుడును నరకమును తప్పించు మార్గము ఆ యేసు క్రీస్తు వారి కథలోనే యున్నది. లోకములో మరి ఏ కథలోను లేదు. అప్పుడు ఆ రోగి పాదిరిగారి చేయి పట్టుకొని కుర్చీమీద కూర్చుండబెట్టి

అయ్యా! ఇంతమట్టుకు నాకు తెలియలేదు. లేకపోతే అనకపోదును నా తప్పు క్షమించండి. ఆ యేసుక్రీస్తు వారి కథకూడ చెప్పివేయండని వేడుకొన్నాడు. చూచారా క్రీస్తునుగూర్చి చెప్పవద్దు అని వ్యతిరేకించినవారు విని క్రీస్తును గురించి చెప్పించుకొని బాగైనాడా లేదా! అతని మనస్సులో గొప్ప సంతోషము కలిగినది. చావు భయము పోయినది పాపమేదో పుణ్యమేదో పది ఆజ్ఞలను బట్టి తేటగా తెలియును. క్రీస్తునుగూర్చి విన్నా పాపభయము పోవును. పది ఆజ్ఞలకు వ్యతిరేక పాపములను భరించుటకు యేసుక్రీస్తు ప్రభువు భూలోకమునకు స్వయముగా వచ్చివేసెను. క్రీస్తును గురించి ఎంత తరచుగా వింటే అంతమంచిది. మొదట వినాలి తరువాత పరీక్షించాలి, తెలియని విషయములు దేవుని అడిగి తెలుసుకొనవలెను. అప్పుడు మీరు శుభోజయముగా వర్ధిల్లెదరు. దేవుడు మిమ్మును దీవించునుగాక!

ప్రియ చదువరులారా! దేవుడు బైబిలులో బైలుపరచిన రక్షణ మహా సంకల్పనలోని ఒక్కొక్క భాగమును ప్రచురించుచున్నాము. గతములో పాపము వలన వచ్చిన శాపము కథ చదివియున్నారు. తర్వాత భాగము **పాపవృద్ధి:-** మొదటి నరులు ఒక్క పాపమేచేసిరి. తర్వాత వచ్చిన ప్రజలు అనేక పాపములు చేయుచున్నారు. నరులు వృద్ధికాగా పాపమును వృద్ధియైనది. పాపముతోపాటు పాపమువలన వచ్చు కీడును వృద్ధియైనది. ఆది. 6:1-6. ఈలాగున నరులు వృద్ధియైరి. పాపము వృద్ధియైనది. నరులకు దేవుడు కనబడుటలేదు గనుక సృష్టికి మ్రొక్కిరి. ఎందుకనగా సృష్టివలన మేలు కలుగుచున్నది. పాపమువలన దేవునికి మానవునికి ఎడబాపు కలిగినది గనుక ఉపకార కారణములై కంటికి కనబడుచున్న సృష్టిని, అందులోని వస్తువులకు మానవులు మ్రొక్కిరి. పాపము సర్వత్ర వృద్ధియగుచున్న కాలములో దేవుడు భక్తులను, భక్తిహీనులను ఒక మందగా అబ్రాహాము కాలము వరకు నడిపించెను. వాగ్ధాన రక్షకుడు రాకముందు ఆయన రాకకొరకు నిరీక్షించినవారు మోక్షమునకు వెళ్ళగలిగిరి.

# నిరీక్షణకాలము కథ

అయితే ఒకటి దేవుడు రక్షకుని పంపిస్తానన్నాడు గదా? ఆ మాట నమ్మి కొందరు ఎదురు చూచి చనిపోయిరి. ఆ విధముగా చనిపోయినవారు మోక్షానికి వెళ్ళిరి. దేవుని ప్రేమ ఎంతమంచి ఏర్పాటు చేసినదో చూడండి.

అనేకులు నమ్మలేదు. వారు వెళ్ళనేలేదు. నమ్మకపోవడముకూడ ఒక పాపమని చదువువారు గ్రహించవలెను. నమ్మకపోవడము అనేదే అన్ని పాపాలకన్న గొప్ప పాపమని నేను అనుకొంటున్నాను. నమ్మితే మాత్రము చెప్పినట్టు చేయకపోవడము రెండవ గొప్ప పాపము. పాపములేని ఆది మానవుల యొద్ద నివసించిన దేవుడు వారి పాపములనుబట్టి, కనబడుట మానివేయగా, తదనంతరము జన్మించిన వారిలో అనేకులు కనబడని దేవుని నారాధింప నిష్టపడక, ప్రత్యక్షముగా కనబడుచు ఉపకార దాయకముగనున్న ప్రకృతిని నారాధింప నారంభించిరి. దేవుడు వారిలో పెట్టిన మనస్సాక్షి మాట వారు వినరైరి. మంచి చెడ్డలను తెలుపునది మనస్సాక్షి. సృష్ట్యారాధికులును, దైవారాదికులును చాలాకలము కలిసియుండిరి. కొన్నాళ్ళకు దేవుడిద్దరిని వేరుచేసెను. ఇప్పటివరకు కలిసియున్న వీరికి 1) మిశ్రమ జనమనియు. ప్రత్యేకముగా వారిలోనుండి ఏర్పాటుచేయబడిన వారికి 2) ఎన్నిక జనమనియు చెప్పవచ్చును.

1. మిశ్రమ జనము: అనగా ఆదాము, హవ్వలు పాపములో పడిన తర్వాత, రక్షణ వాక్కు వచ్చిన తర్వాత కథ. ఆదాము హవ్వలు మారుమనస్సుపొంది పరిశుద్ధులైరి. ఏనోషు, షేతు పరిశుద్ధులు తరువాత మెతూషెల, నోవహు పరిశుద్ధులే. ఈ వరుసలో దైవభక్తులున్నారు. వీరు కాకుండ ఇంకా దైవభక్తులున్నారు. వారి చరిత్రలు బైబిలులోలేవు. ఇది మిశ్రమ జనాంగములో దైవారాధికుల వరుస. రెండవ వరుస అనగా తప్పిపోయినవారి వరుసలో కయీను తప్పెను. అతని సంతానమువారు లౌకికులైరి. తరువాత నోవహు కాలములో భక్తిహీనులనేకులు గలరు. నోవహుగారి బోధకు మారలేదు జలప్రళయములో నశించిపోయిరి. కాబట్టి ఆదాము మొదలు అబ్రాహాము వరకు భక్తులు, భక్తిహీనులు కలిపి ఉన్నారు. ఎందుచేత దేవుడు వీరిద్దరిని కలిసి ఉండనిచ్చినాడు. ఉదా:- ఒక తరగతిలో తెలివిగల వారుందురు. తెలివి తక్కువగల వారుందురు. ఎందుకనగా తెలివిగలవారిని చూచి తెలివిలేనివారు నేర్చుకొందురు. వీరందరు కలిసి ఉంటే ఉపాధ్యాయునికి కష్టము. తెలివిగల వారుంటే పంతులుగారికి సుఖము. అలాగే దేవుడు

ఆదికాలములో భక్తిపరులను, భక్తిహీనులను కలిపి ఉంచెను. అందులో దేవుని ఉద్దేశమేమనగా వారిని చూచి వీరు నేర్చుకొనవలెనని. భక్తినేర్చుకొనవలెను. అది కొద్దిమందిలో నెరవేరును. ఇదంత ఎందుకు సైతానును చంపిన, ఆదాము హవ్వలను చంపిన బాగుండునుగదా! ఇవి మనుష్యుల పద్ధతులు, దేవుని పద్ధతులుగావు. ఆయన పద్ధతి భక్తులను, భక్తిహీనులను కలిసియుండనిచ్చుట. అనేకులకు ఉపకారము అనేకులకు కీడు కలుగవచ్చును. మొదటినుండి భక్తిపరులు తమ మనసులో భక్తి నిలుపుకొన్నారు. జలప్రళయము తర్వాత యాపెతులోనుండి భక్తిహీనులు లేచిరి. భక్తిపరులతో దేవుడు వాగ్ధానము చేసినాడు. వారి పాపములు క్షమించి రక్షకుని వాగ్దానమిచ్చినాడు. ఆదాము, హవ్వలతో మన తల్లిదండ్రులు పుట్టకముందు దేవుడు వారితో కలిసి ఉండేవాడట. పాపములో పడక ముందు ఇది ఉండేదట. వారితో మాట్లాడేవాడట. పాపములో పడిన తర్వాత మునుపు ఉన్న పరిచయములేదు. న్యాయ ప్రకారము భక్తులకు దేవునితో పరిచయముండవలెనుగాని, అప్పుడప్పుడు భక్తులతో దేవుడు మాట్లాడుటగలరు. వీరు భక్తులే, విశ్వాసులే, రక్షణ వాగ్ధానము నమ్మినవారే ఎదురుచూస్తున్నవారే అయినను ఆ మొదటి స్థితిలేదు, ఆదాము హవ్వలకున్న ఆ మొదటిస్థితికాదు. ఇది దేవునికిష్టమైన స్థితిగాని మొదటి స్థితివంటిదికాదు అట్టి పరిచయము, స్థితి, ప్రత్యక్షత, దర్శనము మాటలుకావు. వీరు భక్తులైనను శపింపబడిన భూమిమీద నున్నారు గనుక శోధనలుగలచోట నున్నారు గనుక. మనకు వారికన్న ఎక్కువ తెలుసు గనుక ఆ మొదటిస్థితిరాదు. భక్తిపరులైనా ఎంత భక్తిపరులైనా ఇంకా పాపులమధ్య పాపలోకములో నున్నారు గనుక ఆ మొదటిస్థితిరాదు. అయితే భక్తిహీనులలో కలవరము పుట్టినది. పూర్వము దేవుడు కనబడేవాడు. ఇప్పుడు కనబడుటలేదు. అయితే ఆకాశము, సూర్యుడు కనబడుచున్నవి, వీటివలన మేళ్ళు గలవు. భూమి ఖనిజములవలన ఉపకారము, వీటికి నమస్కరించుట, పూజించుట మంచిది. నీకు ఉపకారము చేయువారికే నమస్కారము చేయుదువు. అదే న్యాయమని సృష్టిని పూజించుటకు కొందరు మొదలుపెట్టిరి.

**నిరీక్షణ కాలము:–** మిశ్రమ జనములోనివారు కొందరు కనబడు సృష్టిని పూజించుట మొదలుపెట్టిరి. కొందరు కనబడని దేవుని పూజించిరి వీరు భక్తులు. కనబడని దేవుని పూజించుచున్నారు గనుక భక్తిహీనులు. అదిచూచి

దేవుని పూజించు భక్తుల గుంపులోనికి దుమికిపోవలెను. కొందరు ఆలాగే చేసిరి. భక్తులు భక్తిహీనులు కలిసియుండుటనుబట్టి దేవుడు గొప్ప కృపగలవాడని తెలియుచున్నది. మనకాలములో కూడ ఇట్టిగొప్ప కృప ఉన్నది ఇది దుష్టులకు గొప్ప తరుణము. విశ్వాసులను అవిశ్వాసులలోనికి పంపుట అవిశ్వాసులకు గొప్ప తరుణము. రేపు తీర్పు సమయములో మాకు గడువు ఇయ్యలేదు అని దేవుడు అనిపించుకొనకుండ ఈ కృప చూపించును. జల ప్రళయములో (ఆది. 6,7) అందరు నశించిరి. చివరలో కూడ 7దినములు గడువిచ్చెను. వారికి గడువు, బోధ. భక్తుల మాటలు తక్కువకాదు. 1) వారు భక్తులమాట విను తరుణము దేవుడిచ్చెను 2) భూమ్యాకాశములను చూచి సృష్టికర్తను పూజింపవలెను అది ఒక తరుణము. *3) దేవుడు మనిషిని కలుగజేసినప్పుడు దేవుడు వానిలో మనసాక్షినుంచెను. ఆ మనసాక్షి రెండు పనులు చేయును. మంచి చూపించుట, చెడుగు చూపించుట.* ఇదికూడ దేవుడిచ్చిన తరుణమే. ఈ వర్తమానము కూడ వారు వినలేదు. 4) మనిషికి జ్ఞానమున్నది దానినిబట్టి అక్కడనున్న చెట్టులోనుండి పోవలెనని ప్రయత్నింపక ప్రక్కనుండిపోవును. అది జ్ఞానమునుబట్టి జరుగును. జ్ఞానమునుబట్టి లోకములో ఇన్ని సంగతులు తెలిసికొన్నవారు దేవుడుకూడ ఉన్నాడని తెలిసికొనవలెను. (మనస్సాక్షి చెప్పే జ్ఞానము) దానిమాట విననివారు లోకములో ఇప్పుడున్నారా? భక్తి పరులకున్నది ఒకటే అది దేవుని వాగ్ధానము. భక్తిపరులు వాగ్ధానము కలిగియుండి పైవన్నిటియొక్క మాట విన్నారు. భక్తులు భక్తిహీనులకు మంచి చెప్పి ఉందురు, దేవుడు ఉన్నాడు. ఆయనను మ్రొక్కండి, ఆయనే రెండు గోళములను కలుగజేసెను అని చెప్పిరిగాని, వారు వినలేదు గనుక జలప్రళయములో చచ్చిపోయిరి. వారు సృష్టిని దేవునిగా ఎంచుకున్నారు గనుక సృష్టి దేవుడు కాదని తెలిసికొనుటకు దానివలననే నాశనమైపోయిరి. వారు ఉపకారములనుచూచి పూజించిరి. గనుక అట్లగుట న్యాయమే. సృష్టిని పూజించుట న్యాయమని తలంచిరి. అయితే ఆ న్యాయము వారిని రక్షించలేదు. వర్షమువలన పంట గనుక వాన దేవుడనుచున్నారు. గనుక దానిచే బుద్ధి చెప్పించవలెను.

జలప్రళయ సమయములో మొదటి దినమున వారనుకొన్నారు. ఇది నోవహు చెప్పిన వర్షముకాదు మామూలు వర్షమే అనుకున్నారు. రెండవ దినము ఇదివరకు కంటే కొంచెము ఎక్కువ వర్షము అని అనుకున్నారు. మూడవ దినము ఇంకా కొంచెము ఎక్కువనుకున్నారు. తర్వాత నీరు ఇండ్లలోనికి, కప్పుమీదికి, చెట్లమీదికిరాగా ఈదుకొన్నారుగాని మహాప్రభో! అని దేవునిని పిలువలేదు. ఈ కాలములో కూడ పాపమువలన శరీరబాధ వచ్చినది. అవమానము ఉన్ననుసరే గుణము మార్చుకొనరు. అలాగే ఉంటారు. ***క్రీస్తు ప్రభువుకూడ ఆఖరు దినములలో అలాగే ఉండునని చెప్పెను. గనుక ప్రపంచనాడి చూచి రాకడ సమీపమని తెలిసికొనవలెను. గుర్తుల వలనను, మన అనుభవమువలనను దేశములలో అల్లర్లు, సముద్రములో అల్లర్లు, వీటన్నిటినిచూచి రాకడ సమీపమని తెలిసికొనవలెను.*** జలప్రళయ సమయములోకన్న ఇప్పుడే ఎక్కువ అల్లరి ఉన్నది. దేవుడెప్పుడును మనిషి విషయములో దయచూపుచునే యున్నాడు. మనిషి ఎల్లప్పుడు దేవునికి వ్యతిరేకమే. దేవుడు మిశ్రమ జనవిషయములో చాలా కృపచూపెను. అప్పుడే విగ్రహారాధన ప్రారంభము. అది విగ్రహారాధన అని మోషేకాలములో సీనాయి కొండవద్ద తెలిసెను. మిశ్రమజనములోనున్న పాపమే ఏర్పాటు జనాంగమైన ఇశ్రాయేలీయులలోనికి, మనకాలము వరకుకూడ వచ్చినది. ఎందుకనగా సాతాను ఉన్నాడు అతని నైజము నేటివరకు ఉన్నది. అయితే ప్రార్థనవలన ఆ నైజముపోవును. వారి మొదటి పాపము విగ్రహారాధన గనుక దేవుడు మొదటి ఆజ్ఞలోనే విగ్రహారాధన కూడదని వ్రాయించెను. ఇది దేవుని గొప్ప జ్ఞానము బైలుపరచుచున్నది. ఆదాము,హవ్వలు ఒకరిమీద ఒకరు నేరస్థాపన చేసిరి. అదే మిశ్రమ జనములోనికి వచ్చెను. భక్తులకు కనబడ్డ దేవుడు మాకెందుకు కనబడడు అని దేవునిమీద నేరము మోపుచున్నారు. ఆదాము హవ్వ మీదనే కాకుండ దేవునిమీద నేరస్థాపన చేసెను. అలాగే మనిషి ఒకరిమీద నేరస్థాపనచేసి చాలక దేవునిమీద చేయుచున్నాడు. అది గొప్ప నేరము. తర్వాత భక్తిహీనులు అన్ని స్థలములకు చెదరిపోయిరి. ఇంకా ఇంకా దూరమైపోయిరి. ***యాపెతు-ఐరోపా ఖండమునకు, హాము-ఆఫ్రికాకు పోయిరి. వారు***

***వీరుసోదరులని తెలిసికొనలేదు. అది మన దేశములో కులములోనికే దింపెను. ఆదాము హవ్వ పాపముయొక్క ఫలితము వారిలో వారికి ఎడబాపు, వారికి దేవునికి ఎడబాపు కలిగెను.*** పాపమువలన (1) మనిషికి మనిషితి ఎడబాపు (2) మనిషికి దేవునికి ఎడబాపు, పాపములు 1) విగ్రహారాధన 2) నేరస్థాపన 3) ఎడబాపు, ఇవన్నియు సాతానును బంధించిన పోవును. అదే వెయ్యేండ్లలో జరుగును. భక్తులలో మొదటినుండి వాగ్ధానమున్నది, గనుక అది వారి పిల్లల, పిల్లలవరకు దాటి మరియమ్మ వరకు వచ్చెను. భక్తిహీనులు పాపములో పెరిగిపోయిరి. మిశ్రమ జనమును దేవుడు అబ్రాహాము వరకు రానిచ్చి అక్కడనుండి కొందరిని అనగా భక్తులను ఏర్పాటు జనాంగముగాచేసి నిరీక్షణ కాలములో పనిచేసెను. ఈ లోకములో భక్తులకు, భక్తిహీనులతోపాటు శ్రమలుండును. సహించుకొనవలెను. ఇన్నాళ్ళు ఉన్నను భక్తిహీనులు భక్తులు కాలేదు అయినను దేవుడు తాను పెట్టిన మనస్సాక్షిని జ్ఞానమును తీసివేయలేదు. ఎన్నిక జనమును ఏర్పరచి వారిద్వారా అందరికి దేవుని గురించి నేర్పించవలెనుగాని వారట్లు చేయలేదు. అది ఈ కాలములో నెరవేరుచున్నది.

# నిశ్శబ్దకాల కథ

నరులు పాపములో పడిపోగ ఏదెను వనమునందు ఆదాము, అవ్వలను సమకూర్చిన దేవుడు రక్షకుని పంపి నరులను రక్షించెదను అను వాగ్ధానము నెరవేర్చుటకై ఒక ప్రత్యేకమైన జనాంగమును ఏర్పాటుచేసికొనెను. ఆ జనాంగమునకే యూదా జనాంగమనె పేరు వచ్చినది. అట్టి జనాంగముతో దేవుడు రక్షకునియొక్క రాకడనుగూర్చి ప్రవక్తల ద్వారా తెలియజేయుచు వచ్చెను. యూదులకు నేర్పవలసినవన్నియు నేర్పివారిచేత చేయింపవలసినవన్నియు చేయించెను. ఆదినుండి నరులకు చెప్పవలసినవన్నియు చెప్పి పాతనిబంధన గ్రంథములో వ్రాయించెను. రక్షకుని జన్మమును గూర్చిన వార్త దేవుడు చెప్పవలసినది ఇంకలేదు గనుక ఆయన మాట్లాడుట మానివేసెను. ***అందుచేతనే ఈ కాలమునకు నిశ్శబ్దకాలమని పేరు వచ్చెను. షుమారు 400 వందల సంవత్సరములు దేవుడు మాట్లాడుట మానివేసెను.*** ఈ నిశ్శబ్ద

కాలమందు స్వభావ సిద్ధముగా నిరాశ ప్రవేశించును. అయినను యూదులలో దైవవాగ్ధాన వాక్యముల యెడలగల నిరీక్షణ మరింత వృద్ధికావలసియున్నది. దేవుడు మాట్లాడకపోయినను విశ్వాసము పెరగవలెను. దేవుడు కనబడక పోవుట, మాట్లాడకపోవుట అను దానినిబట్టి కనబడుచున్న వాటిని పూజించే అవకాశము నరులకు ఉన్నది. అయినను యూదులలో అట్టిది ప్రవేశించలేదు. ఇది నిశ్శబ్ద కాలోపదేశమని గ్రహించిరి. దేవుని మాటలు, పెద్దల మాటలు, యూదల చరిత్ర, రక్షకుని రాకడ ప్రవచనములు, సర్వ అవస్థలయందు జ్ఞానోదయమును, ఆదరణను కలిగించు వాగ్ధానములు గల పాత నిబంధన గ్రంథము వారికి ఉండగా నిరీక్షణను క్షీణింపచేసికొనుట ఎట్లు?

# యోహాను కాల కథ

ఆదికాండము మొదలు, మలాకీ గ్రంథము వరకు యూదులలోని ప్రవక్తలైన వారందరును "మెస్సీయ" అనగా క్రీస్తువచ్చునని ప్రవచించిరి అయితే క్రీస్తు సమకాలికుడైన స్నానికుడైన యోహాను క్రీస్తు వచ్చినాడని ప్రకటించెను. దేవుడు ఏర్పరచుకొనిన యూదుల మతము క్రీస్తువచ్చును అను అంశమును బోధించుచు వచ్చెను. అయితే క్రైస్తవమతము క్రీస్తు వచ్చినాడను అంశమును బోధించెను. **క్రైస్తవమతము యూదా మతముయొక్క నెరవేర్పు.** యూదులైనవారు ఎదురు చూచిన మెస్సీయ అను క్రీస్తుప్రభువు వచ్చినాడు. గనుక ఆయనలో చేరండి. ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయని యోహాను బోధయొక్క ధోరణియైయుండెను. అందుచేతనే యోహాను తన శిష్యులలో ఇద్దరిని మాదిరికి క్రీస్తుయొద్దకు శిష్యులనుగా పంపెను. యోహాను యూదులను తన బోధవలన క్రీస్తును అంగీకరించు స్థితికి తీసికొనివచ్చెను. యూదా మతము కాయ, క్రీస్తుమతము పండు.

దేవుని సముఖమునుండి సందేశము అందుకొనగల మోషే, యెహోషువా, సమూయేలు, దావీదు, యెషయా, యిర్మియా, దానియేలు, యెహెజ్కేలు, హోషెయ, మీకా, జెకర్యా, మలాకీ మున్నగు దైవజ్ఞులైన ప్రవక్తలు గతించిపోయిరి. అయినను వారి సందేశముల వ్రాతల కట్ట మాత్రము

గతింపలేదు. లోకరక్షకుని ప్రవేశమును ప్రకటించు మహర్షిరానైయున్నాడోహెూ, అనునది నిశ్శబ్దకాల ఆరంభమున యూదులకు వినబడిన కడవరి శ్రావణానంద స్వరమైయున్నది. ఆ మనిషి పేరు యోహాను. సూర్యుడు వచ్చుననగా అతని రాకను సూచించు వేగుచుక్కవంటివాడు. ఈ యోహాను ప్రవక్త. మెస్సీయ అనగా క్రీస్తుతట్టు యూదుల దృష్టిని గిర్రున త్రిప్పుటకు పాటుబడిన ప్రవక్త యోహాను. వనవాసియును, నూతన సందేశ వాహినియును, గంభీర స్వరముగల నిర్భయ ప్రసంగియును, ప్రజలు నిరాశ సముద్రమున మునుగుచున్న కాలమున వెలసిన ప్రవక్త యోహాను. ఆహార విషయములోను, వస్త్రధారణ విషయములోను, నివాసస్థల విషయములోను బేధముగా కనిపించు విపరీత యవ్వనుడైన ప్రవక్త. ప్రవక్తలు ఎప్పుడు వత్తురా అని కలవరించుచున్న జనాంగ హృదయములకు కాంతి కలిగించుటకై యుద్ధ సమయమున ప్రత్యక్షమైన హితోపదేశకుడు యోహాను. పాలస్తీనా దేశములోని అన్ని ప్రక్కలలో నుండి వేదాంత పండితులను సామాన్యులను ఆకర్షింపగలిగిన ప్రవక్త యోహాను.

# లోకరక్షకుని కథ

ఏదెను వనమునందు ఆదాము అవ్వలకు దేవుడు చేసిన వాగ్ధానము నెరవేర్చుటకై ఒక ప్రత్యేకమైన జనాంగమును దేవుడు ఏర్పాటుచేసికొనెను. ఆ జనాంగమునకే యూదా జనాంగమని పేరు. యూదులు దైవమతభక్తి కలవారు. కొన్నాళ్ళు రాజ్యముకూడ ఏలినవారైయున్నారు. రక్షకుడైన యేసు పాలస్తీనా దేశములో బెత్లేహేము అను గ్రామమునందు యూదులలో ఒక కన్యక గర్భమునందు జన్మించినాడు. తుదకు ఎలాగైతేనేమి ఆ లోకరక్షకుడు భూమి మీద వెలసినాడు. యూదులైనవారు అప్పుడప్పుడు భక్తిలో తప్పిపోవుచున్న వారైయున్నారు. అయినను లోక రక్షకుడు పుట్టగానే ఈ కబురు యూదులలో కొందరికి దేవదూత తెలుపుట వలన తెలిసినది. ఆ కొందరు లోకరక్షకుని దర్శనము చేసికొన్నారు. లోకరక్షకుడు జన్మించినాడన్న వార్త కనబడిన వారికెల్లా ప్రకటించినారు. ఆ లోకరక్షకుడు ఎదిగి మన పిల్లలవలె పెరిగి పెద్దవాడాయెను. బాల్యమునందు తల్లిదండ్రులకు లోబడియుండెను. ఈ లోకరక్షకుడు పెరిగి పెద్దవాడై యవ్వన దశయందు

పరిశుద్ధాత్మ ద్వారా అరణ్యమునకు కొనిపోబడెను. అరణ్యమునందు 40 దినములు ఉపవాసము చేసెను. లోకమునకు పాపము తెచ్చిపెట్టిన సైతానును వాడి మాయలను గెలువవలెను. ఉపవాసమైన పిమ్మట సాతానుడు ఎదురుపడి శోధించెను. (క్రీస్తుప్రభువు) రక్షకుడైన ఆయన సాతాను మాయలో పడకుండా మొట్ట మొదట సైతానును గెలిచినాడు. సైతానును ఎదిరించి గెలిస్తే అందరిని, అన్నిటిని గెలిచినట్లే. సాతాను మాయలో పడకుండా అతని చేతిలోనుండి మొదట తనను తాను రక్షించుకొంటేనే తప్ప రేపు లోకాన్ని సైతాను చేతిలో నుండి ఎట్లు రక్షించగలడు? అందుచేత అతనిని గెలవడానికి కంటపడ్డాడు.

ఆ లోకరక్షకుడు చేసిన పనులు కొన్ని చెప్పుతాను వినండి. దేవుడు, నరుల తండ్రి. తండ్రి గనుక పాపాత్ములైన నరులు వస్తే చేర్చుకుంటారు. మనిషి తప్పులకుప్ప గనుక దేవుడంటే భయము. లోకమునకు వచ్చిన రక్షకుడు ఆ భయమును తీసివేసాడు. తండ్రి అని చెప్పడంవల్ల ఆ రక్షకుడు, (నరుడు) నరులకు సోదరుడని కూడ బోధించినాడు. ఆ రక్షకుడు పాపాత్ములయొక్క పాపములను క్షమించాడు తన నోటిమాటతో నరులను పీడించు దయ్యాలను వెళ్ళగొట్టినాడు. తన మాటతో జబ్బులను బాగుచేసినాడు. తన మాటతోనే బ్రతుకు చాలించుకొన్న కొందరిని తిరిగి బ్రతికించాడు. తన బోధ వినవచ్చిన ఐదువేల మందికి 5 రొట్టెలు 2 చేపలతో వచ్చిన వారందరికి సరిపడ్డ ఆహారము పెట్టినాడు. తన మాటతో గాలి తుఫానును అణచి వేసినాడు. దోనెలోని శిష్యులు నశించుచున్నామని భయపడి కేకలు వేయగ వారి భయమును తీర్చినాడు. ఆయన మనుస్సలోనైన, మాటలోనైన, క్రియలోనైన, కళంకము లేకుండా నడచి చూపించినాడు. మనిషి దేవుడిచ్చిన ఆజ్ఞలు ప్రకారము నడువలేడని మనిషి అంతరంగమందు ఉన్నది. రక్షకుడు ఎంత దేవుడైన ఆయన అచ్చము మనిషిగా జన్మించినాడు గనుక ఆయన మనుష్యుడేగాని దేవుడుకాదు నడువలేము అనుకున్న మనిషికి ఆజ్ఞల ప్రకారము నడువగలమని నడచి చూపించినాడు. రక్షకుడు మంచితనము కనబరచి ఎంతోమందికి ఉపకారము చేసినాడు. వింతైన పనులు చేసినాడు. ఇట్టి పనులన్నింటిని తిలకించుచున్న యూదులలోని కొందరు నాయకులకు రక్షకునిపై అసూయ

కలిగినది. వారు యూదా మతస్థులు గనుక రక్షకుని బోధకును, వారి బోధకును వేర్పాటు కనబడినది. సాధారణ ఎన్నికలేని జనాంగము ఉపకారముల నిమిత్తమై ఆయనను వెంబడించుచుండగా, వేల సంవత్సరముల తరబడి వచ్చుచున్న యూదా మతము అంతరించిపోవున్నేమో అని యూదా మత ప్రధానులకు ఆందోళన కలిగెను.

యూదా మతాధికారులు ఏదో ఒకరీతిగా రక్షకునిపై నేరముమోపి చంపవలెనను పన్నాగము పన్నిరి. అందుచేత ఆయనను గ్రహింపలేని కొందరు దుర్జనులు ఆయనను పట్టుకొని సిలువ కొయ్యకు మేకులతో అంటకొట్టి చంపివేసినారు. చంపిన వారిని ఆయన చంపలేడా? ఆయన దేవుడు, రక్షకుడుగా వచ్చిన దేవుడు మనిషిని చంపుతాడా? సిలువకొయ్యమీద రక్షకుడు మూడు బరువులను మోసినాడు. 1. మన పాపముల బరువు 2. మన జబ్బుల బరువు. 3. మన శిక్షల బరువు. ఈ మూడింటిని ఆయన సిలువమీద మోసెను గనుక ఇవి మనమీద ఇకలేవు. మనము నమ్మితే ఈ భారములు ఇకమీదట మనమీద ఉండవు. వీటినిబట్టి రానైయున్న ఆ కీడు ఆయనమీదకే వెళ్ళిపోయినది. ఆ కీడు మనమీదనున్న మనము సహించలేము. రక్షకుడు గనుక ఆయన సహించినాడు. ఆయన మనకు రావలసిన కీడు తనమీదనే వేసికొన్నాడు గనుక మనము వాటిని తలంచుకొనడము ఎందుకు? తలంచుకొంటే అవి మనమీదకు వచ్చును. అందువల్ల అవి పోయినవి అని మరచిపోవాలి, మురిసిపోవాలి. ఇందువల్లనే క్రైస్తవులకు సిలువను తలంచుకొనుట ఇష్టము. మన కీడంతయు సిలువమీద వ్రేలాడిన రక్షకునిమీదికి కొట్టుకొనిపోయినదని సంతోషముతో సిలువ కథ తలంచుకొంటారు. విశ్వాసులు క్రైస్తవుల దేవాలయములమీద, సమాధులమీద సిలువగుర్తు వేస్తారు. కొందరు సిలువను మెడలో కట్టుకుంటారు. రాగి సిలువలు, వెండి సిలువలు, బంగారు సిలువలు మెడపై ధరించుకుంటారు. ఇవి చూడగానే ఏమి జ్ఞాపకము వస్తుంది? మనమీద ఉన్న ప్రేమచేత రక్షకుడు ఆ సిలువమీద ఎంత బాధ సహించియున్నాడో జ్ఞాపకమునకు వచ్చును. మనకు రావలసిన కీడు అంతా సిలువమీదనే కొట్టుకొనిపోయినదనే సంగతికూడ జ్ఞాపకమునకు వచ్చుచున్నది.

సిలువమీద వ్రేలాడుచున్న రక్షకుడు ఎంతో బాధపడుచున్నప్పటికిని అక్కడ బాధపడుచున్న ఒక నేరస్తునిచూచి అతనిని రక్షించినాడు. నీ రాజ్యములో నన్ను జ్ఞాపకము చేసికొనుమని ప్రార్ధించగా ఆ నేరస్థుని తనతో కూడ మోక్షమునకు తీసికొని వెళ్ళెను. శ్రమనొందిన రక్షకుడు సిలువమీద చనిపోగా ఆయన శిష్యులు ఆయనను సిలువమీదనుండి దించి ఆయనను సమాధి చేసినారు. ఆయన చనిపోవుట ఎవరి నిమిత్తము? అందరి నిమిత్తమే. మనమీద నున్న శిక్షభారము తీసివేసే నిమిత్తమే. ఆయన భూమిమీద జన్మించడము ఎవరి నిమిత్తము, బోధచేయడము ఎవరి నిమిత్తము, అద్భుతములు చేయడము ఎవరి నిమిత్తము, పగవారివద్ద నిందలు పాలుకావడము ఎవరి నిమిత్తము, సిలువమీదబాధపడడము ఎవరి నిమిత్తము, చావుకు సమ్మతించడము ఎవరి నిమిత్తము, దిక్కులేనిచావు చావడము ఎవరి నిమిత్తము, భూస్థాపన కావడము ఎవరి నిమిత్తము ఇవన్నియు మన నిమిత్తమే. మన మూలముననే గనుక మనము ఆ రక్షకునికి దండము పెట్టవలెను. మా కీడంతా నీవే మోసుకొన్నావు తండ్రీ అని కీర్తన పాడవలెను. ఇంత ప్రేమ చూపిన ఆయనకు ఏమి పేరు పెట్టుదము. రక్షకుడనే పేరు పెడతాము అదే ఆయనకు తగిన పేరు. మనలను రక్షించే పనిమీద ఏర్పాటై వచ్చి ఇంతగొప్ప పని చేసినాడు గనుక రక్షకుడని పేరుతో పిలవడము బాగుగా ఉంటుంది. గనుక రక్షకుని కథ గ్రీకు భాషలో వ్రాసిన వారు యేసుక్రీస్తు అను పేరును వాడినాడు. వారి భాషలో యేసుక్రీస్తు అనగా నియమిత రక్షకుడని అర్ధము. నియమిత రక్షకుడు అనగా రక్షించుటకు ఉన్న రక్షకుడని అర్ధము. ఈయన ఒక్కడే ఈయన దేవుడే మన నిమిత్తమై నరుడైనాడు. ఆయన కథనుబట్టి ఈ విషయమును తెలిసికొనవచ్చును.

పల్లవి : రక్షకా నా వందనాలు – శ్రీ రక్షకా నా వందనాలు

1. పాప భారమెల్లమోసి – బరువు దించివేసినావు ॥రక్షకా॥
2. వ్యాధి భారమెల్లమోసి – వ్యాధి దించివేసినావు ॥రక్షకా॥
3. శిక్షభారమెల్లమోసి – శిక్షదించి వేసినావు ॥రక్షకా॥
4. మరణ మొంది మరణభీతి – మరలకుండ జేసినావు ॥రక్షకా॥
5. నరకము తప్పించి మోక్ష–పురము సిద్ధపరచినావు ॥రక్షకా॥

6. నేను చేయలేని పన్ని – నీవె చేసి పెట్టినావు ॥రక్షకా॥

7. యేసుక్రీస్తు ప్రభువ నిన్ను–యేమని స్తుతింపగలను ॥రక్షకా॥

ఇంకా ఈయన కథ వినండి. ఆయన చనిపోయినాడు గాని ఆయన చనిపోయి అంతే ఉండిపోలేదు మూడవ దినమందు ఆయన సమాధినుండి బయటకు వచ్చివేసినాడు. సమాధిపై పెద్దరాయి దొర్లించి ముద్రవేసినను ఆ ముద్ర ఆయనను ఏమియు చేయలేదు. సాతానుడు లేవకుండ సమాధికి ముద్రవేసిన ఆయన లేచి బయటకు వచ్చినాడు. ఆనాడు నాలుగువేల సంవత్సరాల క్రిందట ఆది తల్లిదండ్రులైన ఆదాము అవ్వలకు పండు తినిపించి పాపములో పడవేసిన సాతానుడు రెండవ ఆదాము అయిన రక్షకుని చంపినాడు. కాని మరల తిరిగి బ్రతకకుండ చేయ కలిగినాడా? తాను పాపములో పడవేసిన లోకాన్ని రక్షించడానికి వచ్చినాడనే పగచేత రక్షకుని చంపించినాడుగాని, బ్రతికి రాకుండ చేయగలిగినాడా? దయ్యాలగుంపు రక్షకుని ఏమియు చేయలేకపోయినది. సమాధి దగ్గర కాపు కాసిన బంట్రౌతులు రక్షకుని బయటకు రాకుండా ఆపుచేయ గలిగినారా? సమాది ఆయనను అణచి వేసిందా మరణము మ్రింగి వేసిందా, మ్రింగి వేయలేదు మూడు రోజులు సమాధిలో నున్న శరీరము కుళ్ళు పట్టిందా ఆది నుండి ఆయనను కుమ్మరములోనికి దింపవలెనని వెంటాడిన పాపములు తరుముకొని వెళ్ళినావా? కుట్ర ఆలోచన చేసిన పగవారు పారిపోతున్నావని అడ్డుతగిలినారా? పాతాళలోకము ఆయనను పోనీయ్యకుము అని అన్నదా? ఇన్ని ఏండ్లనుండి ఆయనమీదకి ఎదురు తిరిగిన చీకటి రాజ్యము ఆయనను ఏమైన చేయకల్గినదా? క్రీస్తే భూలోక శత్రువులను, భూగర్భ సమాధి పాతాళలోకమును, దయ్యాలను, జబ్బులను, అన్నింటిని గెలిచినాడు. గనుక ఈయన మనలను రక్షించగలడు. బ్రతికించగలడు. తరువాత ఏమి జరిగినదో వినండి.

జయము కీర్తనలు –జయ శబ్దముతో రయముగ పాడండి– జయము జయమాయెనులెండి – జయమే క్రీస్తుని చరిత్ర యంతట – జయమే మరణమున – గూడ జయమే నిత్యమును సద్విలాస్ ॥జయము॥

1. యేసుక్రీస్తు ప్రభువొందిన జయమే – ఎల్లవారికౌను – కోరిన యెల్ల వారికౌను – వేడిన యెల్లవారికౌను – నమ్మిన యెల్ల వారికౌను= యేసు పేరే మీ చిక్కులపైన వేసికొన్న జయము – జయమని వ్రాసికొన్న జయము సద్విలాస్ ॥జయము॥

2. జయము రాకపూర్వంబే – జయమను జనులకు జయమౌను – స్తుతించు జనులకు జయమౌను – స్మరించు జనులకు జయమౌను – ప్రకటించు జనులకు జయమౌను – జయము జయమని – కలవరించిన జయమే బ్రతుకెల్ల ఇక నప జయ పదమేకల్ల సద్విలాస్ ॥జయము॥

రక్షకుడు మరణమొంది తిరిగి లేచిన పిమ్మట ఈ భూమిమీద నలుబది దినములు ఉండి శిష్యులైన వారికి కనబడి వారికి చెప్పవలసిన మాటలన్నియు చెప్పి వారిని ధైర్యపరచి పరలోకమునకు వెళ్ళినాడు. ఆయన ఈ భూమిమీద ఉన్నప్పుడు మూడు మాటలు చెప్పినాడు. ఆ మాటలుకూడ వినండి.

***మొదటి మాట:*** – శిష్యులను ఉద్దేశించి సర్వసృష్టికి సర్వలోకమంతా తిరిగి నా సంగతులు అందరికి చెప్పమని నన్ను నమ్మినవారికి బాప్తీస్మము ఇచ్చి నా శిష్యులనుగా చేయండి. నమ్మనివారికి శిక్షవిధింపబడును. బాప్తీస్మము పొందడము అనగా రక్షకునికి శిష్యులు కావడము. ఆయన మతములోనికి రావడము.

***రెండవ మాట:*** – అయితే నేను వెళ్ళి తండ్రి వాగ్ధానము చేసిన ప్రకారము పరిశుద్ధాత్మను మీ మీదకు పంపించెదను. అంతవరకు యెరూషలేములో నిలిచియుండి కనిపెట్టండి అని చెప్పెను.

***మూడవ మాట:*** – నా తండ్రి ఇంట అనేక నివాసములు కలవు. లేనియెడల చెప్పుదును. నేను ఉండులాగున మీరును ఉండునట్లు మిమ్మును మరలావచ్చి తీసికొని వెళ్ళుదును. ఈ మూడు మాటలు రక్షకుడు తెలియపరచెను.

# క్రైస్తవమత సంఘ కథ

తరువాత ఏమి జరిగినదో వినండి. ఆరోహణమై పరలోకమునకు ఎత్తబడిన రక్షకుని శిష్యులు తేరిచూచి వెనుకకు మళ్ళి యెరూషలేమునందు

చేరి రక్షకుడు చెప్పిన మాట నెరవేరు నిమిత్తము పది దినములు ఏకరీతిగా కూడుకొనిరి. ఆ పిమ్మట శిష్యులపై దైవాత్మ విభాగింపబడిన అగ్ని నాలుకలువలె వ్రాలగ వారు దైవాత్మను పొందిరి. ఆ దినవే క్రైస్తవమత ఉద్భవ దినమైయున్నది. శిష్యులు ధైర్యముతో మతబోధకులుగా బయలుదేరినారు. అనేక దేశములకు చెదరిపోయి క్రీస్తును గురించి ప్రకటించిరి. ఈ బోధలు విని రక్షకుని అంగీకరించి బాప్తీస్మము పొందిన వారే క్రైస్తవులనబడినారు. వీరి మతమే క్రైస్తవమతము. కాలక్రమేణ శిష్యుల బోధనలు బట్టి క్రైస్తవమతము లోకమంతట వ్యాపించినది. క్రైస్తవమత గ్రంధమే బైబిలు గ్రంధము. కొన్నాళ్ళకు రక్షకుని శిష్యులు ఒకరి తరువాత ఒకరు గతించిపోయిరి. తరువాత బైబిలు చదువుకొనుచున్నవారిలో విబేధములు కలిగినవి. అందుచేత ఎన్నో మిషనులుగా చీలిపోయినవి అందరివద్ద ఉన్న బైబిలు ఒక్కటే. బైబిలునుబట్టి చీలికలు కలుగలేదుగాని, బైబిలునుబట్టి అందులో ఉన్న సంగతులను అర్ధము చేసికొనుటలో విభేదము కలిగినది. ఎవరి ఇష్టమునుబట్టి, ఎవరి జ్ఞానమునుబట్టి బైబిలు గ్రంథమును అర్థము చేసికొనుటలో ఈ ముప్పు వచ్చినది. క్రైస్తవమతము చీలిపోయిన, శాఖలైపోయిన క్రీస్తే రక్షకుడని బోధించుచున్నది. ఈ విషయములో అన్ని మిషనులు ఒక్కటే. బైబిలు రెండువేల భాషలలోనికి మార్చినారు. ఈ విధముగా ఏ మత గ్రంథముకూడ తర్జుమా కాలేదు.

# మన కాలకథ

క్రైస్తవమతము సర్వలోక మతము గనుక మొదటినుండి సర్వలోకములో ప్రకటనయగుచున్నది. బైబిలు అనే గ్రంథమొక్కటే సర్వలోకముయొక్క గ్రంథము గనుక ఆ గ్రంధమునకు సర్వలోక భాషలలోనికి తర్జుమా చేయగల యోగము పట్టినది. దేవుడు ఒక్కడే ఆ దేవుడు సర్వలోకమును కలుగజేసినాడు, రక్షకుడు ఒక్కడే ఆ రక్షకుడే నరావతారమెత్తగా యేసుక్రీస్తు అను పేరుమీద ప్రసిద్ధి కెక్కినాడు. మతము అంతయు ఒక్కటే. అవతార పురుషుని గురించి బోధించుచున్న మతము క్రీస్తుమతము. ఆ మత గ్రంథము ఒక్కటే ఆ మత గ్రంథమును గురించి వ్రాసియున్న ఈ సంగతులు మరువకండి.

క్రీస్తు శిష్యులు ఒక మత సంఘముగా ఏర్పడి ఏ పనిచేయుచున్నారు? యేసుక్రీస్తుచేసిన పని చేయుచున్నారు. రక్షకుడు చేసినంత పనిచేయకపోయిన తాము చేయగలిగినంత చేయుచున్నారు. యేసుక్రీస్తు బోధలు బోధించినారు. క్రైస్తవులుకూడ బోధించుచున్నారు. బడిలో, గుడిలో, వీధులలో బోధించు చున్నారు. కాగితములువేసి, పుస్తకాలు వేసి బోధించుచున్నారు. క్రీస్తుప్రభువు తనయొద్దకు వచ్చిన రోగులను బాగుచేసినారు. క్రైస్తవులు ఆసుపత్రులు పెట్టి రోగులకు సహాయము చేస్తున్నారు. కొందరు భక్తులు మందులు లేకుండగనే ప్రార్ధనచేసి రోగులను బాగుచేయుచున్నారు. యేసుప్రభువు ఆకలితోనున్న 5 వేలమందిని పోషించారు. క్రైస్తవులు బోర్డింగ్‌పెట్టి పిల్లలకు ఆహారము పెట్టుచున్నారు. బట్టలు ఇస్తు ఉన్నారు. యేసుక్రీస్తువారు, వారము, వారము దేవాలయమునకు వెళ్ళినారు. అలాగుననే క్రైస్తవులుకూడ వారము, వారము దేవాలయమునకు వెళ్ళుచున్నారు. ఈ ఆచారము మహామంచిది, ఈ ఆచారము మతమునకు ప్రధానము వంటిది.

నమ్మి జీవించండి – శ్రీ యేసు క్రీస్తున్ – నమ్మిజీవించండి – నమ్మిన వారికి నరకము తప్పును, నమ్మినవారికి మోక్షము దొరుకును

॥నమ్మి॥

1. నెమ్మదిగా యిది యంతయు విన్న – నమ్మగలడు ఈ నరుడ కథలు ॥నమ్మి

2. నమ్మిక కొరకు ప్రార్ధన చేసిన – నమ్మిక వరమై నడుచును గాన ॥నమ్మి॥

# గురుతుల కథ

యేసుక్రీస్తువారు రెండవసారి వస్తానన్నారు అని చెప్పినారుకదా ఆయన రాకడకు ముందు లోకములో కొన్ని గురుతులు జరుగుతాయి అని బైబిలులో నున్నది. ఆ గురుతులు వినండి.

ఎవరైతే నరరూపిగా నున్న యేసుక్రీస్తును చంపినారో ఆ యూదులయొక్క సంతతి వారు దేశదేశములు చెదరిపోయి రెండవ రాకడకు ముందు తమ సొంత దేశము అనగా పాలస్తీనా దేశము చేరుకొందురు అని ఉన్నది. ఇది

మన కాలములోనే నెరవేరుచున్నది. వార్తా పత్రికలు చదివిన యూదుల సంగతి బాగుగా తెలియవస్తుంది.

లోకమంతా చాలా గంధరగోళముగా ఉండునని బైబిలులో నున్నది. మన కాలములో ఈ విధముగా ఉన్నది కదా తరచుగా యుద్ధ వదంతులు వినుచున్నాము. పాపము ఎక్కువైపోయినది. పోట్లాటలు, నరహత్యలు, దొంగతనాలు బహు విపరీతముగా జరుగుచున్నవి. కరువులు, భూకంపములు, వరదలు వీటివల్ల ఎందరో నశించిపోతున్నారు. ఒక మతమునకును, ఇంకొక మతమునకును వివాధము కలుగుచున్నది. మతస్థులలో మతస్థులకే తర్కము, ఒక రాజ్యమునకు, మరొక రాజ్యమునకు పొత్తు కుదరటములేదు. ఒక రాజ్యములోనున్న ప్రజలకు కలహములు కలుగుచున్నవి. లోక చరిత్ర అంతా తరిస్తే ఎవరికిని మనస్సులో నెమ్మదిలేదు. ఈ ప్రకారముగా జరుగునని బైబిలులో వ్రాయబడియున్నది. మన కండ్ల ఎదుట ఇవన్నీ జరుగుచున్నవికదా కాబట్టి యేసు ప్రభురాకడ దగ్గర పడినది అని మనమందరము సిద్ధముగా నుండవలసినదే.

ఇంకొక గుర్తు చెబుతాను వినండి. ఇది అందరికి తెలియదు. యేసుక్రీస్తు వారు నరావతార మెత్తక మునుపే ఒక భక్తుడు దేవ దర్శనములో చూసి వ్రాసినారు. అదేమంటే ఆఖరు రోజులలో దేవుడు అన్ని దేశాలలో ఉండే భక్తులమీదను అడిగే వారందరిమీదను తన ఆత్మను ధారబోయుదునని వాగ్ధానము ఇచ్చినారు. ఆ వాగ్ధానము యూదుల మతము గతించిపోయే ఆఖరి రోజులలో నెరవేర్పులోనికి వచ్చినది. దేవుడు చాలామందికి దైవాత్మను ధారపోసినాడు. ఈ ధారబోయడమునకే పరిశుద్ధాత్మ బాప్తీస్మము అని అంటారు. మన రోజులుకూడ ఆఖరి రోజులే ఎందుకంటే క్రైస్తవమతస్తులలో అనేకమంది పరలోకమునకు వెళ్ళిపోదురు. యేసుక్రీస్తువారు మేఘములమీద తీసికొని వెళ్ళిపోదురు. కాబట్టి ఈ దినములలో చాలామందిపై దేవుడు తన పరిశుద్ధ ఆత్మను ధారపోయుచున్నాడు. మీరు క్రైస్తవుల దగ్గరకు వెళ్ళి కనుగొనుడి. దేవుడు దైవాత్మను ధారబోయడము, ఒక్క క్రైస్తవులకే కాదు కోరిన వారందరికిని తన ఆత్మను కుమ్మరించును. చావులేకుండ చేసికొని మేఘము ఎక్కి మోక్షమునకు వెళ్ళగోరు వారందరికి ఈ మాటలు తెలియజేయు చున్నాము. కోరుకొని ప్రార్థించండి.

# రాకడ కథ

క్రీస్తు ప్రభువు రాకడ మహా వినోదముగా ఉంటుంది. క్రీస్తు ప్రభువు మేఘముమీద మధ్య ఆకాశముమీదకి వచ్చును. ఇది వినోదము కాదా! ఇది అందరికి తెలియును ఇది వినోదముకాదా! అంతలో రెండు జట్లు ఆ మేఘములోనికి వెళ్ళుదురు. ఆ మేఘము ఆకాశములో మనకు కనబడే మేఘము వంటిదికాదు. మోక్షపు లోకములోనుండి వచ్చే తేజోమయమైన మేఘము. ఇది వరకు క్రీస్తును ఎవరు నమ్మి చనిపోయిరో! వారు ఒక జట్టు, క్రీస్తు వచ్చే దినమందు ఎవరైతే ఆయన రాకడ కొరకు భూమిమీద సిద్ధపడి ఉందురో వారు ఒక జట్టు. అనగా మృతులు ఒక జట్టు, సజీవులు ఒక జట్టు. ఈ రెండు జట్టుల వారు మేఘములో కలిసికొందురు. బ్రతికి ఉన్న జట్టులోని వారికి మరణము కలుగదు వారికి క్రొత్త శరీరము అనగా మహిమ శరీరము వచ్చును. అట్టి మహిమ శరీరముతో గాలిలో ఎగిరి మేఘములోనికి వెళ్ళుదురు. ఒక రెప్పపాటు సమయములోనే ఈ పని అంతయు కూడ జరిగిపోతుంది. ఎటువంటివారు ఎగిరివెళ్ళగలరూ? మనలో ఎవరు రాకడను గూర్చిన సంగతి నేర్చుకుంటారో అలాగు నేర్చుకొని ఆయన ఇప్పుడే వస్తారని నమ్ముదురో, నమ్మి ఆయన ఆజ్ఞల ప్రకారము నడిచెదరో నడుచుచు ఆయన రాకడ ఎప్పుడు అని కలవరించెదరో, ఓ దేవా సిద్ధమయ్యేటందుకు నాకు దైవాత్మ బాప్తీస్మము ఇమ్మని ప్రార్ధనచేసికొందురో రాకడకు సిద్ధపర్చుమని బ్రతిమలాడుకొందురో ఈ రీతిగా ఎవరైతే సిద్ధపడగలరో అట్టివారు సజీవుల జట్టులో గూడి మేఘ మెక్కుదురు. ఈ రెండు జట్టుల వారికి పెండ్లికుమార్తె సంఘమని పేరు ఉన్నది. ఇది ఒక చిత్రమైన పేరు. పెండ్లికుమార్తె సంఘమని పేరు ఉన్నది. ఇది ఒక చిత్రమైన పేరు. పెండ్లికుమార్తె అనే ఈ పేరు లోకములో మనము చూస్తు వింటు ఉన్న పెండ్లికుమార్తె మాత్రముకాదు. వీరిని యేసుక్రీస్తు వారు పరలోకములోని మహా ఉన్నతమైన నూతన యెరూషలేమునకు తీసికొని వెళ్ళుదురు. మీకుకూడ వెళ్ళాలని ఉంటే సిద్ధపడండి. యేసుప్రభువు మన కాలములోనే వచ్చును అని అనుకొనుటకు వీలు ఉన్నది.

ఎందుకంటే ప్రస్తుత కాలములో అటువంటి సంగతులు జరుగుచు ఉన్నవి. ఈ దినములలో క్రైస్తవులకు సహితము విశ్వాసము తగ్గిపోవుచున్నది. రాకడ త్వరలో వచ్చుచున్నదని నమ్మని క్రైస్తవులు లోకమంతట అనేకులు ఉన్నారు. యేసుక్రీస్తు వారు ఈ లోకములో ఉన్నప్పుడు చెప్పనే చెప్పారు. ఆఖరి రోజులలో అనేకులకు క్రీస్తురాకడను గూర్చి నమ్మిక ఉండదని తెలియజేసారు. గనుక మనము జాగ్రత్తగా నుండవలెను. గ్రంథమునందు ఏమి ఉన్నదో అదియు నమ్మి ఉండవలెను. ఆ ఘడియ, ఆ దినము ఎవరికి తెలియదని క్రీస్తువారు తెలియజేసిరి. ఇప్పుడే అన్నట్లు ఎట్లు చెప్పగలరు అని కొందరు అడుగుచున్నారు. సంవత్సరాలు తెలియవని చెప్పలేదు. ఆ దినము, ఆ ఘడియ తెలియదన్నాడు కాలము అయిపోయినది గనుక ఆయన రాకడ సమీపముగా నున్నదని ఊహించవచ్చును. రావడము ఆయన పని. సిద్ధపడడము మన పని. ఆయన ఎప్పుడుబడితే అప్పుడు వచ్చెదరు గనుక మనము కూడ ఎప్పుడు బడితే అప్పుడే సిద్ధపడవలెను.

***కీర్తన:-*** ***(చాయ : యేసుని - సేవింప)***

స్తోత్రము చేయుము సృష్టికర్తకు – ఓ దేవనరుడా – స్తోత్రము చేయుము సృష్టికర్తకు –స్తోత్రము చేయుము శుభకర – మతితో = ధాత్రికి గడువిడు దయగల తండ్రికి ॥ స్తోత్రము ॥

1. పాపపు బ్రతుకెడబాయు నిమిత్తమై – ఆపదవేళల – కడ్డము బెట్టక – ఆపదమ్రొక్కులు – అవిగైచేయక = నీపైసత్కృప –జూపెడు తండ్రికి ॥ స్తోత్రము ॥

2. యేసుప్రభువుతో నెగిరిపోవభూ – వాసులు సిద్ధపడు నిమిత్తమై – ఈ సమయంబున – ఎంతయు ఆత్మను = పోసి ఉద్రేకము పొడమించు తండ్రికి ॥ స్తోత్రము ॥

ఆయన రెండవమారు వచ్చుట నిశ్చయము మీరు సిద్ధముగా నుండుట నిశ్చయమేనా? యేసుప్రభువు మధ్యాకాశములోనికి రెండవసారి వస్తే మొదటిసారి ఎగిరి వెళ్లేవారి కథ ఇప్పుడు మీరు విన్నారు.

# రెండవసారి వెళ్ళేవారి కథ

ఇప్పటి వరకు మొదటిసారి ఎగిరి వెళ్ళేవారి కథ విన్నారు. ఇప్పుడు రెండవసారి ఎగిరి వెళ్ళేవారి కథ వినండి. క్రీస్తువారు సిద్ధపడిన సంఘమునకు తీసికొని వెళ్ళిన తరువాత చాలామంది భూమిమీద మిగిలిపోవుదురు. వారి కథ ఏమిటి? మిగిలిపోయిన వారిలో కొందరు పశ్చాత్తాపపడి ప్రభువా, మేము మొదటి పిలుపునాడు సిద్ధపడకపోవుట మా తప్పే, పశ్చాత్తాపముతో క్షమించుమని ప్రార్థించెదరు. అప్పుడు ఆయన వచ్చి ఎవరైతే పశ్చాత్తాముతో ప్రార్థించినారో, అట్టి వారినందరిని తీసికొనివెళ్ళి మోక్షములో వేరొకచోటవారిని చేర్చివేయును. వారు మొదటిసారి వెళ్ళిన ఆ జట్టువారియొద్దకు వెళ్ళలేరు. ఒకవేళ వెళ్ళిన ఆ స్థలమందున్న మహిమకు ఆగలేరు. ఎలాగైతేనేమి క్రీస్తు ప్రభువు తిరిగి వచ్చేసమయమునకు చావు తప్పించుకొని ప్రభువుతో వెళ్ళినారు. రెండవ రాకడలో మహిమతో వెళ్ళిన రెండు జట్టుల వారితో వెళ్ళకపోయినను తరువాత వెళ్ళిరి. అంతే చాలును. మొదటిసారి సిద్ధపడి ఉంటే ఎంతో బాగుండును. శ్రమలు తప్పించుకొని ఉందురు. భూమిమీద ఆరంభించే శ్రమలను దాటికొని వెళ్ళిపోయి ఉందురు.

# మహాశ్రమకాల కథ

మొదటిసారి కొందరు వెళ్ళిపోయినారు, రెండవసారి మరికొందరు వెళ్ళిపోయినారు. ఇంకా భూమిమీద మిగిలి ఉన్నవారిలో మిగిలిపోయినవారు ఉందురు. వారు క్రీస్తును నమ్మనివారు. అంతలో అంతెక్రీస్తు అని పేరుగల క్రీస్తువిరోధి భూమిమీద ఏలుబడి ఆరంభించును. క్రీస్తును నమ్ముచున్న వారిని చాలామందిని హింసించును. అటువంటి హింస లోకములో ఎప్పుడులేదు. ఒక హింస తరువాత ఒక హింస, తుదకు కొందరు హింసలకు ఓర్వలేక చావు కోరుకొందురు. కోరుకొన్నను చావురాదు. హింసయే కాని చావు కనబడదు. అంతెక్రీస్తు సైతానుయొక్క లక్షణములను, చాకచక్యమును, శక్తులను, అధికారమును కలిగియున్నది. సర్వవిద్యలు ఎరిగినవాడు, జనవశీకరము చేసికొనగల రూపవాక్కులు గలవాడు, భూలోక రాజ్యముల

మీదను, వర్తక వ్యాపారములమీదను, ధనాగారములమీదను స్వతంత్రాధికారము గలవాడు. ఇతడు తనను విశ్వసించి వెంబడించు వారిమీద ముద్రవేయును. అట్టి ముద్రగలవారు ఎక్కడైన సరుకులు కొనుక్కొనవచ్చును. ఎవరికైన సరుకు అమ్ముకొనవచ్చును. క్రీస్తును నమ్మిన క్రైస్తవులకు ఆ ముద్ర ఉండదు. గనుక వారు కొనలేరు, అమ్మలేరు ఎంత కరువో చూడండి.

అయినప్పటికిని దేవుని పక్షముగా నుండే ప్రజలు గనుక దేవుడే వారిని నడిపించును. అంతెక్రీస్తు పక్షమున నుండినవారు బాగుగానే తింటారు. సుఖముగానే బ్రతుకుతారు. తుదకు అంతెక్రీస్తుతోపాటు నరకములోనికి వెళ్ళవలసి వస్తుంది. ఏమి లాభము? అంతెక్రీస్తు ప్రజలను ఎంతగానో హింసిస్తాడు. దేవునితట్టు తిరుగకుండుగా చేయుటకు వారిని హింసించును. అంతెక్రీస్తు సైతానుయొక్క పెద్ద నాయకుడు. సైతానుకు బదులు అతడు భూలోక రాజ్యములన్నింటిని ఏలును. అతనికి ఉన్న తెలివి ఇంకొకరికి ఉండదు. కావలసినంత ధనము ఉండును. అతడు మహా ఆరోగ్యమంతుడు, సౌందర్యవంతుడు మొదటి సంఘమైన పెండ్లికుమార్తెయు పైకెత్తబడిన తరువాత వస్తారు. అంతెక్రీస్తునకు సహాయము చేయుటకు అబద్ధప్రవక్త అనే పేరుగల వాడు ఒకడు వచ్చును. అంతెక్రీస్తు లోకరక్షకుడు, ఆయనకే మ్రొక్కండి అని లోకప్రజలకు నచ్చేటట్లు చెప్పును. అనేకమంది అతని మాటలలో పడి మోసపోవుదురు. వీరిద్దరితో కలిసి సహాయము చేయుటకు మూడు కప్పలు వచ్చును. ఇవి సాతానుయొక్క దురాత్మలు. విగ్రహములలో దురాత్మలు దూరి మాట్లాడితే వినేవారు విగ్రహములు మాట్లాడుచున్నది అనుకొని ఆ విగ్రహమే దేవుడని నమ్మి ఆ విగ్రహమునకు పూజిస్తారు.

అయితే ఈ సందర్భములో ఇంకొక సంగతి కూడ చెప్పవలసి వస్తుంది. నరుడు దేవుని విరోధించినందున తన ఇష్టము వచ్చిన పాపములు చేయుట వల్ల తనమీదికి ముప్పు తెచ్చుకున్నాడు. సృష్టిమీదకు అనగా సూర్య, చంద్రాదుల మీదికి, మేఘములమీదికి, జంతువులమీదికి, భూమిమీదికి, ముప్పు తెచ్చిపెట్టుకున్నాడు. ఆ కారణముచేత లోకములో అధికమైన ఎండకాయును. ఆ ఎండకు వంటినిండ పెద్ద పెద్ద పొక్కులు వచ్చును. పెద్ద పెద్ద వడగండ్లుపడి

చాలామంది చనిపోతారు. అప్పుడప్పుడు భూకంపములు కలుగును. చాలామంది భూమి నెఱ్ఱలలోపడి చనిపోవుదురు. అడవి జంతువులు గుంపులు, గుంపులుగా ఊళ్ళలోనికివచ్చి నిరాటంకముగా మనుష్యులను తినివేయును. భయంకరమైన కరువు వచ్చును. ఇవన్నియు అంతెక్రీస్తు మూలముగారావు కాని సృష్టిమూలముగా వచ్చును.

ఇవన్నియు మనిషి చేసిన పాపములనుబట్టి వచ్చును. దేవుడు అడ్డము పెట్టడు. ఈ కష్టాలలోనైనను నరుడు దేవుని తట్టు తిరుగవలెనన్నది దేవుని ఉద్దేశ్యము. ఈ కష్టాలను అనుభవించిన నరునికి బాధ రానిచ్చి నరకము తప్పించాలన్నది దేవుని ఏర్పాటు. ఈ శ్రమకాలములో కోటానుకోట్ల మంది తమ తప్పును తెలిసికొని దేవుని తట్ట తిరుగుదురు. అలాగే దేవుని ప్రజలైన యూదా ప్రజలలో 144 వేలమంది దేవుని తట్టు తిరుగుదురు. దేవుడు శ్రమలను పంపించుటనుబట్టి ఎంతమంది దేవుని తట్టు తిరిగి బాగుపడినారో చూచినారా! అంతెక్రీస్తు కాలములో క్రీస్తును నమ్మినవారు మొదటిసారే సిద్ధముగా నుంటే అప్పుడు ఎగిరి వెళ్ళిన రెండు జట్టుల వారితో కలిసి వెళ్ళియుందురు, గాని సిద్ధపడలేదు గనుక ఆగిపోయినారు. లోకవాసులను అంతెక్రీస్తు తట్టు తిప్పుటకు ఒక సమాజము ఏర్పడును. దానికే స్త్రీ అను బిరుదుకలదు. స్త్రీ సాంగత్యము చేయని 144 వేలమంది యూదులు క్రీస్తుప్రభువే తమ మెస్సియ్యా అని అంగీకరించి రక్షింపబడుదురు.

# హర్మగెద్దోను కథ

ఇంకొక కథ చెపుతాను వినండి. ఇది హర్మగెద్దోనుయుద్ధము గురించిన కథ. ఏడేండ్ల మహాశ్రమ అయిపోయిన పిమ్మట అంతెక్రీస్తు, యేసుక్రీస్తుతో యుద్ధము చేయుటకు భూమి అన్ని ప్రక్కలనుండి ఒక పటాలమును పోగుచేయును. ఆ పోగైన పటాలాలన్నీ పాలస్తీనా దేశము వెళ్ళును. ఆ దేశములో యెరూషలేమునకు ఉత్తరమున మెగిద్దో అను ఒక స్థలమున్నది. అక్కడ ఈ యుద్ధము జరుగును. ఆ హర్మగెద్దోను గూర్చి ఒక విచిత్రము ఏమిటంటే ఇప్పటికి అది ఖాళీగానే కనబడుచున్నది. మీరు వెళ్ళి చూసిన

మీకు తెలియును. ఆ స్థలముచుట్టూ పొలములు చేసేవారు, తోటలు వేసికొనేవారు ఉన్నారు. ఆ స్థలముచుట్టూ, చుట్టూ ఉంటున్నారు గాని ఆ స్థలములోనికి వెళ్ళడములేదు. ఆ స్థలములో యుద్ధము జరుగును గనుక దేవుడే ఆ స్థములోనికి ఎవరిని వెళ్ళనివ్వడములేదు. ఈ సంగతి అక్కడ ఉన్న నివాసులకు తెలియదు. ఇప్పుడు మనము అనుకొంటూ ఉన్నది ప్రపంచ యుద్ధముకాదు.

నేటి దినాలలో ఒకవేళ ప్రపంచ యుద్ధమే అయితే రాజులకు, రాజులకును; దేశ, దేశములకు జరుగును గాని హర్మగెద్దోను యుద్ధము క్రీస్తుకును, అంతెక్రీస్తునకును జరిగే యుద్ధమైయున్నది. ఆ దేశములో భక్తులు ఉందురు. వారు చాలా భయపడిపోదురు. క్రీస్తుప్రభువును ప్రార్థించెదరు. అప్పుడు గొప్ప భూకంపము కలుగును. ఆ భూకంపమునకు ఒక పెద్ద స్థలము ఖాళీ అగును. ఆ భక్తులు ఆ ఖాళీ స్థలములోనికి పారిపోదురు. వారిని తరుముకొని అంతెక్రీస్తునకు సంబంధించిన వారు వెళ్ళుదురు. వెంటనే యేసుక్రీస్తువారు పరలోక పటాలముతో దిగి వచ్చెదరు. ఆ పటాలమును చూడగానే భూలోక పటాలములు గజ, గజ వణకిపోవును. యేసుక్రీస్తువారు వారి నోటిమాటయొక్క ప్రభావవాక్కు భూలోక పటాలములన్నింటిని నశింపోచేయును. అప్పుడు యేసుక్రీస్తువారు అంతెక్రీస్తును, అతని సహాయకుడైన అబద్ధ ప్రవక్తను, దయ్యాలన్నింటిని పట్టుకొని నరకాగ్ని గుండములో పడవేయును గాని వారి అధికారియగు సాతానును పట్టుకొని పాతాళ లోకములోని చెరసాలలో బంధించివేయును. దానినే మట్టులేని గొయ్యి అని అందురు. సైతాను అక్కడ వెయ్యేండ్లు ఉంటాడు. హర్మగెద్దోను కథ అయిపోయినది. ఇన్నాళ్ళకు భూమి పరిశుభ్రమౌతుంది, పాపము చేయించేవారు ఎవ్వరునులేరు. అందుచేత భూమి శుభ్రముగాను, హాయిగాను ఉండును.

# వెయ్యేండ్ల పరిపాలన కథ

ఇప్పుడు ఇప్పుడు ఇంకొక కథ చెప్పెను వినండి. క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి వచ్చినది గనుక క్రొత్త కథ రావద్దా? నేను చెప్పవద్దా? మీరు

వినవద్దా? క్రొత్త ఆకాశము అనగా ఇదివరకున్న ఆకాశమే గాని వెయ్యేండ్ల పరిపాలనా కాలమందు మార్పుచెందును. క్రీస్తు ప్రభువుతో మేఘములో మొదటిసారి వెళ్ళిన విశ్వాసులైన వారు ఈ భూమిమీదకు మరలా తిరిగి వచ్చెదరు. వారు భూలోకమంతటిని పరిపాలించెదరు. లోకమంతటా తిరిగి అన్ని భాషలు మాట్లాడు ప్రజలకు క్రీస్తును గూర్చి బోధించెదరు. మరి ఎక్కడికి వెళ్ళిన ఆ భాషతో నేర్చుకొనకుండనే బోధించెదరు. మహిమ శరీరముతో వచ్చెదరు. గనుక ఎక్కడబడితే అక్కడికి ఎగిరి వెళ్ళగలరు. మన కాలములో ఉన్న బోధకులు క్రీస్తునుగూర్చి పూర్తిగా నేర్చుకొనలేరు. నేర్చుకొన్నది పూర్తిగా అందరకు చెప్పడములేదు. అందుకొన్నది అందించుట కూడలేదు. యేసుక్రీస్తు వారివలె అద్భుత కార్యములు చేయడములేదు. నేటి క్రైస్తవ బోధకులు చేసేపని అంతయు అసంపూర్ణము. వారు ప్రకటించినది బహు తక్కువే.

అప్పుడైతే పరలోకమునుండి దిగివచ్చినవారు సంపూర్ణ సేవ చేయుదురు. ఇప్పుడు సేవచేయుటకు అన్ని ఆటంకములే. అప్పుడు ఆటంకాలు ఏమియు ఉండవు. ఒకవేళ ఉన్నవారు ఆటంకములన్నింటిని తొలగించుకొందురు. ఆ కాలమందు ఇంకొక పని జరుగును. అదేమిటంటే దైవారాధన అనగా దేవునిని పూజించుట. అద్భుతకరమైన పూజ. ఈ పూజ చూచుటకు లోకమందు అంతటా ఉన్న అన్ని దేశములలోనివారు ప్రధాన పట్టణమైన యెరూషలేమునకు వెళ్ళుదురు. ప్రయాణ సాధనము వారికి చాలా సుళువు. గాలి ఓడలు ఎక్కకుండానే సుళువుగా యెరూషలేము పట్టణమునకు ఎగిరి వెళ్ళిపోవుదురు మరియు ఆ కాలమందు ఇప్పటివలె పాపము చేయించేవారు ఉండరు, గనుక ఇప్పుడు జరుగుచున్నట్లు పాపక్రియలు జరుగవు. దెబ్బలాటలు, యుద్ధాలు ఉండవు. కత్తులు, తుపాకులు ఉండవు. అందరు సమాధానముగానే ఉందురు. మనుష్యులు వందలాది ఏండ్లు బ్రతుకుదురు. చావులు బహు అరుదు, ప్రజలు విస్తరించిపోదురు. ఇంకను భూమి మహాసమృద్ధిగా పండును. పంటకు పురుగు పట్టదు, అడవి జంతువులు, ప్రజల మధ్య, వీధులలో తిరుగును. భూలోక ప్రజలను ఏమియు చేయవు. మచ్చికగానే యుండును. భూమిమీద ప్రజలు వెయ్యేండ్లు సుఖముగా జీవించెదరు. ఎందుకంటే ఈ రాజ్యము క్రీస్తుది గనుక అందరు సుఖముగా జీవించెదరు. ఈ కథ ముగిసిపోయినది.

# సజీవులతీర్పు కథ

వెయ్యేండ్ల పరిపాలన చివరిలో బోధ విన్నవారందరిని యేసు క్రీస్తు వారు పోగుచేసి వారి తీర్మానము వింటారు. ఈ బోధ విననివారు ఏమి తీర్మానము చేసికొందురో తెలిసికొని క్రీస్తుప్రభువు వారికి తీర్పు వినిపిస్తారు. ఈ భూమిమీద క్రీస్తుప్రభువు సింహాసనమువేసి కూర్చుండి అందరిని పోగుచేయుదురు. దీవెన పొందినవారు కుడివైపున, శాపము పొందినవారు ఎడమ ప్రక్కన నిలువబడి తీర్పును వింటారు. దీవెన పొందినవారిని గొఱ్ఱెలకు పోల్చవచ్చును, శాపము పొందినవారిని మేకలకు పోల్చవచ్చును. అప్పుడు క్రీస్తుప్రభువువారు ఈ ప్రకారము తీర్పు వినిపించెదరు. దీవెన పొందిన వారలాలా! మీరు ఇతరులకు ఉపకారము చేసియున్నారు. గనుక నాకు చేసినట్లే గనుక నా తండ్రిచేత మీకు సిద్ధపరచిన రాజ్యమును స్వతంత్రించుకొనండి అని చెప్పును. శాపగ్రస్తులను చూచి మీరు ఆ విధముగా చేయలేదు గనుక అక్రమము చేయువారలారా, మీ కొరకు సిద్ధపరచిన నిత్యాగ్నిలోనికి పొండి అని తీర్పు విధించును.

# సైతాను విడుదల కథ

ఆ తరువాత యేసుక్రీస్తువారు చెరసాల తాళముతీసి సాతానును వదలిపెట్టును. అప్పుడు వాడు రౌద్రాకారముతో భూమిమీదకు వచ్చి దేవునితో యుద్ధము చేయవలెనని పటాలమును పోగుచేయును. వెయ్యేండ్ల పరిపాలనా కాలములో ఎంత బోధ విన్నను వారిలో కొందరు మారకుండగనే యుందురు. పాపముచేయించే వారు లేకపోయినను హృదయములో పాపనైజము ఉండును. ఆ నైజము తీసివేసికొంటేనే తప్ప మనిషి దేవునివైపు తిరుగడు. అటువంటి వారినందరిని సాతానుడు తన పటాలములో చేర్చుకుంటాడు. సాతాను పక్షముగా ఇటువంటివారు కొందరు ఉన్నారు. గనుక భూమిమీదకు వచ్చుటకు సాతానునకు దేవుడు సెలవిచ్చెను. లేనియెడల సెలవు ఇవ్వనే ఇవ్వరు. భూమి పుట్టిన 40 వందల ఏండ్లకు రక్షకుడైన ప్రభువు వచ్చెను. ఆయన వచ్చి మన కాలము నాటికి 20 వందల ఏండ్లు అయినది. మొత్తము ప్రభువునకు

ముందుగాని, ప్రభువునకు వెనుకగాని అరవైవందల ఏండ్లు అయినది. ఇన్నాళ్ళు సైతానుడు మనుష్యులను మోసముచేయుచునే వచ్చెను. ఆ మోసము చాలక మనుష్యులు ఉన్న భూమిమీదకు దేవుడు వానిని విడచివచ్చెను.

వెయ్యేండ్ల బోధయొక్క కాంతిని, యెరూషలేములోని దైవారాదన కాంతిని, కొందరు చూడలేక మూలమూలకు వెళ్ళుదురు. వారు చీకటి సంబంధులు, సాతాను స్వాధీనమందు ఉన్నవారు గనుక వారికి మార్పురాదు. వారినిబట్టి దేవుడు సైతానునకు భూమిమీదకు వచ్చుటకు సెలవు ఇవ్వవలసి వచ్చినది. భూమిమీద అనగా లోకమంతటిలో ఉన్న మనుష్యులందరు సైతానును అతని జట్టులో ఉన్న దయ్యములను అన్నింటిని బంధించి వేయుమని పట్టుదలగల ప్రార్థన చేసిన దేవుడు వానిని, వాని సైన్యమును ఒక్క నిమిషములోనే బంధించి వేయును. గాని మనుష్యులు అట్లు ప్రార్థనచేయగలరా? దేవుని పూజించవద్దు, పెద్దలకు లోబడవద్దు, మీ పగవాళ్ళను చంపండి, వ్యభిచార క్రియలు చేయండి, వారిమీద, వీరిమీద లేనిపోనివి కల్పించండి, అబద్ధసాక్ష్యములు పలుకండి అని ఇలాంటి తలంపులు సైతానుడు పుట్టించుటనుబట్టి వాటిని అంగీకరించు చున్నారు. ఆ ప్రకారముగా చేయుచున్నారు. వారు సాతానును కొట్టులో పెట్టి బంధించమని దేవునిని ఎట్లు ప్రార్థించగలరు? సైతాను మాట విన్నందువల్ల లోకములోనికి పాపము వచ్చినది. పాపమువల్ల ముళ్ళు, కుట్రలు, నష్టములు, కరువులు, కాటకాలు, విషపురుగులు, జబ్బులు, భూకంపములు ఇతర పాపాలు వచ్చినవి. నరుడు దేవునికి ప్రార్థన చేసికొని పాపాలు లేకుండ చేసికొనవలసినది గాని లేకుండ చేసికొన్నాడా? ఉన్నకొలది పాపములు ఇంకా వృద్ధి అగుచునే ఉన్నవి. పాపమువల్లనేకదా నరకము, పాపమువల్లనేకదా మరణము, వీటన్నిటికి మూల కారణము సాతానుడేకదా. సైతానుడి మాటలు మనిషి ఎందుకు వినాలి చెప్పండి? సైతాను వెయ్యేండ్లు ఖైదులో ఉన్నాడు కదా మారినాడా? మారలేదు. మారియుంటే దేవునితో యుద్ధము చేయుటకు పటాలమును ఎందుకు పోగుచేస్తాడు? దేవుని చూసి మహాప్రభూ! లోకానికి నేను తెచ్చిపెట్టిన కుమ్మరమే ఇది అంతా, నన్ను క్షమించండి అని అడిగితే

దేవుడు క్షమించడా? ఆయన క్షమించగలడు. దేవుడు ప్రేమాస్వరూపి, జాలిగలవాడు, ఎవరును నశించుటకు ఆయనకు ఇష్టములేదు సాతానుడు ప్రార్థించడు, అతనికి మారుమనస్సురాదు, వెయ్యేండ్ల పిమ్మట విడుదల చేసిన తరువాత యుద్ధములో ఓడిపోవును. అతని పటాలాన్ని అగ్ని దహించివేయును. అతనిని, అతని సైన్యమును యేసుప్రభువు అగ్ని గుండములో పడవేయును. అంతటితో అతని కథ సమాప్తి.

# అంత్య తీర్పు కథ

ఆ అగ్నిగుండములో అదివరకే అంతెక్రీస్తు, అబద్ధప్రవక్త, దురాత్మలు ఉండటము వెయ్యేండ్ల కాలములో కూడ అక్కడే ఉండడము జరిగినది. వారితో ఇప్పుడు వారి అధిపతియైన సైతానుకూడ చేరినాడు. ఇప్పుడు భూమి పుట్టినది మొదలుకొని ఆ నిమిషము వరకు సమాధిలో ఉన్న మారని వారందరిని క్రీస్తుప్రభువు లేపి వారందరిని ఒకచోట పోగుచేయును. సమాధిలోనున్న వారందరూ క్రీస్తుప్రభుని పిలుపును వినగలరు. ధూళిలో, నీళ్ళలో కలిసిపోయిన వారందరును తిరిగిలేచెదరు. వారితో ప్రభువు మాట్లాడి వారి క్రియలనుబట్టి వారికి తీర్పు విధించెదరు. ఇదే ఆఖరి తీర్పు. బ్రతికి వచ్చిన వారిలో కొందరు క్రీస్తుప్రభువును ఏమి అడుగుదురో వినండి. అయ్యా! నీ పేరుమీద గొప్ప గొప్ప పనులు చేసితిమి, మీ పేరుమీద అనేకులను స్వస్థపరచితిమి, మీ పేరుమీద దయ్యములను వెళ్ళగొట్టితిమి అని ఆయన ఎదుట అందురు. ఈ విధముగా జరుగనైయున్నది. ఈ ప్రశ్న అడిగే వారు ఎవరంటే ఒకప్పుడు వారు బోధకులై ఉండాలి. ఒకప్పుడు యేసు నామమున గొప్ప పనులు చేసియుండాలి. ఒకప్పుడు యేసునామమున అద్భుతాలు చేసి ఉండాలి. గాని తరువాత సాతాను ప్రేరేపణనుబట్టి లోకములో పడిపోయి చెడిపోయి ఉంటారు. చూచినారా! ఒకప్పుడు బాగుగా బ్రతికితే మాత్రము చివరకు చెడిపోతే లాభమేమి? గనుక మనమందరము జాగ్రత్తగా చివరివరకు దేవుని యందు భయభక్తులు కలిగి నడుచుకోవాలి.

# చివర ఉండిపోయే వారి కథ

భూమిమీద కొందరు భక్తులు ఇంకా మిగిలిపోదురు గాని వారు భూమిమీదనే ఉందురు గాని పరలోకమునకు వెళ్ళరు. ఈ భూలోకమే అప్పుడు పరలోకములో ఒక భాగమగును. నా ప్రసంగము కథ అయ్యిపోయినట్లే.

1. మొదటిసారి క్రీస్తు రాకడ కాలములో క్రీస్తుతో వెళ్ళినవారు మహా మహిమ కలిగిన మహాకాంతిగల స్థలములో నూతన యెరూషలేమను స్థలములో ఉందురు.

2. రాకడ పిమ్మట ఏడేండ్ల మహాశ్రమలో మారినవారు మోక్షములో ఇంకొక స్థలములో ఉందురు.

3. ఆఖరి తీర్పు అయిన పిమ్మట భూమిమీద ఉండిపోయే భక్తులు శాశ్వతకాలము భూమిమీదనే ఉందురు. ఎందుకంటే భూమికూడ అప్పటికి మోక్షములో ఒక భాగమైపోవును. క్రీస్తుప్రభువు ఈ లోకమును పరిశుద్ధపరచి నూతన భూమిగా మార్చును. ఈ మూడు పరిశుద్ధ లోకములలో ప్రభువు ఉందురు. ప్రతివారియొక్క దైవభక్తిని బట్టి వారు నరలోకములో సంపాదించుకొన్న మహిమకాంతిని బట్టి అంతస్థునుబట్టి ప్రభువు వారిని అనంతకాలము ప్రత్యక్షమగుచు ఉందురు. మీరు ఏ లోకములోనికి తయారగుచున్నారో, ఏ లోకములోనికి చేరుకొందురో ఇప్పుడే నిర్ణయించుకొనవలెను. ఇప్పటి వరకు అనాది కాలమునుండి అనంతకాలము వరకు ఉన్న కథ నీ్న చదివియున్నారు. గనుక మీకు ఒక ప్రశ్నవేయుటకు నాకు హక్కు ఉన్నది. అదేమంటే ఇవన్నీ తెలిసికొన్న మీరు ఏమి తీర్మానము చేసికొందురు? ఇదే నా ప్రశ్న. తరువాత తీర్మానము చేసికొందును అని అంటే అదియు మనకు వల్లబడదు. తరువాత అని అంటే ఇంకొక తరువాత రాక తప్పదు. ఆ తరువాత మరియొక తరువాత వచ్చును. బ్రతికినంత కాలమంతయు తరువాత అనే మాటతోనే సరిపోవును. ఈ తరువాతలన్ని మీరు ఏర్పరచుకొను తీర్మానాలన్నింటికి అడ్డము వచ్చే తరువాతలే గనుక మీ మనస్సులో ఇప్పుడే తీర్మానము చేసికొని ఆ తీర్మానమును ఇప్పుడే దేవునికి చెప్పివేయండి. మీ

తీర్మాన ప్రకారము గడిచేటట్లు దేవుని సహాయము కోరుకొనండి. ఆయన తప్పకుండా మీకు బలమును, శక్తిని దయచేయును. ప్రభువు మీ ప్రార్ధన వినకపోతే యేసుక్రీస్తే మన నరలోకానికి వచ్చినారనునది బూడిదలో పోసిన పన్నీరు అగును. గనుక తప్పకుండగ మీ తీర్మానము ఆయన చిత్త ప్రకారము ఉన్నయెడల అంతా సఫలము చేయును.

# గడువుల కథ

మనిషి మారుటకు దేవుడిచ్చు గడువులను గూర్చి గూడ తెలిసికొనుట మంచిదే. మనిషి బ్రతికియున్నంతకాలము భూలోకములో దేవుడు కష్టములను రానిచ్చును. కష్టములలో మనిషి మారుటకు దేవుడు అనేక మేళ్ళుచేయును. మనిషి మారుటకు దేవుడు తన స్వంత మనస్సుచేత బోధచేయించును. ఆయావారిచేత బోధ చెప్పించును. చనిపోయే సమయమునకు దేవదూతలచే బోధచేయించును. ఇంకా కొంచెము సమయమునకు మనిషి చనిపోయి నరక మార్గమున వెళ్ళిపోవును అనే సమయమునకు కూడ దేవదూతలచే బోధ చేయించును. చనిపోయిన తరువాత దయ్యములు చీకటి కొట్టులోనికి లాగుకొని పోయిన తరువాత కూడ పరలోక భక్తులను, దూతలను పంపించి బోధ చేయించును. మనిషి ఈ చీకటి కొట్టులోనైన మారుటకు దేవుడు గడువు ఇచ్చెను. అయినా మనిషి మారలేడు. ఈ భూమిమీదే మనిషి మారవలెను గాని తీరా చీకటి బిలములోనికి వెళ్ళిపోయిన తరువాత మారవలెనంటే చాలా కష్టతరము. ఒకవేళ చీకటి బిలములో మారిన యెడల సంతోషమే. క్రీస్తు ప్రభువుకూడ బిలములోనికి వచ్చి బోధచేయును. ఈ సంగతి ఇప్పుడు మీరు చదివియున్నారు. చనిపోయిన తరువాత కూడ గడువు ఉన్నదికదా! అని మీరు అనుకొనవచ్చును. బిలములోనికి వెళ్ళిన తరువాత పాపములు మానివేసి పశ్చాత్తాపపడుదును, తండ్రీ! నా పాపములను క్షమించుమని బ్రతిమాలుకొందును అని అనుకొందురేమో ఈ విధముగా మీరు అనుకొని నిర్లక్ష్యముగా ఉన్న యెడల మీరు పొందిన గడువును మీరే పోగొట్టుకొను వారగుదురు. బిలములోనికి వెళ్ళిన తరువాత వారి మనస్సులు మరి కఠినములై పోవును.

భక్తులు, దూతలు వచ్చి మారుమనస్సు నిమిత్తమై బోధచేసిన దయ్యాలే భక్తులవలెను, దూతలవలెను మారువేషములు వేసికొనివచ్చి చెప్పుచున్నాయని అనుకొందురు. దేవునికి నిజముగా మా మీద అంత ప్రేమ ఉన్న యెడల భూలోకములోనే మమ్మును మార్చలేకపోయినాడా అని దేవునిని కూడ నిందించుదురు. కొందరు మారవచ్చును.

ఇంకొక సంగతి తెలిసికొనండి. నరలోకమంతటికి దేవుడు గడువులపై గడువులు ఇచ్చుచునేయున్నారు. క్రీస్తువారు మొదటిసారి తన భక్తులను తీసికొని వెళ్ళిన తరువాత అది చూచి అయినా మారవచ్చును. అది చూచిన కొందరు మారినయెడల క్రీస్తుప్రభువు వారినికూడ తీసికొని వెళ్ళును. వెళ్ళినవారిని చూచి అయినా మారవచ్చును. కాని అప్పుడు మారరు. ఆ తరువాత ఏడేండ్ల శ్రమకాలములో శ్రమను బట్టి ప్రభువును ఆశ్రయించగా వారినికూడ ప్రభువు తీసికొనివెళ్ళును. వెళ్ళిన వారిని చూచినప్పుడైనా మారవచ్చునుగదా! అప్పుడు కూడ మారరు.

హర్మగెద్దోను యుద్ధములో సైతాను, అంతెక్రీస్తు, అబద్ధప్రవక్త, దయ్యములు శిక్షింపబడనైయున్నవి అదిచూచి అయినా మారవచ్చునుగదా! వెయ్యేండ్ల శాంతిపరిపాలనలో సువార్త విని మారవచ్చునుగదా? క్రీస్తుప్రభువు అంత్యతీర్పు తీర్చునప్పుడు అది చూచి అయినా మారవచ్చునుగదా? క్రీస్తు ప్రభువు అంత్యతీర్పు కాలములో చనిపోయిన వారినికూడ లేపుదురు అది చూచి అయినా మారవచ్చునుగదా? ఇన్ని గడువులు ఇచ్చే దేవుని మ్రొక్కండి. స్తోత్రమని చెప్పండి. మీతో నేను ఒక వాదము పెట్టుకొవలయునని ఉన్నది. అది ఏమనగా మనము దేవునిమీద నేరము మోపవచ్చునా? దేవదూత దేవుని ఎదిరించి సైతానైపోవుట దేవుని తప్పేనా? ఆ సైతాను మాట విని నరుడు చెడిపోవుట దేవుని తప్పేనా?

ఉదా:- ఒక కుర్రవాడు చెట్టెక్కి దిక్కులు చూచి తనకాలు విరుగకొట్టుకొనెను. ఆ కుర్రవాని లేవనెత్తుట ఆ కుర్రవాని తండ్రి తప్పేనా? మనిషి పాపములో పడిపోయినాడని చెప్పి దేవుడు యేసుక్రీస్తై వచ్చి పడిపోయిన వానిని రక్షించెదను అని అనకపోతే మన పని ఏమగునో మీరు చూచుకొనండి. దేవుడు పాపము

చేయించడు, జబ్బులను పంపడు, కరువులు, భూకంపములు, ఇతర కష్టములు కలుగజేయడు. మరణమును మనమీదకు వదిలిపెట్టడు. మనిషి తన పాపాల వల్ల ఇవన్నియు తెచ్చుకొంటున్నాడు. ఎలాగంటే అజాగ్రత్తగా నుండి ముళ్ళదారిన నడచి, ముళ్ళుగుచ్చుకొనగా ఎంత ప్రయత్నము చేసిన రాలేదు. ఒక నెల దినాలు బాధపెట్టినది. ముళ్ళు గుచ్చుకోవటము, బాధపెట్టటము తండ్రి తప్పేనా? పరలోకమందున్న తండ్రి మన నిమిత్తమై ఆకాశముచేసి సూర్య, చంద్ర, నక్షత్రాదులను ఏర్పరచి, ఇంత భూమిని కలుగజేసి, నీళ్ళు, పాడిపంటలు, ధనము, నగలు, ఇవన్నియు చేసిన దేవుడు కష్టములను పంపునా? మంచి బుద్ధి, జ్ఞానము, విద్య, పరిశుద్ధత, పనిచేసికొనే శక్తి, పాటలు పాడే రాగము, వాక్కు, చూపు, వినికిడి, ఆరోగ్యము, పండ్లు, పువ్వులు దయచేసిన దేవుడు మనమీదకు కష్టములు పంపునా? దైవభక్తి, విశ్వాసము, ప్రార్థించే మనస్సు, మోక్షము మనకు ఇవ్వవలెనని ఉన్న దేవుడు మనమీదకు కష్టములు పంపునా? చదువుకొని బాగుపడండి అని లోకానికి బైబిలు గ్రంథమును పంపిన దేవుడు మనకు కష్టములు పంపునా? మనము బాగుపడ వలయునని భూలోకమంతటా తిరిగి బోధించే బోధకులను పంపిన దేవుడు మనకు చిక్కులు పంపునా? పరలోకమందున్న దేవుడు మనందరికి తండ్రియైయున్నాడు. అట్టి తండ్రి మనలను చిక్కుపెట్టి చంపునా? సైతాను యొక్క ఆలోచనలు, పిశాచములయొక్క ఆలోచనలు దయ్యములయొక్క ఆలోచనలు ఆలకించే మనిషియొక్క నైజమునుబట్టి, కష్టములు వచ్చుచున్నవి గాని దేవుని బట్టి గాదు, దూతలనుబట్టి భక్తులనుబట్టి కష్టములు మనకురావు. ఈ మాట నమ్మేవారు ధన్యులు.

# సలాము కథ

సలాము అంటే సమాధానము, శాంతి, క్షేమము అని అర్ధము. సలాము అని అంటే మీకు క్షేమము కలుగునుగాక అని మర్యాద చేసేమాట. దేవుడే యేసుక్రీస్తై భూమిమీద వెలసినాడు. యేసుక్రీస్తు భూలోకములోనికి వచ్చి అనేక బోధలుచేసినాడు. సిలువమ్రానుమీద మన పాపభారమంతయు ఎత్తుకున్నాడు. సమాధిలోనుండి బ్రతికి తిరిగి లేచినాడు. దేవుడు యేసుక్రీస్తైయుండి

మోక్షలోకములోనికి వెళ్ళినాడు. దేవుడే యేసుక్రీస్తుగా నిండి, సర్వలోకములో తన మతము అనగా క్రైస్తవమతము వ్యాపింపచేసెను. దేవుడే యేసుక్రీస్తుగా వచ్చి భక్తులను మోక్షమునకు తీసికొనివెళ్ళును. దేవుడే యేసుక్రీస్తుగా వచ్చి నరులను పాపములో పడవేసిన సైతానును, దయ్యములను నరకాగ్నిలో పడవేయును. నమ్మనివారిని గూడ అందులో పడవేయును. దేవుడే యేసుక్రీస్తుగా వచ్చి, మారిన భూమిమీద వెయ్యేండ్లు శాంతిపాలన చేయును. దేవుడే యేసుక్రీస్తుగావచ్చి ఈ లోకములో, పరలోకములో ఏక రక్షకుడుగా తన్నుతాను బాగుగా బయలుపరచుకొనును. ఈ కథ అంతయు ఇప్పుడు నేను మీకు చెప్పకపోతే రేపు ప్రొద్దుట మీరు మమ్ములను ఏమంటారో? ఎందుకు మీరు మాకు చెప్పలేదని అంటారు. గనుక ఇప్పుడే ఈ కథ అంతయు చెప్పివేసినాను. ఇది నిజమో కాదో మీరు మీ ఇంటిలో మోకాళ్ళు ఊని దేవునిని ప్రార్థించి తెలుసుకొనండి. దేవుని ప్రార్థించి తెలిసికొనకుండగా ఈ బోధ తప్పు అని మీరు అంటే ఆ పూచీమీదే. దేవుని ఎదుట మీరే జవాబుదారులు అగుదురు.

సీ॥ మనకు సర్వంబు చేసిన తండ్రి ప్రతిరోజు ఏమి కావలసిన ఇచ్చుగాక – నరులను రక్షింప – నరుడైవచ్చిన క్రీస్తుదేవుండు రక్షించుగాక – దైవ కథలకు నర్థమునేర్పు దైవాత్మచిక్కు మర్మాలు విడచెప్పుగాక

మనకు కావలియుండు తనగోరు దూతలెవ్వరు గండము తప్పించు గాక – తోడినరుల స్నేహము – సమకూడు గాక – పనులలో పశు వులతోడు – వనరు గాక – అన్నిటికి అన్ని సమయాన – కమరు గాక – ఎల్లవేళల బ్రతుకు వర్ధిల్లుగాక.

***(చాయ : మంగళమే – యేసునకు)***

మంగళ స్తోత్రార్పణలు – మహనీయ దేవునికి – అంగున్న లేకున్న అంతములేని స్తుతులు మంగళార్చ ॥మంగళ॥

1. ఎట్టివారినైన – ఏ స్థలమునందైన – పట్టి రక్షించుటకై – పాట్లొందు తండ్రికి మంగళార్చ ॥మంగళ॥

2. యేసుక్రీస్తైవచ్చి - యిల మానవుల మధ్య - వాసంబుజేసిన పరమ దేవునికి మంగళార్చ ॥మంగళ॥

3. నరులకు తండ్రిగా - వరరక్షపుత్రుడుగా - పరిశుద్ధాత్మ్ముండుగా బైలైన దేవునికి మంగళార్చ ॥మంగళ॥

ఓ ప్రియులారా! పుణ్యకథలు విన్న స్నేహితులారా! మిమ్ములను, మీ పిల్లలను, మీ స్వజనులను యేసుక్రీస్తువారు దీవించునుగాక! మీరందరు శుభోజయముగా వర్ధిల్లుదురుగాక! మీకందరకు పాడిపంటలు లభించునుగాక! సుఖము, సత్యము అనుగ్రహించే జ్ఞానము, దైవశక్తి, తుదకు మోక్షము లభించునుగాక! మీకందరకు మా హృదయపూర్వక వందనాలు, మీకందరకు మా ప్రేమ సలాములు.

# రక్షణ వాణి

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2024 చందా : 15.00

Bible Mission HQ Guntur

| | | | |
|---|---|---|---|
| మొదటి ముద్రణ | 1999 | ప్రతులు | 5000 |
| రెండవ ముద్రణ | 2009 | ప్రతులు | 5000 |
| మూడవ ముద్రణ | 2018 | ప్రతులు | 1000 |
| నాల్గవ ముద్రణ | 2020 | ప్రతులు | 2000 |
| ఐదవ ముద్రణ | 2021 | ప్రతులు | 2000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

# ప్రారంభ వాణి

ప్రభువునందు ప్రియులరా! ప్రభువు నామమున మీకు శుభములు కలుగునుగాక. అనాదిలో దేవుడు ఒంటరిగానే ఉండెను. ఆయన సృజింపబడలేదు. తన సహవాసములో ఉండుటకై తన స్వరూపమునందు నరుని కలుగజేయవలెనను నదే దేవుని అభీష్టమాయెను. అందునుబట్టి నరుని కలుగజేసెను. నరుడు పడిపోవునను సంగతి పరమందున్న దేవునికి తెలిసి యున్నను దేవుడు శ్రమనొందుటకు ఇష్టము కలిగినవాడాయెను. అందునుబట్టి ఒక సంకల్పము దేవుడు ఏర్పరచుకొనెను. దానినే రక్షణ మహాసంకల్పము అని అందురు. ఈ కార్యక్రమమును బైబిలు మిషను బయలుపరచిన **యం. దేవదాసు అయ్యగారు** మిక్కిలి సుళువైన శైలిలో అందరికి తెలియచేసెను. ఈ రీతిగా అనేకులకు అర్ధమగునట్లు చార్టుల రూపములోను, బూర ప్రసంగ రూపములలోను, దండక రూపములోను, పద్యరూపములోను వ్రాసిరి.

దేవదాసు అయ్యగారు గొప్ప గొప్ప పారమార్థిక విషయములు క్రైస్తవులు, క్రైస్తవేత్తరులు తెలిసికొనగలుగు నిమిత్తమై **"రక్షణ వాణి"** అను పుస్తకములో కథల రూపములో తెలిసిజేసిరి. ఈ రక్షణ సంకల్పన ఒక వల వంటిది. ఈ వల అనేకులను రక్షణ మార్గములోనికి నడిపించగలుగు నిమిత్తము వేయబడినదై యున్నది. ఈ పుస్తకమునందు జరిగిన అనేక కథలుద్వారా భూలోక, పరలోకమందు జరగబోయే సంగతులను ఆత్మప్రేరేపణబట్టి అయ్యగారు బహు విపులముగా వ్రాసిరి. ఈ చిన్న పుస్తకముద్వారా అనేకులు రాకడకుసిద్ధపడుగలుగు రీతిగా ప్రేరేపింపబడి మహిమ మేఘము నెక్కవలెనను నది మా అభిలాష. ప్రభువు మీకు తోడైయుండునుగాక.

ఇట్లు

పెండ్లికుమారుడుగా రానైయున్న ప్రభువునందలి

**ప్రసిడెంటు, బైబిలుమిషను**

బేతేలు గృహము, రైలుపేట,
గుంటూరు - 522001.
సెప్టెంబర్ - 2020

Bible Mission HQ Guntur